SIMULTANEOUSLY PUBLISHED FROM VIJAYAWADA & MADRAS

ఆంధ్రపత్రిక

FOUNDER : DESODHARAKA K. NAGESWARA RAO

ఉదయం *** విజయవాడ మంగళవారం 5—1—1971 Regd. H. No. 506 THE ANDHRA PATRIKA సంపుటి 57 సంచిక 272 6 పుటలు 12 పైసలు

శాఖ
303688

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
చందా వివరాలు

	ఏజెంటుద్వారా రూ. పై.	పోస్టుద్వారా రూ. పై.
సంవత్సర చందా	20—80	26—00
అర్ధ సంవత్సరం	10—40	13—00
మూడు నెలలకు	5—20	6—50
విడి ప్రతి	0—40	

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
ప్రతి శుక్రవారం
క్రొత్త సీరియల్స్‌తో, వ్యంగ్య చిత్రాలతో
తాజా సినీ వార్తలతో వెలువడుచున్నది
ప్రతివారం తప్పక చదువుచున్నారా?

తమిళనాడు శాసనసభ రద్దు : ముఖ్యమంత్రి సిఫార్సు ఆమోదం

గవర్నర్ అధికార ప్రకటన

మంత్రివర్గం రాజీనామా చేయాలని సంస్థా కాంగ్రెస్ నాయకుడు కరుతిరుమన్ సూచన

మద్రాసు, జనవరి 4:

235 మంది సభ్యులు గల తమిళనాడు శాసనసభ రేపటి నుంచి రద్దులయింది. లోక్‌సభతోపాటు శాసనసభకు కూడా మధ్యంతర ఎన్నికలు జరిపించాలనే అభిప్రాయంతో ముఖ్యమంత్రి చేసిన సిఫార్సుమీద రద్దులయిన తొలి శాసనసభ ఇదే.

ముఖ్యమంత్రి సోమవారం ఉదయం గవర్నరును కలుసుకుని, మంగళవారంనుంచి శాసనసభను రద్దు చేయాలని సిఫార్సు చేస్తూ మంత్రివర్గం చేసిన నిర్ణయాన్ని తెలియజేశారని రాజభవన్‌నుంచి సాయంకాలం 5 గంటలకు అధికార ప్రకటన జారీ అయింది.

"సోషలిస్టు, మత ప్రసక్తి లేని కార్యక్రమాలు, విధానాలు అమలు జరపడంలో ప్రజలనుంచి క్రొత్తగా అధికారం పొందే ఉద్దేశ్యంతోను, లోక్‌సభ ఎన్నికలతోపాటు శాసనసభకుకూడా ఎన్నికలు జరిపించడానికిగాను ఈ సిఫార్సు ఉద్దేశించబడింది.

శాసనసభలో ముఖ్యమంత్రికి పూర్తి సంఖ్యాబలం ఉన్నప్పటికీ శాసనసభను రద్దు చేయాలని ముఖ్యమంత్రి గవర్నరుకు సిఫార్సు చేశారు. అయితే ప్రజలనుంచి క్రొత్త అధికారం పొందడానికి ఇలా చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు.

లోక్‌సభలోని కొందరు డి. ఎం. కె. సభ్యులు రాష్ట్ర రాజకీయాలలో ప్రవేశించదలుస్తున్నారు. శాసనసభలోని కొందరు డి. ఎం. కె. సభ్యులుకూడా శాసనసభకు మధ్యంతర ఎన్నికలు కోరుతున్నారు. అయితే శాసనసభ ఎన్నికలకు 1972 ఉత్తమమైనదని భావించేవారుకూడా కొందరున్నారు.

డి. ఎం. కె. సర్వసభ్య సమావేశం మొన్న జరిగినప్పుడు, శాసనసభ రద్దు సమస్యపై తుది నిర్ణయం చేసే అధికారం పార్టీ అధ్యక్ష కార్యదర్శులకు ఇచ్చారు. సభ్యులలో అధిక సంఖ్యాకులు శాసనసభ రద్దు కావాలని కోరారు.

రాష్ట్ర మంత్రివర్గం నేటి ఉదయం కొన్ని నిముషాల సేపు సమావేశమై, శాసనసభ రద్దుకు అనుకూలంగా గవర్నరుకు సిఫార్సు చేస్తూ తీర్మానం చేసింది.

ఆ తర్వాత ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధి విద్యామంత్రి శ్రీ నెడుంచెజియన్, న్యాయశాఖా మంత్రి శ్రీ మాధవన్ గవర్నరును కలుసుకుని, మంత్రివర్గం సిఫార్సును అందజేసి శాసనసభ రద్దును కోరారు.

ఇప్పుడు రద్దయిన 235 మంది గల శాసనసభలో వివిధ పార్టీల బలాబలాలు ఇవి:— డి. ఎం. కె. (సభాపతి మినహా) 137 వ్యవస్థా కాంగ్రెసు 41, క్రొత్త కాంగ్రెసు 8, స్వతంత్ర 11, అతివాద కమ్యూనిస్టు 10, ఫార్వర్డ్ 7, పి. ఎస్. పి. 4, ముస్లింలీగ్ 2, మితవాద కమ్యూనిస్టు 3, సి. పి. 1, రిపబ్లికన్ 1, తమిళ అరసు కళగం 1, ఇండిపెండెంట్లు 3, ఖాళీ 5.

గవర్నర్ ఢిల్లీ పయనం

తమిళనాడు గవర్నర్ సర్దార్ ఉజ్జల్‌సింగ్ నేడు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఆయన 8 వ తేదీన మద్రాసు తిరిగి వస్తారు.

శ్రీ కరుతిరుమన్ ప్రకటన

శాసనసభ రద్దుకు నిర్ణయం తీసుకోవడానికి ముందు ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధి ప్రతిపక్ష నాయకులతో సంప్రతింపులు జరపాలని తమిళనాడు శాసనసభలో సంస్థా కాంగ్రెస్ నాయకుడు శ్రీ కరుతిరుమన్ నేడు సూచించారు.

ఆ విధంగా చేయకపోతే అది ప్రజాస్వామ్య విరుద్ధమని, నియంతృత్వం కాగలదని ఆయన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

డి. ఎం. కె. మంత్రివర్గానికి ప్రజలలో విశ్వాసం ఉన్నట్లయితే శాసనసభ రద్దుకాగానే ఎన్నికలు సక్రమంగా స్వేచ్ఛగా నిర్వహింపబడడానికి వీలుగా రాజీనామా చేయాలని, ఆపద్ధర్మ ప్రభుత్వంగా కొనసాగరాదని శ్రీ కరుతిరుమన్ అన్నారు.

తాను అధికారంలోకి వస్తే ఎన్నికలకు 6 నెలలు ముందుగా తాము రాజీనామా చేయగలమని 1967లో ముఖ్యమంత్రి పార్టీ ఎన్నికల వాగ్దానం చేసిన విషయం తాను గుర్తు చేస్తున్నానని ఆయన అన్నారు.

కేంద్రంలో మైనారిటీ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న శ్రీమతి ఇందిరాగాంధి నియంతృత్వ ధోరణిలో ప్రతిపక్షాలతో సంప్రతింపులు జరపకుండా లోక్‌సభ రద్దు చేశారని, తమిళనాడులో శ్రీ కరుణానిధి ఆమెను అనుసరించాలని అనుకుంటున్నట్లు కనిపిస్తున్నదని ఆయన అన్నారు.

లోక్‌సభ రద్దయి పోయినందున, ప్రస్తుత ప్రభుత్వం ఆపద్ధర్మ ప్రభుత్వం అయినందున...

ఆంధ్రలో లోక్‌సభ సీట్లు

క్రొత్తకాంగ్రెస్ అభ్యర్థులు

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, జనవరి 4: క్రొత్తకాంగ్రెస్ పక్షాన ఆంధ్రలో ఆయా నియోజక వర్గాలకు ప్రస్తుతం ఆలోచనలోవున్న అభ్యర్థుల పేర్లు ఈ క్రిందివిధంగా వున్నాయి.

(1) శ్రీకాకుళం—శ్రీ బొడ్డేపల్లి రాజగోపాలరావు, (2) బొబ్బిలి—డాక్టర్ కె. నారాయణరావు, (3) కాకినాడ—శ్రీ మల్లిపూడి శ్రీరామసంజీవరావు, (4) రాజమండ్రి—శ్రీ బలుసు ప్రభాకర సుబ్రహ్మణ్య ...రావు, (5) అమలాపురం—శ్రీ బి. ఎస్. మూర్తి, (6) నర్సాపురం—శ్రీ ఎం. టి. రాజు లేక శ్రీ జి. ఎస్. రాజు, (7) ఏలూరు—శ్రీ కొమ్మారెడ్డి సూర్యనారాయణ (8) బందరు—శ్రీ మేడూరి నాగేశ్వరరావు (9) విజయవాడ—డా: కె. ఎల్. రావు (10) గుడివాడ—శ్రీ మాగంటి అంకినీడు, (11) గుంటూరు—శ్రీ కొత్త రఘురామయ్య, (12) నర్సారావుపేట—శ్రీ మద్ది సుదర్శనం (13) ఒంగోలు—మంత్రి శ్రీ పాములపాటి అంకినీడు ప్రసాదరావు (14) కావలి—శ్రీ పులి వెంకటరెడ్డి, (15) చిత్తూరు—శ్రీ ఆర్. నరసింహారెడ్డి, (16) రాజంపేట—శ్రీ పి. పార్థసారథి, (17) హిందూపురం—శ్రీ పాముదుర్తి బాపయ్యరెడ్డి, (18) అనంతపురం—శ్రీ ఆంటోనిరెడ్డి లేక శ్రీ కె. వి. వేమారెడ్డి లేక శ్రీ పి. ఎ. చౌదరి (19) నంద్యాల—శ్రీ బి. వి. సుబ్బారెడ్డి లేక కందుల ఓబులరెడ్డి లేక వెంగళరెడ్డి, (20) కడప స్థానానికి మితవాద కమ్యూనిస్టు పార్టీకి చెందిన, ఇంతవరకు సభ్యులుగా వున్న శ్రీ వై. ఈశ్వరరెడ్డిని బలపరచే విషయం ఇంకా ఆలోచనలోవున్నట్లు తెలుస్తున్నది, (21) విశాఖపట్టణం—శ్రీ తెన్నేటి విశ్వనాధంగారిని బలపరచాలని పార్టీ నిర్ణయించింది.

లోక్‌సభకు రాష్ట్రంనుంచి క్రొత్త కాంగ్రెసు అభ్యర్థులు

నిర్ణయాధికారం ముఖ్యమంత్రికి. పి. సి. సి. అధ్యక్షునికి అప్పగింత

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, జనవరి 4 : ఆంధ్ర ప్రదేశ్‌నుంచి లోక్‌సభకు జరిగే మధ్యంతర ఎన్నికలలో క్రొత్త కాంగ్రెసు పార్టీ అభ్యర్థులను నిర్ణయించి, జాబితాను కేంద్ర పార్లమెంటరీ బోర్డుకు సమర్పించే అధికారాన్ని క్రొత్త కాంగ్రెసు పార్టీ ప్రదేశ్ ఎన్నికల సంఘం నేడు పార్టీ అధ్యక్షుడు శ్రీ పి. నరసారెడ్డి, ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి గార్లకు అప్పగించింది.

ప్రదేశ్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ జైపాల్‌రెడ్డి ఎన్నికల సంఘం నిర్ణయాన్ని పత్రికా ప్రతినిధుల సమావేశంలో తెలియజేశారు. ఈ సమావేశంలోనే మరో కార్యదర్శి శ్రీ ఎం. వి. కృష్ణారావు మధ్యంతర ఎన్నికల ప్రచార సన్నాహాలు గురించి ఒక ప్రకటనను విడుదల చేస్తూ, పార్టీ అభ్యర్థుల నిర్ణయం ఈ నెల రెండవ వారంలో జరుగ వచ్చునని తెలియజేశారు.

ప్రదేశ్ కాంగ్రెసు ఎన్నికల సంఘం సిఫార్సు చేసే అభ్యర్థుల జాబితాపై కేంద్ర పార్లమెంటరీ బోర్డు ఈ నెల 7న ఢిల్లీలో జరిగే సమావేశంలో ఒక నిర్ణయం చేయవలసి ఉన్నది. అయితే జనవరి 7న ఈ సమావేశం జరగదని, వాయిదా పడుతుందని తెలుస్తున్నది.

ఖరారైన అభ్యర్థుల జాబితాను తీసుకుని, 7తేదీన జరిగే కేంద్ర పార్లమెంటరీ బోర్డు సమావేశానికి వెళ్లడానికి కొన్ని అనివార్య కారణాల వల్ల వీలుపడదని, అందువల్ల పార్లమెంటరీ బోర్డు సమావేశం వాయిదా పడుతుందని పార్టీ ప్రతినిధి ఒకరు అన్నారు.

పరిస్థితినిబట్టి వీలైన చోట్ల ప్రతిపక్షాలలోని వామపక్షాలతో క్రొత్త కాంగ్రెసు సర్దుబాట్లు చేసుకోవచ్చునని అభిప్రాయం పార్టీలో వ్యక్తం కావడంవల్ల నిన్న జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ సర్దుబాట్ల ఏర్పాటుకు అధికారాన్ని ముఖ్యమంత్రికి, ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షునికి ఇచ్చారు.

రాష్ట్రంలో 41 స్థానాలకు పోటీ చేయడం జరుగుతుందని, అయితే ఈ సంఖ్య ప్రతిపక్ష పార్టీలతో ఏర్పడే సర్దుబాట్లను బట్టి ఉంటుందని, పార్టీ ప్రతినిధి అన్నారు. ప్రతిపక్ష కాంగ్రెసు, స్వతంత్ర, జనసంఘం, మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీలతో ఎట్టి పరిస్థితులలోను ఏ రకమైన సంబంధంగాని పెట్టుకోవడం మాత్రం జరుగదని ఆయన స్పష్టీకరించారు.

నేటి సాయంత్రం దాదాపు రెండు గంటలసేపు ప్రదేశ్ కాంగ్రెసు ఎన్నికల సంఘం, పార్టీ అధ్యక్షుడు శ్రీ నరసారెడ్డి అధ్యక్షతన గాంధీభవనములోని పార్టీ కార్యాలయంలో సమావేశమై అభ్యర్థులను గురించి చర్చించింది.

72లోనే తెలంగాణా సమస్య పరిష్కారం

ప్రజాసమితి ప్రత్యేక సంఘం సిఫారసు

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, జనవరి 4: తెలంగాణా ప్రజాసమితి నియమించిన ప్రత్యేక సంఘం ప్రధాన మంత్రి చేసిన ప్రతిపాదనపై జరిపిన చర్చల అనంతరం, 1977 వరకుగాక, 1972 లోనే తెలంగాణా సమస్య పరిష్కరింపబడాలని తీర్మానంలో ఉదహరిస్తున్నట్లు తెలుస్తున్నది.

ప్రత్యేక సంఘం తీర్మానాన్ని ప్రజాసమితి కార్యవర్గం అధ్యక్షుడు డాక్టర్ మర్రిచెన్నారెడ్డి అధ్యక్షతన సాయంత్రం అయిదు గంటలనుంచి సమావేశమై చర్చిస్తున్నది.

ప్రత్యేక సంఘం తన తీర్మానంలో తెలంగాణా నుంచి లోక్‌సభకు పోటీచేసే స్థానాలలో సగానికి తక్కువ కాకుండా తమకు యివ్వాలని కూడా కోరుతున్నట్లు తెలుస్తున్నది.

—:o:—

రాజస్థాన్ లో నాలుగు పార్టీల సమైక్యత

జైపూర్, జనవరి 4: రాజస్థాన్‌లో నాలుగు ప్రతిపక్షాలు—వ్యవస్థాకాంగ్రెస్, జనసంఘ్, స్వతంత్ర, భారతీయ క్రాంతిదళ్ కలిసి, సమైక్యంగా క్రొత్తకాంగ్రెసుకు వ్యతిరేకంగా, ఎన్నికల సర్దుబాట్లద్వారా లోక్‌సభ ఎన్నికలకు పోటీచేయాలని నేడు నిర్ణయించుకున్నాయి. ఎస్. ఎస్. పి.ని కూడా తమలో చేర్చుకోవాలని తీర్మానించుకున్నాయి.

రాజమాత గాయత్రీదేవి ఆధ్వర్యాన ఈ పార్టీల సంయుక్త సమావేశం జరిగింది. రేపటి సమావేశంలో అభ్యర్థుల జాబితాలు సిద్ధం చేస్తారు.

ఎన్నికలలో ప్రభుత్వయంత్రాంగం దుర్వినియోగం నిరోధం

రాష్ట్రపతికి 4 ప్రతిపక్షాల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జనవరి 4: నాలుగు ప్రతిపక్షాల నాయకులు నేడు రాష్ట్రపతి శ్రీ వి.వి. గిరిని కలుసుకుని మధ్యంతర ఎన్నికల కాలంలో పార్టీ ప్రయోజనాల కోసం ప్రభుత్వ యంత్రాంగం దుర్వినియోగం కాకుండా నిరోధించడానికి ప్రత్యేకయంత్రాంగాన్ని ఏర్పాటు చేయవలసిందని విజ్ఞప్తి చేశారు.

సంస్థా కాంగ్రెస్, జనసంఘం, స్వతంత్ర ఎస్. ఎస్. పి. లకు చెందిన ఎనిమిదిమంది నాయకులు సంతకాలు చేసిన వినతిపత్రం రాష్ట్రపతికి సమర్పించబడింది.

...దువ ఎన్నికలు న్యాయంగా స్వేచ్ఛగా జరిగేలా చూడడం రాష్ట్రపతి అధినపు బాధ్యతలవుతున్నదని, వినతిపత్రం పేర్కొన్నది.

రాష్ట్రపతితో సమావేశం 25 నిముషాలు జరిగింది.

వినతిపత్రంపై సంతకాలు చేసిన వారి పేర్లివి: శ్రీయుతులు డాక్టర్ రామ్‌సుభాగ్ సింగ్, పీతాంబర్‌దాస్, బలరాజమధోక్, దహ్యాభాయ్‌పటేల్, రాజనారాయణ, ఎస్. డి. మిశ్రా, బి. కె. కవుల్, మనోహర్‌త్యాగి.

లోకసభకు పోలింగు తేదీలు

ఫిబ్రవరి 26 నుండి మార్చి 4 వరకు అని ఎన్నికల సంఘం అధికార ప్రకటన

న్యూఢిల్లీ, జనవరి 4 : ఫిబ్రవరి 26 నుండి మార్చి 4వ తేదీ వరకు లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలు జరపాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.

వివిధ రాష్ట్రాలలో ఆయా పరిస్థితులను బట్టి ఒకటి నుండి నాలుగు రోజుల వరకు పోలింగ్ జరుగుతుంది.

శాసనసభలకుకూడా ఎన్నికలుజరిపే చోట్ల, ఆ ఎన్నికలుకూడా లోక్‌సభ ఎన్నికతోపాటు నిర్వహింపబడతాయి.

వోట్ల లెక్కింపు మార్చి నాలుగున ప్రారంభమై ఎనిమిదవ తేదీ వరకు కొనసాగుతుంది.

వోట్లు వేయవలసినదిగా ప్రజలను కోరుతూ రాష్ట్రపతి జనవరి 25న మొదటి ప్రకటన జారీ చేస్తారు.

పోలింగ్ తేదీలు వేరు వేరుగా ఉండటం చేత రాష్ట్రపతి ఒకటికి మించి ఇట్టి ప్రకటనలు చేయగలరు.

రాష్ట్రపతి ప్రకటన తరువాత 7 రోజుల లోగా అభ్యర్థులు నామినేషనులు దాఖలు చేయవలసి ఉన్నది.



ప్రధానమంత్రి శ్రీమతి గాంధి మొన్న డిసెంబర్ 30న అలహాబాద్ వెళ్ళినప్పుడు కుంభ మేళకు అక్కడ చేస్తున్న ఏర్పాట్లను తనిఖీ చేశారు

తెలంగాణా సమస్య:

ప్రధాని ప్రతిపాదనలపై విభిన్న ధోరణులు

(ఆంధ్రపత్రిక ప్రతినిధి) హైదరాబాదు, జనవరి 4:

రెండు రోజులుగా రాజధాని నగరంలో తెలంగాణా వ్యవహార పరిష్కారాన్ని గూర్చి, క్రొత్తకాంగ్రెసు, తెలంగాణా ప్రజాసమితి కార్యవర్గాలు జరిపిన సమాలోచనల్లో ప్రధాని రాజీ ప్రతిపాదనలపై కొన్ని విమర్శలు తలయెత్తినట్లు అభిజ్ఞవర్గాల ద్వారా తెలుస్తున్నది.

సమైక్యతావాద నాయకులను గురించిన విమర్శనాధోరణి ఈ విధంగా వున్నది. ఇంతవరకు ఒక వంక రాష్ట్ర సమైక్యత విషయంలో రాజీ అనే మాట లేదు అని ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఉద్ఘాటిస్తూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్‌ను విభజించే ఆలోచనచేసే, భాషాప్రయుక్త రాష్ట్రాల విభజనకు పూనుకుంటే దీనికి అంతూపొంతూ వుండదని, దేశం చిన్నాభిన్నం అవుతుందని చెబుతూ వచ్చారు. రాష్ట్ర విభజన ప్రసక్తే కూడదని, అది చర్చనీయాంశంకూడా కారాదని ముఖ్యమంత్రి అంటూవచ్చారు.

అట్లాగే మరొక వంక ప్రత్యేకరాష్ట్రాన్ని కోరే కొందరికి క్రొత్తకాంగ్రెస్ ఆధ్వర్యాన లోక్‌సభా స్థానాలకు పోటీచెయ్యనివ్వడానికి అంగీకరించడమేకాకుండా 1977లో తెలంగాణా శాసన సభ్యులలోని మూడింట రెండువంతులమంది శాసన సభ్యులు వేర్పాటు కావాలని నిర్ణయిస్తే ఆంధ్రప్రదేశ్ విభజనకు తమ సమ్మతిని తెలియ జేశారు.

అంతేకాదు. అష్టసూత్ర ప్రణాళికలను అమలు పర్యవేక్షణకుగాను ప్రాతినిధ్యం ఏర్పాటును మరి కొంత పెంచడానికికూడా వారు అంగీకరించారు. అష్టసూత్ర ప్రణాళికకు మరి కొన్ని అంశాలు చేర్చడానికి సిద్ధపడ్డారు. సమైక్యత కోరేవారు ఎన్నికలలో ప్రత్యేకవాదులకు స్థానం యిస్తే, ఆ రాష్ట్రమేగాకుండా దేశమే చిన్నాభిన్నమయ్యే పరిస్థితిని కల్పించినవారవుతారని నిన్న జరిగిన క్రొత్తకాంగ్రెస్ కార్యకర్తల సభలో కొందరు హెచ్చరించినట్లు తెలుస్తున్నది.

అదేవిధంగా ప్రత్యే తెలంగాణా రాష్ట్ర నిర్మాణం రాజీకి అతీతమైందని చెప్పిన తెలంగాణా ప్రజాసమితి అధ్యక్షుడు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి 1977 వరకు ఈ విషయమై వేచివుండడానికి నిర్దేశించబడిన ప్రతిపాదనలను తీసుకు వచ్చినందుకు ప్రజా సమితి కార్యకర్తల విమర్శకు గురిఅయినారు. ప్రత్యేక రాష్ట్ర నిర్మాణం రాజీసంభాషణల వ్యవహారంకాదని, ఎలుగెత్తిచాటుతూ వచ్చిన ప్రజా సమితి అధ్యక్షుడు 1977 దాకా దాని నిర్మాణం వాయిదా వేయడానికి సిద్ధపడి తమ స్థానం నుంచి దిగివచ్చారని కొందరు విమర్శిం...

మిగతా 2 వ పేజీలో

ఆంధ్రలో మార్చి 4న పోలింగు

న్యూఢిల్లీ, జనవరి 4 : లోక్‌సభకు మధ్యంతర ఎన్నికల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ మార్చి 4 వ తేదీన జరుగుతుందని ఎన్నికలసంఘం ప్రకటించింది.

—:o:—

తమిళనాడు శాసనసభ రద్దు

ఆచార్య రంగా వ్యాఖ్య

విజయవాడ, జనవరి 4: తమిళనాడ శాసన సభకు రద్దు చేయటం పై ఆచార్య రంగా నేడిక్కడ సంతోషం ప్రకటించారు.

ఈ సంఘటన పై వ్యాఖ్యానిస్తూ యిది శ్రీమతి ఇందిరాగాంధి పతనానికి మరింత దోహదం చేయగలదని ఆయన ఆంధ్రపత్రిక ప్రతినిధితో చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష కూటమి

6వతేదీన హైదరాబాదులో సమావేశం

విజయవాడ, జనవరి 4 : స్వతంత్రపార్టీ జాతీయ కార్యవర్గం మద్రాసులో 8, 9 తేదీలలో సమావేశం అవుతున్నదృష్ట్యా, రాష్ట్ర స్వతంత్ర, జనసంఘ, సంస్థాకాంగ్రెసు నాయకుల సంయుక్త సమావేశం యిదివరలో అనుకున్నదానికన్నా తొందరగా 6 వ తేదీనే హైదరాబాదులో జరగటానికి నిశ్చయించబడిందని రాష్ట్ర స్వతంత్రపార్టీ కార్యదర్శి శ్రీ సుంకర సత్యనారాయణ ఆంధ్రపత్రిక ప్రతినిధికి తెలియజేశారు.

మిగతా రెండుపార్టీల నాయకులతో సంప్రదింపుల పర్యవసానంగానే ఈ సంయుక్త సమావేశం తేదీ నిర్ణయించబడిందని ఆయన వివరించారు.

ఈ సంయుక్త సమావేశంలో రాష్ట్ర స్థాయిలో ఎన్నికల సర్దుబాట్లు, సంయుక్త అభ్యర్థుల నికరజాబితా తయారు కాగలదని తెలుస్తోంది.

ఒక్కొక్కపార్టీ విడివిడిగా తమ అభ్యర్థుల జాబితాను ప్రకటించుకోటంకాక వివిధ పార్టీలు నిర్ణయించుకున్న అభ్యర్థుల జాబితాను యీ సంయుక్త సమావేశంలో పరిశీలించి, చర్చించి మూడు పార్టీల తరపున పోటీచేసే అభ్యర్థుల జాబితాను తయారు చేయగలదని చెప్పబడుతోంది.

హైదరాబాద్‌లో జరిగే సంప్రదింపులలో పాల్గొని ఎన్నికల సర్దుబాట్ల విషయమై నిర్ణయం తీసుకుని జాతీయ పార్టీ అనుమతికి లోబడి రాష్ట్ర పార్టీ అభ్యర్థులను నిర్ణయించడానికి నేడిక్కడ జరిగిన రాష్ట్ర స్వతంత్రపార్టీ కార్యవర్గం, పార్లమెంటరీ బోర్డు సంయుక్త సమావేశం ఒక ఉపసంఘాన్ని నియమించింది.

ఈ ఉపసంఘంలో శ్రీయుతులు గౌతు లచ్చన్న, సుంకర సత్యనారాయణ, జాగర్లమూడి చంద్రమౌళి, రాజగోపాలనాయుడు, మువ్వలేటి కోటేశ్వరరావు సభ్యులు.

వీరిలో శ్రీ చంద్రమౌళి తప్ప మిగతా వారంతా రేపు రాత్రి ఇక్కడనుండి బయలుదేరి హైదరాబాద్ పోతున్నారు. అక్కడ 6వ తారీఖున సంస్థా కాంగ్రెసు నాయకులతో సమావేశం జరుపుతారు. ఆ రోజు రాష్ట్ర జనసంఘం పార్లమెంటరీ బోర్డు సమావేశం ఏర్పాటు చేయబడినందున ఆ రోజు జరిగే సమావేశంలో జనసంఘం నాయకులు పాల్గొనజాలరని కాని 7న తేదీన జరిగే సమావేశంలో వారుకూడా పాల్గొనగలరని శ్రీ లచ్చన్న తెలియజేశారు.

బొంబాయి, జనవరి 4: స్వతంత్రపార్టీ జాతీయ కార్యవర్గం, పార్లమెంటరీ బోర్డు సమావేశాలు మద్రాసులో ఆదిలో అనుకున్నట్లు ఈ నెల 12, 13లలోకాక, 8, 9 తేదీలలో జరుగుతాయి. పార్టీ కేంద్ర కార్యాలయం నేడీ విషయాన్ని ప్రకటించింది.

ఎన్నికల ఒప్పందాలకు బి. కె. డి. విముఖత

రాష్ట్రాల స్థాయిలో అవసరమైన సర్దుబాట్లకు పార్టీ సంసిద్ధత

న్యూఢిల్లీ, జనవరి 4: భారతీయ క్రాంతిదళ్, ఏ యితర రాజకీయ పార్టీతోను, ఏ విధమైన ఎన్నికల ఒప్పందం, లేదా సర్దుబాట్లు "చేసుకోవరాదని దాని జాతీయ కార్యవర్గం నేడిచ్చట నిర్ణయించింది.

ఎన్నికలలో తనకు తానుగా బి. కె. డి. పోటీచేయాలనికూడా దాని జాతీయ కార్యవర్గం తీర్మానించింది.

అయితే దాని రాష్ట్ర శాఖలు, అవసరమైతే ఆయా పరిస్థితులనుబట్టి తమ జాతీయ పార్టీ అధ్యక్షునితో సంప్రతించిన పిమ్మట, తగిన సర్దుబాట్లు చేసుక స్వేచ్ఛను కలిగివున్నాయి.

అఖిలాంధ్ర ప్రజానీకానికి..........
అనేకానేక వందనములు..........

నేనుమీకీలేఖ దివినుండి వ్రాస్తున్నాను.
శ్రీకృష్ణుడు తానుగానన్నెదుర్కొనలేక
కుట్రపన్ని ముచికుందునిచే చంపించిన
విషయం మీకు తెలియందికాదు.
కపటోపాయంతోనన్నుతనపొట్టను
పెట్టుకొన్న ఆమాయలమారి కృష్ణునిపట్టి
పల్లార్చివానిపచ్చినెత్తుటనాచిచ్చు చల్లార్చెదనని నాతమ్ముడు మహోదరుడు ఆనాడు
భీకర ప్రతిజ్ఞచేశాడు. ఏంప్రయోజనం?
ఇంతవరకు చేసినప్రతిజ్ఞ చెల్లించిన
పాపానపోలేదు. నేనిక్కడఆరనివగతో,
తెరనిపగతో అలమటిస్తూ క్షణమొక
యుగంగాగడుపుచున్నాను
ఇదిలావుండగా....నాతమ్మునికి గూడా
నాకుపట్టినగతే పట్టిందని ఇక్కడ
వదంతులు వ్యాపించాయి...అవి....
ఎంతవరకు నిజమో తే11-1-71. విడుదల
కానున్న కౌముదీ వారి శ్రీకృష్ణవిజయము
చిత్రం చూస్తే మీకు
తెలుస్తుంది...తప్పక చూచి
వాస్తవం నాకు వ్రాస్తారని
ఆశిస్తున్నాను.... సెలవు
కాలయవనుడు



అమ్మకము

మిషిన్లు ఉన్నని నేయుటకు మరియు బెడ్షీటులు వెడల్పుగల అల్లిక [illegible] నేత పన్నులు చేయగలము. వివరములకు వ్రాయండి: ఇంపీరియల్ టెక్స్టైల్ వేస్టు కంపెనీ, 165 ద్రాడ్ వే, మద్రాసు-1. ఫోన్: 20192

నెలకు రూ. 10 వంతున వాయిదాల చెల్లింపు ద్వారా "స్టాండర్డ్" ఆల్ వరల్డ్ (జపాన్ మోడల్) ట్రాన్సిస్టర్. ఉజాల్ స్పీకర్. 3 బ్యాండ్లు, 7 ట్రాన్సిస్టర్ ధర రూ. 300 నైట్ ల్యాంపు గలది. నేడే ఆర్డరు పంపండి.



CAPITAL AGENCIES (AM)
Roopnagar, Delhi-7.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

సవరణ

23—12—70 వ తేదీన యీ కార్యాలయము నుండి జారీచేయబడిన టెండరు నోటీసుకు జతపరచబడిన యూనిట్ల లిస్టులో యూనిటు నెం. 321 తూ॥ ప్రాన్‌కు ఎదురు 6 వ కాలములో ఒక తప్పు అచ్చు పొరపాటున వచ్చినది. అక్కడ యిప్పుడు వున్న 100 కు బదులు 1000 [అక్షరాలా ఒక వెయ్యి] వుండవలెను.

అటవీ శాఖాధికారి,
ప్రభుత్వ వ్యాపార మండలము,
హైదరాబాద్—4 ఆం. ప్ర.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

నోటీసు

23—12—70 వ తేదీన ప్రభుత్వ వ్యాపార మండలి అటవీ శాఖాధికారిచే తునికి ఆకుల కొనుగోలు చేయుటకుగాను కంట్రాక్టర్లు కోరబడుతూ చేయబడిన ప్రకటనలోని షరతులలో 11 వ షరతుకు కొంది మార్పుగా, ప్రభుత్వ వ్యాపార మండలి అటవీ శాఖాధికారి కార్యాలయము, హైదరాబాదులో 19 జనవరి, 1971 వ తేదీ సాయంత్రం 5 గం.ల వరకు తునికి ఆకుల కొనుగోలు చేయుటకు టెండర్లు స్వీకరించబడునని యిందుమూలంగా ప్రకటించడమైనది.

అటవీశాఖాధికారి,
ప్రభుత్వ వ్యాపార మండలము,
హైదరాబాదు.

కొటేషన్ నోటీసు

తెలుగు అకాడెమీ

హిమాయత్‌నగర్, హైదరాబాదు-29.

తెలుగు బోధనా భాషగాగల యూనివర్శిటీ విద్యార్థులకు పుస్తకములను ముద్రించుటకు మరియు పునర్ముద్రించుటకు తేది 23—1—1971 మ. 4 గంటలకు లేదా అంతకుముందుగా తమకు చేరునట్లు మిక్కిలి తక్కువ రేట్లతో సీల్డు కొటేషనులు డైరెక్టర్, తెలుగు అకాడెమీ, హైదరాబాద్—29 వారిచే కోరబడుచున్నవి.

పూర్తి వివరములు, షరతులు మరియు నిబంధనలు గల కొటేషన్ నోటీసులు, తెలుగు అకాడెమీ ఆఫీసునుండి అభ్యర్థనపై పొందవచ్చును.

పి. ఎస్. ఆర్. అప్పారావు,
డైరెక్టర్.

(KUCHI)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

హైదరాబాద్ నందుగల ఆంధ్రప్రదేశ్ సి. ఐ. డి. ఫింగర్ ప్రింట్ బ్యూరోలో గల ఫింగర్ ప్రింట్ సర్చర్స్ ఉద్యోగములను భర్తీ చేయుటకై తగిన అభ్యర్థులనుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. [స్త్రీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేయవచ్చును.] జీతంస్కేలు: రు. 90—6—150—7—192.

[1] యోగ్యతలు: కనీస విద్యాయోగ్యతలు: మెట్రిక్యులేషన్ లేక దానికి సమానమైన విద్య.

2. వయోపరిమితి: అభ్యర్థి తేది 1 జూలై 1971 నాటికి 18 ఏండ్లు నిండియుంటూ 25 యేండ్లు నిండియుండరాదు.

గమనిక: పై హెచ్చు వయోపరిమితి సమానముగా అయిదు యేండ్ల వరకు షెడ్యూల్డు కులములు, షెడ్యూల్డు తెగలు లేక ఏజెన్సీ ప్రాంతమునందుగల ఆదివాసులకు మరియు వెనుకబడిన తరగతులవారికి సడలింపు రిట్రెంచ్‌మెంటుకై హెచ్చించబడును.

3. అభ్యర్థి ఆరు నెలల కాలము హైదరాబాద్ సి. ఐ. డి. ఫింగర్ ప్రింట్ బ్యూరో యందు ప్రత్యక్ష శిక్షణ పొందవలెను. ఈ శిక్షణకాలంలో అభ్యర్థులు నెలకు రు. 70/- వంతున స్టయిఫెండును; మరియు పొందదగు కరువుభత్యమును పొందగలరు.

4. ఉద్యోగమునందు నియమింపబడుటకై యెన్నికైన అభ్యర్థులు, ఆంధ్రప్రదేశ్ యందలి యే భాగమునందైననూ ఉద్యోగము చేయవలసియుండును.

5. దరఖాస్తులు పంపుకొనుటకై కావలసిన పూర్తి వివరములు మరియు నమూనాలను డైరెక్టర్, ఫింగర్ ప్రింట్ బ్యూరో, సి.ఐ.డి. హైదరాబాద్ వారినుండి అభ్యర్థన ద్వారా పొందవలెను. సదరు అభ్యర్థనకు తగిన స్టాంపులు, మరియు స్వంత అడ్రసు గల సిద్ధపాటి కవరు జతపర్చి పంపవలెను.

6. అవసరమైన డాకుమెంట్లతో జత పర్చబడిన దరఖాస్తులు, తిరుగు రశీదు గల రిజిష్టర్డు పోస్టు ద్వారా డైరెక్టర్, ఫింగర్ ప్రింట్ బ్యూరో సి. ఐ. డి. ఆంధ్రప్రదేశ్, హైదరాబాదువారికి తేది 1—2—1971 నాటికి మించకుండా చేరునట్లు పంపవలెను.

డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్,
డైరెక్టర్ & సి. ఐ. డి., ఏ. పి. హైదరాబాద్.

ప్రధానితో శ్రీ చరణ్‌సింగ్ పోటీ

శ్రీ రాజ్‌నారాయణ్ సూచన

న్యూఢిల్లీ, జనవరి 4: సంయుక్త సోషలిస్టు పార్టీ నాయకుడు శ్రీ రాజనారాయణ్ నేడు భారతీయ క్రాంతిదళ్ అధ్యక్షులు శ్రీ చరణ్‌సింగ్‌ను కలుసుకుని, యు. పి. లో ప్రధాన మంత్రి పోటీ చేసే రాయ్‌బరేలీ నియోజకవర్గంనుంచి లోక్‌సభకు పోటీ చేయాలని కోరారు. "ఆ సంగతి ఆలోచిస్తాను" అని శ్రీ చరణ్‌సింగ్ తనకు సమాధానమిచ్చినట్లు శ్రీ రాజనారాయణ్ వెల్లడించారు.

చండీఘర్, జనవరి 4: పంజాబ్ పక్ష లైట్ అగ్రనాయకుడుగా పేరుమోసిన ఇక్బర్ సింగ్ శనివారం రాత్రి పోలీసులతో ఘర్షణలో మరణించినట్లు ఇక్కడ అధికారి ఒకరు చెప్పారు.

ఏజెంట్లు కావలెను

ఈ క్రింది ఊళ్ళలో ఆంధ్రపత్రిక దినపత్రిక, సచిత్ర వారపత్రిక మరియు భారతి వారి స్వంత బాధ్యతపై స్వీకరించుటకు ఏజంట్లు కావలెను.

ఊరు		జిల్లా
వాగల్లు	—	పశ్చిమ గోదావరి
మహబూబాబాద్	—	వరంగల్
ఆసిఫాబాద్	—	అదిలాబాద్
గాండవారు	—	హైదరాబాద్

మేనేజరు: ఆంధ్రపత్రిక

ఇంగ్లీషు పుస్తకములు

How to Speak & Write Correctly
240 పేజీలు. రు. 3/— పోస్టేజి అదనం,
A. S. Money & Co. 12—C, Oragadam Road, Ambattur, Madras-53.

లాటరీ టిక్కెట్లు

అదృష్టం, అదృష్టం, అదృష్టం. తమిళనాడు 26—12—70 డ్రాలో నెం. 953582 టిక్కెట్టుకు రూ. 10,000/ ప్రైజు. 25—6—70 ఎ.ఖ. 091929 టిక్కెట్టుకు రు 10,000/— ప్రైజులు లభించినవి. రాబోవు డ్రాలలో అదృష్టవంతులగుటకు ప్రయత్నించండి. అన్నిరాష్ట్ర ప్రభుత్వ లాటరీ టిక్కెట్లు దొరుకును. తమిళనాడు జంపరు టిక్కెట్టుకు రు. 2/— ఆర్డినరీపోస్టులో 0—30, రిజిష్టరుపోస్టులో 1—30 లు అదనం. K. V. L. నాగేశ్వరి, మోటమర్రివారి వీధి, తెనాలి—1.

దక్షిణ మధ్య రైల్వే

నెం. బి సి. 439/III/బి

ఆన్యులర్ రోడ్ క్రింద నిర్వహణకు టెండరు

విజయవాడ రిపాకింగ్ షెడ్డు నుండి మరియు తాడేపల్లి ట్రాన్సిప్ షెడ్ నుండి గుంటూరు మరియు తెనాలి రైల్వే స్టేషన్లు మరియు మార్గ మధ్యమున గల స్టేషన్లు—కృష్ణా కెనాల్, మంగళగిరి, నంబూరు, పెదవడ్లపూడి, దుగ్గిరాల మార్గములో ఇరువైపుల "స్మాల్స్" క్రింద బుక్ చేయబడిన సరుకులను మోటారు శకటముల ద్వారా రోడ్డుపై రవాణా చేయుటకు ఆన్యులర్ రోడ్ సర్వీస్ నిర్వహించుటకు 22—1—1971 మ. 12 గంటల వరకు యీ క్రింది సంతకపుదారునిచే సీల్డు టెండర్లు స్వీకరించబడును.

నిర్ణీత టెండరుఫారములు ఇతర నిబంధనలు, విజయము పొందిన టెండరరు వ్రాసి యివ్వవలసిన నమూనా ఎగ్రిమెంటు ఫారము సహితము ఒకటికి రూ. 2—00 లను చెల్లించి 15—1—71 మ. 3 గంటల వరకు ఈ క్రింది సంతకపుదారునినుండి పొందవచ్చును.

ఇతర వివరములను యీ క్రింది సంతకపు దారుని ఆఫీసునుండి పొందవచ్చును.

(డై. ఆర్డర్)
డివిజనల్ సూపరింటెండెంట్,
కమర్షియల్ బ్రాంచి
విజయవాడ, 4—1—71

మైసూరు ప్రభుత్వము

స్టోర్సు కొనుగోలు శాఖ

నోటీసు

ఎన్‌క్వయిరీనెం. P9/304/డిశంబర్70 "ఫిల్లో 110" డబ్ల్యు.బి.ఎస్.ఎఫ్.సి. [illegible] విక్రయించుటకై 18—1—71 సా॥ 4 గం.ల వరకు సీల్డు టెండర్లు డైరెక్టర్, స్టోర్సు పర్చేస్ డిపార్టుమెంటు వారిచే అందుకొనబడును. టెండర్లు పెట్టదలచినవారు దరఖాస్తుచేసి, డైరెక్టర్, స్టోర్సు పర్చేస్ డిపార్టుమెంటు వారినుండి, టెండర్లు దాఖలుచేయుటకు అవసరమైన టెండరు ఫారములు పొందవచ్చును. టెండరు దరఖాస్తులతో పాటు రు. 8 (ఎనిమిది రూపాయలు మాత్రమే) చెల్లించవలెను. ఈ డబ్బు టెండరు ఫారములు పెట్టు ఒకటికి [illegible] ఇది తిరుగి జమకాదు. టెండరు ఫారములు తేది 16—1—1971 సా॥ 4 గంటల వరకు స్వీకరించబడును.

చెక్కులు, పోస్టల్ ఆర్డర్లు టెండరు ఫారముల ఖరీదుక్రింద అంగీకరించబడవు. మరియు ఫారములు పి.పి.గా పంపబడవు.

(వి. ఆర్. శేషప్ప)
ఫర్ డైరెక్టర్,
స్టోర్సు పర్చేస్ డిపార్టుమెంట్.

మారుతున్న సమాజావసరాలు రాజ్యాంగం తీర్చగలగాలి

రాష్ట్రపతి వి. వి. గిరి సూచన: న్యూఢిల్లీలో కామన్వెల్త్ ప్రధాన న్యాయమూర్తుల సభకు ప్రారంభోత్సవం

న్యూఢిల్లీ, జనవరి 4:

అభివృద్ధి చెందుతున్న సమాజంలో మారుతున్న అవసరాలను తీర్చడానికి రాజ్యాంగ నిబంధనలు వినియోగపడాలని రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి నేడు సూచించారు.

రాజ్యాంగం మార్పులకు వీలు లేని వ్రతం కావాలన్నది దాని ఉద్దేశం కాదని రాష్ట్రపతి ఇక్కడ కామన్వెల్త్ దేశాల ప్రధాన న్యాయమూర్తుల తృతీయ మహాసభలో ప్రారంభోపన్యాసం చేస్తూ ఉద్ఘాటించారు.

న్యాయమూర్తులు వ్యక్తిగత తగాదాలతో పాంకేతిక న్యాయం, పరిమితమైన హక్కులు, బాధ్యతల సమస్యలను మాత్రమే పరిగణనలోకి తీసుకోరాదని శ్రీ గిరి అన్నారు.

న్యాయ సంబంధమైన సమస్యలపై తీర్పు ఇచ్చేటప్పుడు న్యాయమూర్తులు మనుషులను ఆందోళన పరుస్తున్న విస్తృత సమస్యలను, సమాజానికి న్యాయం కలిగే విధంగా సమర్థమైన న్యాయ వ్యవస్థను రూపొందించడానికి ఉద్దేశించిన సమస్యలను పరిశీలనలోకి తీసుకోవాలని ఆయన అన్నారు.

అటువంటి వ్యవస్థ రూపొందించడానికి అడ్డు వచ్చే లోటుపాట్లను గుర్తించి వాటిని తొలగించడం అవసరమని ఆయన చెప్పారు.

కేసుల పై తీర్పులలో జాప్యం న్యాయ వ్యవస్థలో పెద్ద లోపమని, దావా ఖర్చులు అధికంగా వుండడం కూడా సామాన్య మానవుడు న్యాయస్థానాలకు వెళ్లే హక్కును వినియోగించుకోకుండా చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు.

న్యాయ వ్యవస్థ మొత్తం మీద సమాజానికంతటికీ ప్రయోజనం కలిగించేదిగా వుండాలన్న విషయం గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు.

పౌరులకు సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కలుగజేసే సందర్భంలో న్యాయస్థానాల ముందుకు వచ్చే న్యాయ సంబంధమైన సమస్యలు వైరుధ్య భావాలను, ఉద్రిక్తతలను రేకెత్తించడం అనివార్యమని శ్రీ గిరి అన్నారు.

ఈ సమస్యలను పరిశీలించి నిర్ణయాలు తీసుకొనే సమయంలో, అమెరికన్ న్యాయమూర్తి పేర్కొన్నట్లు ఉద్రిక్తతలతో సంబంధం లేకుండా క్రమశిక్షణలో, విశాల దృక్పథంతో న్యాయమూర్తులు వ్యవహరించవలసి వుంటుందనడంలో తనకెలాంటి సందేహం లేదని ఆయన అన్నారు.

వ్యక్తిగతమైన తీర్పు, అభిప్రాయం న్యాయవ్యవస్థకు విరుద్ధంగా వుండరాదని, అలా జరిగితే న్యాయ వ్యవస్థ ప్రమాదస్థితిలో పడుతుందన్న అమెరికన్ న్యాయమూర్తి అభిప్రాయంతో తాను ఏకీభవిస్తున్నానని శ్రీ గిరి అన్నారు.

శ్రీ గిరి ఇంకా యిలా అన్నారు: రాజ్యాంగం మార్పు చెందని వ్రతంగా వుండడానికి ఉద్దేశించినది కాదు. అభివృద్ధి చెందుతున్న సమాజంలో మారుతున్న అవసరాలను రాజ్యాంగ నిబంధనలు తీర్చగలగాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా రాజ్యాంగ నిబంధనలు రూపొందడం వాటికి బలాన్ని చేకూర్చగలదు.

సీనియారిటీ అనుసారం నియామకాలు

తెలంగాణా ప్రభుత్వ ఉపాధ్యాయుల తీర్మానం

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, జనవరి 4: తెలంగాణాలో రూ. 230—480 గ్రేడులో పనిచేస్తున్న సెలక్షను గ్రేడు ఉపాధ్యాయుల సమావేశం ఎగ్జిబిషన్ మైదానంలో జరిగింది. ప్రభుత్వ గ్రేడు 1 తెలంగాణా ఉపాధ్యాయుల సంఘం ఏర్పాటయింది. ఈ వర్గంలో గల ఉపాధ్యాయుల ప్రయోజనాల పరిరక్షణకు సంఘం ఏర్పాటయింది.

సెకెండరీ పాఠశాలలలో రెండవ గ్రేడులని పిలువబడు రూ. 130—250 ప్రధానోపాధ్యాయులు వేతనాలన్న విద్యా శాఖ డైరెక్టరు ప్రయత్నం పట్ల ఆందోళనను వ్యక్తపరుస్తూ తీర్మానించారు.

అలా నియమించడం వల్ల ప్రభుత్వానికి అదనపు వ్యయం కావడం మాత్రమే గాక, సెలక్షను గ్రేడులోని ఉపాధ్యాయుల అనుభవాన్ని వినియోగించుకోలేక పోవడం కూడా జరుగుతున్నదన్నారు.

సీనియారిటీ ననుసరించి ప్రధానోపాధ్యాయుల, పాఠశాలల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, విద్యా విస్తరణ అధికారుల నియామకం జరగాలని కోరారు.

కార్యదర్శి శ్రీ పి. సుబ్బారాయుడు తీర్మానం ప్రతిపాదించగా వాటిని ఏకగ్రీవంగా ఆమోదించారు.

—:o:—

తడివల్ మంజప్ప పోటీ

షిమోగా, జనవరి 4: లోక్‌సభకు జరిగే మధ్యంతర ఎన్నికలలో షిమోగా నియోజక వర్గంనుండి పోటీ చేయడానికి మైసూరు మాజీ ముఖ్యమంత్రి శ్రీ కడిదల్ మంజప్ప పేరును జిల్లా కొత్త కాంగ్రెసు అడ్‌హాక్ సంఘం వారు ఏకగ్రీవంగా ఆమోదించారు.

కేరళ, తమిళనాడుల్లో 18 నుంచి కొత్త కాంగ్రెస్ ప్రచారం

ప్రధానిచే ప్రారంభం

కోయంబత్తూరు, జనవరి 4: కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో కొత్త కాంగ్రెస్ ఎన్నికల ప్రచారోద్యమాన్ని ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి జనవరి 18న ప్రారంభిస్తారు.

ప్రధాని జనవరి 18న ఎర్నాకులం, త్రివేండ్రం, మదురై, కోయంబత్తూరులలో బహిరంగ సభల్లో ప్రసంగిస్తారని, కొత్తకాంగ్రెస్ కార్యవర్గం సభ్యుడు శ్రీ సి. సుబ్రహ్మణ్యం నేడిక్కడ తెలియజేశారు. ఆ రాత్రికి ఆమె కోయంబత్తూరులో వుండి, జనవరి 19 ఉదయం విమానంలో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి వెడతారు. రాజమండ్రిలో బహిరంగ సభలో ప్రసంగించి 19 మధ్యాహ్నం మద్రాసు చేరుకుంటారు.

అదే రోజున ఆమె మద్రాసులో బహిరంగ సభలో ప్రసంగించి జనవరి 20న విశాఖపట్నం వెడతారు.

ఫిబ్రవరిలో కూడా ఎన్నికలకు ముందు ఆమె దక్షిణాది రాష్ట్రాలలో పర్యటించ వచ్చునని శ్రీ సుబ్రహ్మణ్యం చెప్పారు.

పార్టీ ఎన్నికల ప్రణాళిక జనవరి ఆరున విడుదల చేయబడగలదని, ఆయన తెలిపారు.

లోక్‌సభకు కొత్తకాంగ్రెస్ పోటీ చేసే స్థానాలను గురించి, మరొక అయిదు రోజుల్లో డి. ఎం. కె. తో సంప్రదించి నిర్ణయించడం జరగగలదని, ఆయన చెప్పారు.

తాము తమిళనాడు నుంచే లోక్‌సభకు పోటీ చేయగలమని ఆయన తెలిపారు.

విజయవాడ లోక్‌సభ స్థానం

మితవాద కమ్యూనిస్టుపార్టీ పోటీ తప్పదని చంద్ర రాజేశ్వరరావు ప్రకటన

విజయవాడ, జనవరి 4: విజయవాడలో లోక్‌సభ స్థానానికి మితవాద కమ్యూనిస్టు పార్టీ తప్పక పోటీ చేస్తుందని శ్రీ చండ్ర రాజేశ్వరరావు నేడిక్కడ స్పష్టం చేశారు. ఆంధ్రలో విజయవాడ కమ్యూనిస్టు పార్టీకి పెద్ద కేంద్రం కదా అన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 14 సీట్లు పోటీ చేస్తుందని, అందులో 3 స్థానాలు తెలంగాణాలో పోటీ చేస్తుందన్నారు. ఇదిదిలో కొన్ని స్థానాలు యింకా నిశ్చయం కాలేదని, రాజమండ్రి స్థానమూ లేక కాకినాడ అనేది ఏలూరా, నర్సాపురమూ అనేది, ఖమ్మమా, భద్రాచలమా అది నల్గొండా, మిరియాలగూడా అనేది, గుంటూరా, నర్సారావుపేటా అనేది, అలాగే అనంతపురమా, నంద్యాలా అనేది యింకా తేలలేదన్నారు.

ప్రజాస్వామ్యపక్షాల కూటమి ఆవశ్యకత

దేశంలో అభివృద్ధి నిరోధక శక్తుల కూటమి తయారవుతున్నప్పుడు, దేశంలోని ప్రజాస్వామ్య, అభివృద్ధికర శక్తులన్నీ కలిసి సంఘటిత పడాల్సిన అవసరం ఉందని, అలాంటి శ్రీమతి ఇందిరాగాంధి, కొంత మందితో కొన్ని కొన్ని లోపాయికారీ సర్దుబాట్లు చేసుకోటానికి ప్రయత్నించటం దేశానికి క్షేమకరం కాదన్నారు. కేవలం అభివృద్ధి నిరోధక శక్తులను ఓడించాలనే ఉద్దేశంతో మితవాద కమ్యూనిస్టు పార్టీ ఏ త్యాగానికైనా సిద్ధం కావని శ్రీ రాజేశ్వరరావు హెచ్చరించారు. తమకు బలమున్న స్థానాలలో తాము తప్పక పోటీ చేస్తామన్నారు. అయితే కొద్ది కొద్ది సర్దుబాట్లకు చివరి దాకా అవకాశం ఉండవచ్చుగదా అన్నారు.

ఈ నెల 14, 15 తారీఖులలో తమ కేంద్ర పార్టీ సర్దుబాట్ల విషయంలో ఒక నిర్ణయం తీసుకోగలదన్నారు.

జాతీయ స్థాయిలో కలయిక అక్కర్లేదని అధికార కాంగ్రెసు ప్రకటించింది కాబట్టి ఆ విషయం తమకూ అవసరం లేదన్నారు. రాష్ట్రస్థాయిలో సర్దుబాట్లకు వారు సిద్ధమైతే తాము సిద్ధమే అన్నారు.

ఇతర పార్టీలతో సర్దుబాట్ల విషయం చర్చించటానికి శ్రీయుతులు నీలం రాజశేఖరరెడ్డి, వై.వి. కృష్ణారావు, నిర్మలప్రసాద్‌గార్లకు తమ పార్టీ అధికారం యిచ్చిందన్నారు.

మార్క్సిస్టు, ఎస్.ఎస్.పి.లకు విజ్ఞప్తి

మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీకి, సంయుక్త సోషలిస్టు పార్టీకి శ్రీ రాజేశ్వరరావు ఒక విజ్ఞప్తి చేస్తూ తమ విధానాలవల్ల అభివృద్ధి నిరోధక శక్తులకు బలం చేకూరగలదని విశదం చేశారు. అందువల్ల ప్రజాస్వామ్య వాద పక్షాలతో చేరి అభివృద్ధి నిరోధక శక్తులను ఓడించే కృషిలో తమ పార్టీతో సహకరించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. అధికార కాంగ్రెసులో కొందరు అభివృద్ధి నిరోధకులు అన్నా ఎక్కువ మంది అభివృద్ధి కాముకులున్నారన్నారు. సంస్థా కాంగ్రెసులో ఎక్కువ మంది అభివృద్ధి నిరోధకులున్నారని స్పష్టం చేశారు.

ఎన్నిక అవకాశాలు

ఎన్నిక అవకాశాలను వివరిస్తూ, 1967 ఎన్నికలలో సంయుక్త కాంగ్రెసుకు 60 లక్షలు, మితవాద కమ్యూనిస్టులకు 15 లక్షలు, మార్క్సిస్టులకు 10 లక్షల వోట్లు వచ్చాయన్నారు.

అయినా సంయుక్త కాంగ్రెసుకు 34 స్థానాలు, తమ పార్టీకి ఒక్క స్థానం మాత్రమే లభించాయన్నారు. ఇది యెంతఅన్యాయమూ అని ప్రశ్నించారు.

విజయవాడ నియోజక వర్గంలో తమకు 1.7 లక్షల వోట్లు ఉన్నాయన్నారు. అటువంటి బలమున్న విజయవాడ, గుంటూరు, కావలి, వరంగల్లు, స్థానాలను తాము 1967లో బుద్ధిపూర్వకంగా వదిలేసుకుంటే తమను బలహీనులుగా పరిగణిస్తున్నారని, కమ్యూనిస్టు

మద్రాసు, జనవరి 4: తమిళనాడు ఫార్వర్డ్ పార్టీ నాయకుడు శ్రీ ఎస్. ఎస్. రామస్వామి పడయాచి నేడు ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధితో సమావేశం జరిపారు.

రాష్ట్రంలో రానున్న ఎన్నికలలో పోటీకి డి. ఎం. కె. నాయకత్వాన గల ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌లో తమ పార్టీ చేరే అవకాశాలను గురించి ఆయన శ్రీ కరుణానిధితో చర్చించినట్లు తెలుస్తున్నది. ఈ చర్చలు ఇంకా కొనసాగుతాయి.

ఆకాశవాణి

బుధవారం, జనవరి 6

హైదరాబాద్—ఎ

(405.4 మీటర్లు)

ఉ:—6.00 వందేమాతరం 6.10 భక్తిరంజని 6.40 సూక్తిముక్తావళి 7.15 చిత్రగీతం 7.30 హిందూస్థానీ సంగీతం 8.30 కె. సంగ్రహపుట.

మ:—12.05 చిత్రగీతం 12.30 కార్మికుల కార్యక్రమము 1.00 మహిళా సమాజం 1.40 చిత్రగీతం.

సా:—5.30 విజయవాడ నుండి 5.55 ప్రసార విశేషాలు 6.05 ప్రాంతీయ వార్తలు 6.30 గ్రామసీమలు 7.15 అభిప్రాయవేదిక 7.30 చిత్రగీతం 7.45 నాటిక 8.15 జానపదగీతాలు 8.30 కర్ణాటక సంగీతం 9.15 చిత్రగీతం 9.45 వచ్చునున్న చర్చిత 10.00 [illegible] 10.35 జనగణమన.

[illegible] ౼ బి

(217.4 మీటర్లు)

ఉ:—6.00 వందేమాతరం 6.10 భక్తిరంజని 6.45 [illegible] 7.45 చిత్రగీతం 8.15 హిందూస్థానీ శాస్త్రీయ సంగీతం 8.30 లలితసంగీతం 8.45 చిత్రగీతం.

మ:—2.00 [illegible] 2.20 [illegible] 2.30 శాస్త్రీయసంగీతం 2.50 [illegible].

సా:—5.30 కథలు కార్యక్రమము 6.00 కర్ణాటక సంగీతం 6.15 చిత్రగీతం 7.30 చిత్రపటాలు 9.00 చిత్రపటాలు 10.30 జనగణమన.

విజయవాడ

(357.1 మీటర్లు)

ఉ:—6.00 వందేమాతరం 6.10 భక్తిరంజని 6.40 సూక్తిముక్తావళి 7.15 హైదరాబాద్ వలె 8.30 హైదరాబాద్ వలె.

మ:—11.45 చిత్రతరంగిణి 12.05 వెంకటేశ్వర సుప్రభాతభాగవతర్ 12.30 కార్మికుల కార్యక్రమము 1.00 మహిళా సమాజం 1.40 పసిపిల్లలకు 2.01 సమయిక్, సహాయ్ యుగళం.

సా:—5.30 పద్మనాభుల్లు లక్ష్మీనరసింహశాస్త్రి 5.55 స్థానిక ప్రకటనలు 6.05 ప్రాంతీయ వార్తలు 6.15 లలితసంగీతం 7.15 సంగీతము 8.30 వార్తావాహిని 9.45 లలితసంగీతం 10.00 మద్దులపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి 10.35 జనగణమన.

[illegible]

ఉ:—6.00 వందేమాతరం 6.45 భక్తి [illegible] 7.30 పెర్కాలి గోపీతదరాజన్ 8.45 చిత్రగానం 9.15 శీతమంజరి 9.30 నటులు 10.30 ముగింపు.

మ:—11.55 [illegible] 1.30 చిత్రగానం 1.40 నాట్యగోష్ఠి.

సా:—5.30 కార్మికుల కార్యక్రమము 6.15 కార్యక్రమ వివరణ 6.30 నాద్య సంగీతం 6.65 చిత్రగానం 8.30 కొత్త పాటలు 8.45 వాద్యసంగీతం 8.55 ఈ మాపపు పాట 9.30 శ్రోతలుకోరినపాటలు 11.00 జనగణమన.

ఎన్నికల సర్దుబాట్లు: కమ్యూనిస్టుల సూచనకు మహారాష్ట్ర కొత్త కాంగ్రెస్ విముఖత

బొంబాయి, జనవరి 4: లోక్‌సభకు జరుగనున్న మధ్యంతర ఎన్నికలకు ప్రస్తుత పరిస్థితులలో రాష్ట్రంలో ఎన్నికల సర్దుబాట్లు చేసుకోవాలన్న మితవాద కమ్యూనిస్టు పార్టీ సూచనను మహారాష్ట్ర కొత్తకాంగ్రెస్ నిన్న తిరస్కరించింది.

ఎన్నికల సర్దుబాట్లపై చర్చలు జరపాలని సూచిస్తూ మితవాద కమ్యూనిస్టు పార్టీ మహారాష్ట్ర కొత్త కాంగ్రెసుకు లేఖ వ్రాసిందని, కాని ఆలాంటి సర్దుబాట్లకు ఇతర పక్షాలతో తాము చర్చలు జరుపుతున్నందున ఈ సర్దుబాట్లు సాధ్యం కాదని కొత్త కాంగ్రెస్ మితవాద కమ్యూనిస్టు పార్టీకి స్పష్టం చేసిందని తెలుస్తోంది.

బీహార్ కొత్త కాంగ్రెసులో విభేదాలు: అసమ్మతి వర్గంచే ప్రత్యామ్నాయ జాబితా

పాట్నా, జనవరి 4: బీహార్ ప్రదేశ్ కొత్త కాంగ్రెసులోని ఉభయ వర్గాల మధ్య విభేదాలు మరింత తీవ్రతరమయ్యాయి. లోక్‌సభకు జరిగే మధ్యంతర ఎన్నికలకు పార్టీ అభ్యర్థులను సంఘం ఆమోదించిన ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల సంఘం జాబితాతో సంబంధం లేకుండా, తాము తమ సొంత జాబితాను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపనున్నట్లు పి. సి. సి. కార్యవర్గంలోని ఒక వర్గం నేడు ప్రకటించింది.

బీహార్ కాంగ్రెస్ శాసన సభాపార్టీ మాజీ ఉపనాయకుడు, కార్యవర్గ సభ్యుడు శ్రీ ఎల్. ఎన్. ఝా, పి.టి.ఐ. విలేఖరితో మాట్లాడుతూ, ప్రత్యామ్నాయ జాబితా ఒకటి, రెండు రోజులలో ఖరారు కాగలదన్నారు.

ప్రదేశ్ ఎన్నికల సంఘం ఆమోదించిన దాని జాబితాకు తమకు కట్టుబడి ఉండబోమని పార్టీ ఉపనాయకుడు, కార్యవర్గ సభ్యుడు శ్రీ కేదార్‌పాండే చెప్పారు.

ఎన్నికలలో శ్రీమతి గాంధి నెగ్గితే ఆప్రహిహత్తు లవం

స్వతంత్రపార్టీ హెచ్చరిక

విజయవాడ, జనవరి 4: ఈ ఎన్నికలలో గూడా శ్రీమతి ఇందిరాగాంధి ఆధిపత్యం నెగ్గితే విస్తుచిన్న కులాలు, వృత్తికారులు, సంఘాలు అందరి అస్తి హక్కులు పోగలవని హెచ్చరిస్తూ ఇక్కడ రెండు రోజులుగా సమావేశమైన ఆంధ్రప్రదేశ్ స్వతంత్ర పార్టీ కార్యవర్గం పార్లమెంటరీ బోర్డు ప్రముఖుల సంయుక్త సమావేశంలో తీర్మానించబడింది.

గుత్తాధికారాన్ని రోగ పైలాన వున్నుతో ఇందిరాగాంధి ప్రభుత్వం ఈ పనికి పూనుకొంటున్నదని ఈ తీర్మానంలో పేర్కొనబడింది.

ఈ సమావేశానికి ఆచార్య రంగా కూడా హాజరయ్యారు.

తెలంగాణా విషయం ప్రస్తావించి శ్రీమతి ఇందిరాగాంధికి శ్రీ చెన్నారెడ్డి వర్గానికి రాజీకుదిరి ఆ వర్గం అంతా కాంగ్రెసులో కలిసిపోతే ఏ నిముషాన మనం పోటీ చేయాల్సి వస్తుందో సిద్ధంగా ఉండాలని స్వతంత్ర పార్టీ ఈ సమావేశం ఉద్బోధించింది.

ఈ సంయుక్త సమావేశానికి శ్రీ లచ్చన్న అధ్యక్షత వహించారు.

—:o:—

బారానగర్‌లో సంఘర్షణ

కలకత్తా, జనవరి 4: 24 పరగణాల జిల్లాలోని బారానగర్ ప్రాంతంలో మొన్న రాత్రి ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగిన ఫలితంగా ఇద్దరు బాలురు మరణించారు.

చర్చలకు మరోసారి ఒప్పిస్తాను

మొరార్జీ ప్రకటన: స్వతంత్రపార్టీ అధ్యక్షుని కలుసుకోడానికి బొంబాయి పయనం

అహమ్మదాబాదు, జనవరి 4

సంస్థా కాంగ్రెసు, జనసంఘం, ఎస్. ఎస్. పి లతో ఏర్పడిన ఎన్నికల సంఘటనలో స్వతంత్రపార్టీ కూడా చేరవచ్చునన్న ఆశాభావాన్ని శ్రీ మొరార్జీ దేశాయ్ నేడిక్కడ వ్యక్తంచేశారు.

శ్రీ మొరార్జీ నేడిక్కడ పత్రికల వారితో మాట్లాడుతూ, తాను బొంబాయి వెళ్ళగానే స్వతంత్ర పార్టీ అధ్యక్షుడు శ్రీ ఎమ్. ఆర్. మసానిని కలుసుకుని సంప్రతింపులు తిరిగి ప్రారంభించవలసిందిగా ఒప్పించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు.

శ్రీ మొరార్జీ నేడిక్కడనుండి విమానంలో బొంబాయి వెడుతున్నారు.

ప్రస్తుత ప్రభుత్వాన్ని తొలగించే ఉమ్మడి లక్ష్యంతో వివిధ పార్టీలు సన్నిహితమవుతున్నవని ఇలాంటి సమయంలో ఒకరితొకరు సర్దుబాటు చేసుకొనడం నేడు అత్యావశ్యకమైన విషయమని, ఈ విషయంలో కొందరు తీవ్రవాద ధోరణిని, మరికొందరు మితవాద ధోరణిని వదులుకోవలసి వుంటుందని శ్రీ మొరార్జీ పేర్కొన్నారు.

బెంగాల్ అసెంబ్లీకి కూడా ఎన్నికలు

పి. సి. సేన్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జనవరి 4: లోక్‌సభకు జరిగే ఎన్నికలతోబాటు, పశ్చిమ బెంగాల్ శాసనసభకు కూడా ఎన్నికలు జరపాలని, పశ్చిమ బెంగాల్ సంస్థా కాంగ్రెస్ నాయకుడు శ్రీ పి. సి. సేన్ నిన్న కోరారు.

నిన్న యిక్కడ సంస్థా కాంగ్రెస్ కేంద్ర నాయకుల సమావేశానంతరం పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ, తమపార్టీ రాష్ట్ర శాసనసభకు గల 280 స్థానాలకు లోక్‌సభకు గల 40 స్థానాలకు పోటీ చేయగలదని ఆయన తెలియజేశారు.

ఏ పార్టీతోను ఎలాంటి పొత్తు గాని, సర్దుబాటుగాని వుండదని ఆయన చెప్పారు.

జనవరి 7 నాటికి లోక్‌సభకు పశ్చిమ బెంగాల్ శాసనసభకు తమ పార్టీ అభ్యర్థుల జాబితాలు సిద్ధం కాగలవని శ్రీ సేన్ తెలిపారు.

ఎన్నికలు ఒకేసారి జరిగినట్లైతే రాజకీయ పక్షాలు పెద్ద యిబ్బందిలో పడతాయని ఆయన అన్నారు.

పశ్చిమ బెంగాల్ పి. సి. సి. మాజీ అధ్యక్షుడు శ్రీ అతుల్యఘోష్ కూడా పత్రికా విలేఖరుల సమావేశానికి హాజరైనారు.

పశ్చిమ బెంగాల్‌లో శాంతిభద్రతల పరిస్థితి భయంకరంగా వున్నదన్న మాట నిస్సందేహమని, కాని లోక్‌సభకు ఎన్నికలు జరుపుతున్నప్పుడు, ప్రభుత్వానికి గాని, అభ్యర్థులకు గాని హెచ్చుగాఅదనపు ఖర్చు లేకుండా రాష్ట్ర శాసనసభకు కూడా ఎన్నికలు జరపవచ్చునని శ్రీ సేన్ కొన్ని ప్రశ్నలకు జవాబుగా చెప్పారు.

దవుర్జన్యంలో నమ్మకం వున్న పార్టీలు, దవుర్జన్యాలకు పాల్పడుతున్న పార్టీలు, ఎన్నిక లను భగ్నం చేయాలన్న ఆసక్తితో లేవని, అయన అన్నారు.

నక్సలైట్లు ఎన్నికల్లో పోటీ చేయబోరని వారు ఎన్నికలను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తే ప్రజాస్వామిక పక్షాలు వారిని ప్రతిఘటించగలవని ఆయన తెలిపారు.

పార్టీ ముక్కచెక్కలయిందని ఊలకవగా చూస్తున్నారన్నారు.

పార్లమెంటుకు సార్వభౌమాధికారం

ఈ ఎన్నికలలో పార్లమెంటుకు సార్వభౌమాధికారం ఉండని ప్రజలకు విన్నవిస్తూ తెలియపరచి, రాజ్యాంగ చట్టాన్ని సవరించే హక్కు పార్లమెంటుకు ఉందని, సుప్రీంకోర్టును అదుపులో పెట్టి తమ పరిధిలో మాత్రమే వ్యవహరించే పద్ధతి ప్రవేశపెట్టి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఒక కోటిలోనికి అభివృద్ధికి అడ్డు తగులుతున్నదని పేర్కొన్నారు.

విభిన్న ధోరణులు

1 వ పేజీ తరువాయి

వారు.

1977 దాకా ఆగితే, ఆలోగా నాలుగు సార్వత్రిక ఎన్నికలు—రెండు లోక్‌సభకు, రెండు శాసన సభకు— జరగవలసి వుంటుందని అందువల్ల అంతవరకు భవిష్యత్తును తాకట్టు పెట్టడం కూడదని మరికొందరు విమర్శిస్తారు.

అయితే శ్రీ వల్లూరి బసవరాజు వాదం మరీ విచిత్రంగా వున్నదని, కొందరు విమర్శిస్తున్నారు. ఈ ఎన్నికలలో ప్రజాసమితి పక్షానఅభ్యర్థులుపోటీచేస్తుండడంవారుకేంద్రంలో కొత్తకాంగ్రెసుకు [illegible] ప్రధాన మంత్రిని బలపర్చడం అనేది [illegible] సూత్రాన్ని బట్టి ఆమోదయోగ్యం అవుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. జాతీయ సమస్యలలో ప్రధానికి అనుకూలంగాను, రాష్ట్ర సమస్యలలో భిన్నంగాను వ్యవహరించాలన్న ఆయన వాదం చాలా మందికి దుర్బోధ్యంగా వున్నది.

శ్రీ వి. బి. రాజు వాదం

1977 దాకా అగకుండ 1972 లోనే తెలంగాణా వ్యవహారం పరిష్కారం కావాలని శ్రీ వల్లూరి బసవరాజు సిద్ధాంతం. 1977 నాటికి ఈ వ్యవహారం తేలినా సరిపోదని డాక్టర్ చెన్నారెడ్డి అభిప్రాయం. 1977 దాకా ఆగడానికి డాక్టర్ చెన్నారెడ్డి సిద్ధపడినా శ్రీ రాజు మాత్రం '72లోనే యీ వ్యవహారం తేలాలంటున్నారు.

శ్రీ రాజు అతివాదిగాను, డాక్టర్ చెన్నారెడ్డి మితవాదిగాను రూపొందారు. ప్రజాసమితి సభ్యులంతకావని చెబుతూ, నిన్నమొన్న జరిగిన ప్రజా సమితి కార్యవర్గ సమావేశానికి వెళ్ళిన శ్రీ వి. బి. రాజు, శ్రీ మాకల రామచంద్రారెడ్డి, ప్రజాసమితి నాయకత్వం నుంచి డాక్టర్ చెన్నారెడ్డి గనుక తప్పుకుంటే ఆ నాయకత్వాన్ని తాము చేపట్టడానికి సిద్ధంగా వెళ్ళరా అన్న సందేహం కొందరి నోట వినవస్తున్నది. ప్రజాసమితి సభ్యులు కాని వారు తీర్మాన రచనా సంఘంలో సభ్యులుగా నియమించబడడం చోద్యంగా వున్నదని, కొందరు అంటున్నారు.

తెలంగాణా సమస్య రావణాసురుడికాష్టం లాగా 1977 వరకు తగులబడుతూవుండకుండా 1972 నాటికి తాడో పేడో తేల్చాలని ప్రజాసమితి కార్యకర్తల్లో అధికసంఖ్యాకుల అభిప్రాయంగా కనిపిస్తున్నది. ఏడేళ్ళ పాటు ఈ ఉద్రిక్తస్థితి వుండడం క్షేమం కాదని, 1972 నాటికే పరిష్కారం కుదరదని తేలిపోతుందని చెప్పేవారు మరికొందరున్నారు.

1977 వరకు సమిష్టి రాష్ట్రంలో వుంటూ అప్పటికే తెలంగాణా శాసన సభ్యులు విడిరాష్ట్రాన్ని కోరుదామంటే విడిపోవడం కన్నా సత్యాంతరం వుండదని, కొత్తకాంగ్రెస్ నాయకులు కొందరు అంటున్నారు. అప్పటికి ప్రత్యేక రాష్ట్రాన్ని ఆశించేవారు తెలంగాణాలో తగినంతమంది వుండకపోవచ్చునని, ప్రధాని రాజ్యాంగపరిపాదనలను సమర్థించేవారి అభిప్రాయంగా చెబుతున్నారు.

1977 నాటికి పోచంపాడు ప్రాజెక్టు పూర్తికావడం, ఉద్యోగుల వ్యవహారాలు తేలిపోవడం జరుగుతుందని, నాటి ఆతెలంగాణా ఆర్థికాభివృద్ధి లోపమే అశాంతికి కారణమని చెప్పే సమయుక్తవాదులు ఆర్థికాభివృద్ధితో ప్రత్యేక రాష్ట్రం వాంఛ తగ్గుతుందని భావిస్తున్నారు.

ఆంధ్ర తెలంగాణా ప్రాంతాలు చాలా కాలంపాటు వేరు వేరు రాజకీయ వ్యవస్థల క్రింద వుండడమే కాకుండా, అధికార వ్యవహా

రాలుకూడా వేరుగా వున్నాయని, అందువల్ల ప్రత్యేక రాష్ట్ర నిర్మాణం జరిగిన నాడే తెలంగాణా ప్రజల రాజకీయ మనోరథం ఫలించగలదని, ప్రత్యేక రాష్ట్రవాదుల వాదంగా వున్నది. ప్రత్యేక రాష్ట్రాన్ని కూడదని అంటూనే ప్రత్యేక రాష్ట్రవాదులు కోరిన కోరికలను ఒకదాని తర్వాత మరొకదానిని తీరుస్తూ, కాలంగడుపుకొనిపోతూ వుండడం వల్ల సమైక్యతను వాంఛించే ప్రజలకుగాక్షత భవిష్యత్తుపై నమ్మకం కలుగడం లేదు.

ఉద్యోగాల విషయంలో ప్రాంతీయసంఘానికి ఎటువంటి అధికారాలు లేవని చెప్పిన ప్రభుత్వం, ఉద్యోగుల నియామకాల గురించి వారికే నిబంధనలు తయారు చేయుమనగా, చివరకు ఉద్యోగాల్లో ప్రాంతీయులకును కూడా అంగీకరించడం తటస్థించింది. వెనుకబడిన ప్రాంతాల ఎక్కడవున్నా సమభావంతో బాగుపరచడానికి పూనుకొంటామని చెప్పిన ప్రభుత్వ అధినేతలు తెలంగాణాకు వేరు బడ్జెట్‌కు అంగీకరించారు.

ప్రాంతీయ సంఘం తట్టుకుంటే ఏవిధ్యైనా ప్రభుత్వ విధానాల అమలును స్తంభింప చేయగలదు. ముల్కీనిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు చెప్పిన కొన్ని ఉద్యోగాల ఆంధ్రప్రదేశ్ సర్వీస్‌కమిషన్ పర్యవేక్షణనుంచి తప్పించి, తెలంగాణాలో ఆ ఉద్యోగాల నియామక అధికారాన్ని కలెక్టర్లకు దత్తం చేయడం జరిగింది.

ప్రాంతీయకరణ కన్నా ప్రత్యేక రాష్ట్ర నిర్మాణమే తమకు లాభదాయకమని భావించేవారు ఉద్యోగుల్లో కూడా ఉభయ ప్రాంతాలకు చెందిన వారు కొందరున్నారు. ప్రత్యేకరాష్ట్ర భావం వర్థిల్లడానికి ఉద్యోగులు, నిరుద్యోగులు, భంగపడ్డ రాజకీయ నేతలు కారణమని చెప్పిన ప్రభుత్వం, రాజకీయ నేతలను తృప్తి పరచిన సమైక్యత వర్థిల్లడానికి నిరంతరం కృషి చేస్తేనేగాని ఆ భావాన్ని అణగగొట్టడం సాధ్యపడదని పరిశీలకులు భావిస్తున్నారు.

రాజకీయ నేతలు వేస్తున్న పథకాలను ఎత్తుకు పై ఎత్తులుగా ప్రజలు అనుకుంటున్నారు. ప్రత్యేక రాష్ట్రాన్ని కోరే ఒక నాయకునితో సర్దుబాటు చేసుకోవడానికి సిద్ధపడితే, ఆ స్థానాన్ని భర్తీ చేయడానికి మరి కొందరు ముందుకు వస్తున్నట్లు ప్రజలు గమనిస్తున్నారు. అలాంటివారే ఈ సమస్య 1972లోనే తేలాలి అంటున్నారు. సమైక్యత, ఏర్పాటు సరిపడనిసంగతులైనప్పుడు సమైక్యత అని చెప్పేవారు ఆ సమైక్యతా భావం బలపడడానికి యింతవరకు చేసిందేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని నగరం అని చెప్పినచోటనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వారు విద్య, ఉద్యోగ విషయంలో సమానావకాశాలు పొందవచ్చును, యిదేమి సమైక్యత అని ప్రజలు ముక్కుమీద వేలువేసుకుంటున్నారు. నిజంగా సమైక్యత కోరేవారంతా ఉభయ ప్రాంతాలలో ప్రాంతీయ సంఘాలు ప్రాంతీయ సిబ్బంది, ప్రాంతీయ రక్షణలు, ప్రాంతీయ బడ్జెట్ అనే ఆలోచనలు విడనాడి చిత్తశుద్ధితో కృషి చేస్తేతప్ప, ఏర్పాటు ధోరణులను అంతంచెయ్యడం ఒకసారైన సాధ్యపడదని రాజకీయ వర్గాలవారు భావిస్తున్నారు.

1977 దాకా ప్రస్తుత మంత్రివర్గం శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డిగారే అధికారంలోవుండి అప్పుడు తెలంగాణా నాయకులొకరికి ముఖ్యమంత్రి పదవిని అప్పగించి, "నాయనా, ఈ రాష్ట్రాన్ని ఏకంగా వుంచుతావో, రెండుగా చేస్తావో భారం అంతా నీదే అని డాక్టర్ మర్రి చెన్నారెడ్డికి అప్పగించ వచ్చునని ఒక నాయకుడు చమత్కరించారు.

సంస్థా కాంగ్రెస్, జనసంఘం, ఎస్. ఎస్. పి. లతో కొత్త ఫ్రంట్

ఇందిరా ప్రభుత్వాన్ని పడగొట్టే లక్ష్యంతో

3 పార్టీల నిర్ణయం: ఉమ్మడి కార్యక్రమ సూత్రంపై నిరసనగా చర్చలనుండి మసానీ వాకౌట్

న్యూఢిల్లీ, జనవరి 4: త్వరలో జరుగనున్న మధ్యంతర ఎన్నికలలో కొత్త కాంగ్రెసును ఓడించటానికి సంస్థా కాంగ్రెసు, జనసంఘ్, ఎస్. ఎస్. పి. లు కలిసి ఒక కొత్త ఫ్రంటుగా ఏర్పడేందుకు నిర్ణయం ప్రకటించారు.

ఎన్నికల సర్దుబాట్లపై చర్చలకు సంస్థా కాంగ్రెసు, జనసంఘ్, స్వతంత్ర, ఎస్.ఎస్.పి.ల నాయకులు సమావేశం జరిపారు.

నాలుగు పార్టీల ఫ్రంట్ ఉమ్మడి కార్యక్రమం లేకుండా ఎన్నికల సర్దుబాట్లు చేసుకోవాలని సంయుక్త సోషలిస్టు పార్టీ నిన్నటి సమావేశంలో చేసిన ప్రతిపాదనకు స్వతంత్ర పార్టీ సమ్మతించలేదు. ప్రజాస్వామ్య ఫ్రంట్ ఏర్పాటు కావాలని స్వతంత్రపార్టీ పట్టుబట్టింది.

ఉమ్మడి కార్యక్రమంతో ఫ్రంట్ ఏర్పాటు కావాలని కోరుతూ నిన్నటి సమావేశం నుండి వాకవుట్ జరిపిన స్వతంత్రపార్టీకి సంస్థా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ నిజలింగప్ప ఒక విజ్ఞప్తి చేస్తూ ఇందిరాగాంధి ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు 3 పార్టీల ఫ్రంట్‌లో చేరవలసిందిగా కోరారు.

శ్రీ నిజలింగప్ప గృహంలో జరుగుతున్న చర్చలనుండి స్వతంత్రపార్టీ అధ్యక్షుడు శ్రీ మసానీ బయటకు వస్తూ సంస్థా కాంగ్రెస్ పార్టీ అనిశ్చితస్థితిలో వున్నట్లు ఆరోపించారు.

శ్రీ మసానీ యీ అంశాన్ని తమ పార్టీ జాతీయ కార్యవర్గం ఎదుట వుంచటానికి మద్రాసు బయలుదేరి వెళ్ళారు.

శ్రీ మసానీ బయటకు వచ్చిన తరువాత జనసంఘ్ అధ్యక్షుడు శ్రీ వాజ్‌పేయీ సమావేశంలో పాల్గొనటానికి వచ్చారు. సమావేశం నిన్నరాత్రి ప్రొద్దుపోయినదాకా జరిగింది.

నిన్నటి చర్చలలో ఎస్. ఎస్. పి. నాయకులు చేరటానికి ముందే మొన్న అంగీకరించబడిన సంయుక్త ప్రకటనను పత్రికలకు విడుదల చేయవలసిందిగా శ్రీ మసానీ కోరారు. అయితే ఎస్. ఎస్. పి., బి. కె. డి. నాయకులు వచ్చే వరకు యీ ప్రకటనను విడుదల చేయకుండా వుండాలని శ్రీ నిజలింగప్ప భావించారు.

చర్చలు జరిగిన శ్రీ నిజలింగప్ప ఇంటి నుండి శ్రీ మసానీ కోపంతో బయటకు వెళ్ళిపోయ్యారు.

ఆ తరువాత తమ నివాస భవనంలో శ్రీ మసానీ పత్రికా విలేఖరులకు ఒక ప్రకటన అందజేస్తూ సంస్థాకాంగ్రెసు దివాలిక్షణంలో ఎటూతేల్చుకోలేని పరిస్థితిలో, నిర్ణయం చేయలేని స్థితిలో పడిపోయిందని విమర్శించారు.

కొత్తగా ఏర్పడిన ఫ్రంట్‌లో చేరవలసిందిగా యీ పార్టీల నాయకుల స్వతంత్ర, బి. కె. డి. పార్టీలకు సంయుక్త ప్రకటనలో విజ్ఞప్తి చేసినప్పటికీ, శ్రీ మసానీ గైర్హాజరు చర్యపట్ల వార వేదాంతధోరణి అవలంబించారు.

వాజ్‌పేయి వ్యాఖ్య

విలేఖరులు అడిగిన ప్రశ్నలకు జనసంఘ్ అధ్యక్షుడు శ్రీ వాజ్‌పేయీ సమాధానమిస్తూ పరిస్థితిలో మార్పులేదనీ మొన్న మూడు పార్టీలే వున్నాయనీ, నిన్న మూడు పార్టీలే ఫ్రంట్‌లో వున్నాయనీ అన్నారు. అయితే మొన్న స్వతంత్ర పార్టీ వున్నది. నిన్న స్వతంత్ర పార్టీ వెళ్ళిపోయి, ఎస్. ఎస్. పి. చేరింది అని ఆయన అన్నారు.

ఫ్రంట్ ఏర్పాటులో కొత్తపరిణామాలపై శ్రీమసానీ తమ పార్టీనుండి ఆదేశాలు పొందే వరకు వేచివుండవలసిన అవసరం కనిపించదని సంస్థా కాంగ్రెసు, ఎస్. ఎస్. పి. నాయకులు చెప్పారు.

ఉమ్మడి కార్యక్రమం ప్రతిపాదనను ఎందుకువిడిచిపెట్టారని ఒక విలేఖరి అడుగగా ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటుకే ఉమ్మడి కార్యక్రమం అవసరమనీ, యిప్పుడు కొత్త కాంగ్రెసును ఓడించటానికి ప్రజాస్వామ్య పక్షాల ఫ్రంట్‌ను చేయటమే ముఖ్యమని శ్రీ వాజ్‌పేయీ అన్నారు.

1967 ఎన్నికల తరువాత కాంగ్రెసు పార్టీ పలు రాష్ట్రాలలో ఓడిపోగా ఇతర పార్టీలు కలిసి ఒక ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించి ప్రభుత్వాలను ఏర్పాటు చేయలేదా అని ఆయన అడిగారు.

ఇందిరా ప్రభుత్వాన్ని పడగొట్టటానికి ఏర్పడిన ఫ్రంట్‌లో చేరే విషయంలో బి.కె.డి. వెనుకాడబోదని తాము ఆశిస్తున్నట్లు సంయుక్త సోషలిస్టుపార్టీ నాయకుడు శ్రీ రాజనారాయన్ నిన్న పేర్కొన్నారు.

ప్రభుత్వాల ఏర్పాటు విషయంలో ఉమ్మడి కార్యక్రమం కోసం పట్టుబట్టిన ఎస్. ఎస్. పి. ఇప్పుడు ఉమ్మడి కార్యక్రమం అక్కర లేదనటానికి కారణం ఏమిటని అడుగగా ఇందిరాగాంధిని దింపటమే మా ఉమ్మడి కార్యక్రమం అని ఆయన సమాధానం చెప్పారు.

బి.కె.డి కార్యవర్గం నిర్ణయం

కొత్తగా ఏర్పడిన ఫ్రంట్‌లో చేరే విషయంపై నేడు సమావేశం కానున్న భారతీయ క్రాంతిదళ్ ఒక నిర్ణయం గైకొంటుంది.

నిన్న జరిగిన చర్చలలో పాల్గొనటానికి బి.కె.డి. తరపున శ్రీ కుంభారామ్‌ఆర్యను పంపగలమని శ్రీ చరణ్‌సింగ్ వాగ్దానం చేశారనీ అయితే ఆయన రోహటక్‌లో ఉండటంచేత రాలేకపోయారని శ్రీ నిజలింగప్ప అన్నారు.

నిన్నటి సమావేశములో ఎస్. ఎస్. పి. తరపున శ్రీయుతులు రాజనారాయన్, జార్జి ఫెర్నాండెజ్, రాబీరే, మధులిమాయేలు పాల్గొన్నారు.

ఇన్ని రోజులుగా శ్రీ నిజలింగప్పతోపాటు చర్చలలో పాల్గొన్న శ్రీ మొరార్జీ దేశాయ్ నిన్న చర్చలకు ముందు అహ్మదాబాద్ వెళ్లారు.

ఢిల్లీ చర్చలనుండి శ్రీ మసానీ వాకవుట్ జరుపటంపై వ్యాఖ్యానించడానికి అహ్మదాబాద్‌లో నిన్న శ్రీ మొరార్జీదేశాయ్ నిరాకరించారు. ఇటువంటి వాటిల్లో వోర్పు అవసరమని ఆయన అన్నారు.

స్వతంత్రపార్టీ, బి. కె. డి.లు కూడా యీ ఫ్రంట్‌లో చేరవలసిందిగా నేడు ఫ్రంట్ నాయకులు ఆ పార్టీలకు విజ్ఞప్తి చేశారు.

ఉమ్మడి కార్యక్రమం లేకుండా ఏర్పాటైన ఫ్రంట్ విషయమై స్వతంత్ర పార్టీ అధ్యక్షుడు శ్రీ మసానీ ... ఫ్రంట్‌లో స్వతంత్రపార్టీ చేరేది.

కొత్తగా ఏర్పడిన యీ పరిణామంపై స్వపార్టీ జాతీయ కార్యవర్గం పరిశీలించిన తర్వాత శ్రీ మసానీ ప్రకటించారు. స్వతంత్రపార్టీ జాతీయ కార్యవర్గం యీ నెల 13న మద్రాసులో సమావేశం జరుపుతున్నది.

అభ్యర్థుల ఎన్నికకు సమన్వయ సంఘం

దేశం మొత్తం మీద ఒక్కొక్క నియోజకవర్గానికి ఒక్కొక్క అంగీకృత అభ్యర్థిని ఎన్నిక చేయటానికి ఒక సమన్వయసంఘాన్ని ఏర్పాటు చేయాలని కొత్త ఫ్రంట్ నిర్ణయించింది. ఈ అభ్యర్థులను ఫ్రంట్‌లోని పార్టీలు బలపరుస్తాయి.

నిన్న అంగీకరించిన ఉమ్మడి కార్యక్రమం ప్రాతిపదికగా సంస్థా కాంగ్రెసు, జనసంఘం, స్వతంత్రపార్టీలు, ఒక ఫ్రంట్‌గా ఏర్పడే విషయం ప్రకటించటానికి నేడు ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం జరుగటానికి సుమారు గంటముందు పార్టీల సమావేశం నుండి స్వతంత్రపార్టీ వాకవుట్ జరిపింది.

నేటి మధ్యాహ్నం చర్చలలో చేరినసంయుక్త సోషలిస్టు పార్టీ నాయకులు యీ ఫ్రంట్ కేవలం ఎన్నికల సర్దుబాట్లకు మాత్రమే పరిమితమై వుండి, కేంద్రంలో యిప్పుడున్న ప్రభుత్వాన్ని పడగొట్టేలక్ష్యంతో పని చేస్తేనే తాము యీ ఫ్రంట్‌లో చేరగలమని స్పష్టం చేశారు.

ఆంధ్రలో 27 స్థానాలకు ప్రతిపక్ష కూటమి పోటీ

శ్రీ సంజీవరెడ్డి ప్రకటన

హైదరాబాద్, జనవరి 4: ఆంధ్ర ప్రాంతంలోని మొత్తం 27 లోక్ సభా స్థానాలకు సంస్థా కాంగ్రెస్, జనసంఘం, స్వతంత్రపార్టీల కూటమి పోటీ చేయగలదని సంస్థాకాంగ్రెస్ నాయకులు శ్రీ నీలంసంజీవరెడ్డి నిన్న సాయంకాలం ఇక్కడ ప్రకటించారు.

తెలంగాణా ప్రాంతానికి సంబంధించినంత వరకు, తెలంగాణా ప్రజాసమితి ప్రధాని ప్రతిపాదనలపై చర్చలు జరుపుతున్నందువల్ల తాము ఇంకా ఎలాంటి నిర్ణయాన్ని తీసుకోలేదన్నారు.

—:o:—

సంస్థా కాంగ్రెస్ అనిశ్చిత స్థితి

మసానీ విమర్శ

న్యూఢిల్లీ, జనవరి 4: సంస్థాకాంగ్రెసు, జనసంఘ్, ఎస్. ఎస్. పి. నాయకులసంయుక్త ప్రకటనపై స్వతంత్రపార్టీ నాయకుడు శ్రీ మసానీవ్యాఖ్యానిస్తూ యిది కొత్త ప్రతిపాదన. ఉమ్మడి కార్యక్రమం లేకుండాఫ్రంట్ ఏర్పాటు గురించి యిదివరకు అనుకోలేదు అని అన్నారు.

తమ పార్టీ జాతీయ కార్యవర్గం మద్రాస్‌లో యీ నెల 13న సమావేశం జరిపిన తరువాత అవసరమైతే పార్టీ అభిప్రాయాన్ని తెలియచేయగలమని కూడా శ్రీ మసానీ అన్నారు.

సిద్ధాంతపరమైన ఎన్నికల ఒప్పందం చేసుకునే విషయంలో సంస్థా కాంగ్రెసు అనిశ్చిత వైఖరిని అవలంబించిందనీ, అటు ఇటు ఊగిసలాడే స్వభావం కనబర్చిం... స్వతంత్రపార్టీ అధ్యక్షుడు తమ నివాస ... విలేఖరులతో ప్రసంగిస్తూ పేర్కొ...

మహత్తర కూటమికి ఇసురు

గుజరాత్ మంత్రుల వ్యతిరేకత

వారిని ఒప్పించేందుకు శ్రీ మొరార్జీ గట్టికృషి

అహమ్మదాబాద్, జనవరి 4: జనసంఘం, స్వతంత్రపార్టీలతో సంస్థా కాంగ్రెసుపార్టీ పొత్తు పెట్టుకొనరాదని వాదించే ఇద్దరు గుజరాత్ మంత్రులు శ్రీ మధివలాక్‌షా, శ్రీ గోవర్థన్‌దాస్‌చోక్లావాలాలతో నిన్న శ్రీ మొరార్జీదేశాయ్ విడివిడిగా చర్చలు జరిపారు.

ఈ చర్చలు నిన్న మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్యమంత్రి నివాస భవనంలో జరిగాయి.

శ్రీ దేశాయ్‌తో చర్చలు జరిపిన అనంతరం శ్రీ చోక్లావాలా విలేఖరులతో ప్రసంగిస్తూ, తమ వైఖరిలో మార్పు లేదనీ, ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకొనే ఆవశ్యకత గురించి శ్రీ దేశాయ్ వివరించారని తెలిపారు. నిన్న రాత్రి తాము రాజకోట వెడుతున్నామనీ అక్కడ రెండు రోజులు ఉండి ఈ అంశంపై ప్రశాంతంగా ఆలోచిస్తామనీ కూడా ఆయన వివరించారు.

శ్రీ దేశాయ్‌తో అరగంట సేపు చర్చ జరిపిన తరువాత శ్రీ షా విలేఖరులతో మాట్లాడుతూ తమ జిల్లాకు చెందిన పార్టీ నాయకులతో, కార్యకర్తలతో చర్చలు జరిపిన తరువాత తాము తిరిగి నిన్న రాత్రి శ్రీ దేశాయ్‌ని కలుసుకొనగలమని చెప్పారు.

ఆ తరువాత శ్రీ చోక్లావాలా, శ్రీ షాలు కలసి శ్రీ షా గృహంలో చర్చలు జరిపారు.

పై ఇరువురు శ్రీ దేశాయ్‌తో చర్చలు జరిపిన తరువాత రాష్ట్ర మంత్రివర్గములో సీనియర్ మంత్రి శ్రీ తకారేభాయ్ దేశాయ్ కూడా నిన్న శ్రీ మొరార్జీని కలుసుకుని సంభాషణలు జరిపారు.

పార్టీ అభ్యర్థులను ఎన్నిక చేయటానికై నేటి సాయంత్రం రాష్ట్ర సంస్థా కాంగ్రెసు పార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశంఏర్పాటు చేయబడింది. ఈ సమావేశంలో పాల్గొనడానికి శ్రీ మొరార్జీ ఢిల్లీనుండి వచ్చారు.

ఆయన ఇచ్చటకు వచ్చిన వెంటనే రాష్ట్ర రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రదేశ్ సంస్థా కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ వజుభాయిషా ప్రభృతులతో చర్చలు జరిపారు.

మధ్యంతర ఎన్నికలకు రాష్ట్రంలో

తమిళనాడులో 11 స్థానాలకు పోటీ: ఎస్.ఎస్.పి నిర్ణయం

మద్రాసు, జనవరి 4:తమిళనాడులోని 39 లోక్‌సభ నియోజకవర్గాలలోను 11నియోజకవర్గాల నుంచి ఎస్. ఎస్. పి. పోటీ చేస్తుంది.

రాష్ట్ర ఎస్. ఎస్. పి. సంయుక్త కార్యదర్శి శ్రీ వి.పి.కుమారవేలు నిన్న ఇక్కడ ఈ విషయాన్ని చెప్పారు.

డి. ఎం. కె. పార్టీ అధికారంలోనుంచి తప్పుకుని, రాష్ట్ర శాసనసభకుకూడా, మధ్యంతర ఎన్నికలను జరిపించాలని ఆయన కోరారు.

8వ కాలం తరువాయి

అశ్వర్థనారాయణమూర్తిచౌదరిమాట్లాడుతూ బ్యాంకు స్థాపకులు రావుసాహెబ్ శ్రీ గుడ్లవల్లేటి వెంకటరత్నంపంతులు అవిరళ కృషి చేశారని, వారి ఆశీస్సులతో యీ ముప్పది సంవత్సరములు తోటి పాలకవర్గ సభ్యుల సహకారముతో బ్యాంకు అభివృద్ధిపరచామని తెలియజేశారు.

జాతీయ పతాకమును శ్రీ పిన్నమనేని కోటేశ్వరరావు, సహకార పతాకమును గుడివాడ పంచాయతీ అధ్యక్షులు శ్రీ అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు.

శ్రీయుతులు వ్యాడేవు జగ్గరాజు, డా. గుడ్లవల్లేటి లక్ష్మణరావు, ప్రభృతులు ప్రసంగించారు.

బ్యాంకు మాజీ కార్యదర్శి శ్రీ వెంపటి జగన్నాథంను పండిత శాలువతో శ్రీ అశ్వర్థనారాయణమూర్తి చౌదరి సత్కరించారు.

కూచిపూడి కళాక్షేత్రంవారు క్షీర సాగర మథనం ప్రదర్శించారు.

ప్రధానికి పూర్తి మెజారిటీ రాకుండా చేయడానికి తీవ్రకృషి

మధ్యంతర ఎన్నికలలో మితవాదకమ్యూనిస్టు ... లక్ష్యం: రాజేశ్వరరావు ప్రకటన

విజయవాడ, జనవరి 4: లోక్‌సభకు జరుగనున్న మధ్యంతర ఎన్నికలలో కొత్త కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజారిటీ వచ్చేటట్లు చేయడానికి ప్రధానమంత్రి ప్రయత్నిస్తున్నారని, ఈ పథకాన్ని భగ్నం చేయడానికి మితవాద కమ్యూనిస్టు పార్టీ శాయశక్తులా కృషి చేయగలదని సి.పి.ఐ. ప్రధాన కార్యదర్శి శ్రీ సి. రాజేశ్వరరావు ఇక్కడ పేర్కొన్నట్లు తెలియవచ్చింది.

శ్రీ రాజేశ్వరరావు మొన్న రాత్రి ఇక్కడ జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ భారత కమ్యూనిస్టుపార్టీ (సి.పి.ఐ.) జాతీయ స్థాయిలో కొత్త కాంగ్రెసుతోఎన్నికల పొత్తును కుదుర్చుకోదని కూడా స్పష్టం చేసినట్లు తెలిసింది. కొత్త కాంగ్రెసులో అనేకమంది అభివృద్ధి నిరోధకులు మితవాద శక్తులు ఉన్నారని, మధ్యంతర ఎన్నికలలో వారు పోటీచేసే నియోజకవర్గాలన్నింటిలో వారిని తమ పార్టీ వ్యతిరేకించగలదని కూడా ఆయన అన్నారు.

అయితే అభివృద్ధి నిరోధక, మితవాద శక్తుల విజయావకాశాలను నిరోధించడం కోసం పార్టీ సీట్ల సర్దుబాట్లకు సమ్మతించవచ్చునన్నారు. తమ పార్టీకి బాగా బలం ఉన్న చోట సొంతంగానే అభ్యర్థులను నిలబెట్టగలమనికూడా ఆయన తెలిపారు. (పి.టి.ఐ.)

తెలంగాణా సమస్య:

ప్రధాని ప్రతిపాదనపై ముసాయిదా తీర్మానం

రచనకు ప్రజాసమితి కార్యవర్గంచే 14 మందితో సంఘం ఏర్పాటు

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, జనవరి 4: తెలంగాణా సమస్య పరిష్కారం విషయంలో ప్రధాని చేసిన ప్రతిపాదనలపై ఒక ముసాయిదా తీర్మానాన్ని రూపొందించడానికి ప్రజాసమితి కార్యవర్గం నిన్న సాయంకాలం 14 మంది సభ్యులతో ఒక సంఘాన్ని నియమించింది.

దీనికి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి అధ్యక్షులుగా వుంటారు. శ్రీయుతులు కె. వి. రాజు, నూకల రామచంద్రారెడ్డి, మదనమోహన్, కె. నరసింగరావు, శ్రీమతి ఈశ్వరీబాయ్ ప్రభృతులు సభ్యులుగా వుంటారు.

ఈ సమస్య పరిష్కారానికి 1977 దాకా ఆగకుండా 1972 లోనే వ్యవహారం తేల్చే ఏర్పాటు చేయాలని మొన్న నిన్న, జరిగిన చర్చల్లో పాల్గొన్న అధిక సంఖ్యాకులు తమ అభిప్రాయాన్ని వెల్లడించినట్లు తెలుస్తున్నది.

కడప ఆసుపత్రిలో ఒక రోగి దారుణహత్య

(స్వకీయ విలేఖరి)

కడప, జనవరి 4: కడప పట్టణ శివారులను, జిల్లా ప్రధాన ఆసుపత్రిసిబ్బందిని నిర్ఘాంతపరిచే సంఘటన ఒకటి మొన్న రాత్రి జిల్లా ప్రధాన ఆసుపత్రిలో జరిగింది.

మొన్న రాత్రి 7.30 గంటలకు మారణాయుధాలు ధరించిన కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ప్రభుత్వ ఆసుపత్రిలోని శస్త్రచికిత్సా విభాగం (నం—2)లోనికి ప్రవేశించి 28వ పడకమీదవున్న తవ్వా చిన్న సుబ్బిరెడ్డి (వయస్సు 50 సం)ని తరిమి తరిమి 14వ పడక దగ్గర అతి దారుణంగా పొడిచి చంపారు. మిగతా రోగులు విభ్రాంతులై నిస్సహాయులై చూస్తూ నిలుచుండిపోయారు.

సంఘటన జరిగిన ప్రాంతాన్ని ఆంధ్రపత్రిక విలేఖరి నిన్న ఉదయం చూడడం జరిగింది. శస్త్రచికిత్సా విభాగం వరండా మెట్లుకూడా ఇనుపజల్లెడ బిగించివున్నది. ఎవరైనా రావాలంటే గుమ్మంలోనుంచే రావలసి వుంది. విధి నిర్వహణలో వున్న వైద్యాధికారి, నర్స్, వార్డుబాయ్ మొన్నరాత్రి ఆపరేషన్ థియేటర్‌లో అత్యవసరమయిన కేసును చూడటానికి వెళ్ళారు. ఆ సమయంలో ఈ సంగతి తెలుసుకొన్న ముగ్గురు వ్యక్తులు నరాసరి శస్త్రచికిత్సా విభాగంలోని రెండవవార్డులో ప్రవేశించి తవ్వాచిన్నసుబ్బిరెడ్డి ఏ మంచం మీదవున్నది అక్కడి రోగులను అడిగి తెలుసుకున్నారు. చిన్నసుబ్బిరెడ్డి డిశంబర్ 30న ఆసుపత్రిలో చేరాడు. తిర్రారు ప్రక్కన వరండాలో 28వ పడకమీద అతడు వున్నాడు. దుండగులు అతడిదగ్గరకు వెళ్ళి పడకమీదవున్నవాడిని రెండుపోట్లు పొడిచారు. సుబ్బిరెడ్డి భయంతో లేవగా దుండగులు అతడిని వార్డులోనికి తరిమారట. 14వ నంబరు పడక దగ్గర పట్టుకొని సుమారు 12 కత్తిపోట్లను సుబ్బిరెడ్డి ప్రాణాలు విడిచేంతవరకు కసితీరేలా పొడిచి పారిపోయారట.

రాష్ట్రంలో భూమి తనఖా బ్యాంకులకు 34 కోట్ల ఋణం

ప్రపంచ బ్యాంకు ఆమోదం: మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ రజ్వీ వివరణ

(స్వకీయ విలేఖరి)

గుడివాడ, జనవరి 4: ఆంధ్రప్రదేశ్‌లోని సహకార భూమి తనఖా బ్యాంకులకు ప్రపంచ బ్యాంకు 34 కోట్ల రూపాయలు అప్పుగా యివ్వడానికి ఆమోదించిందని ఆంధ్రప్రదేశ్ భూమితనఖా బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎస్. ఎ. హెచ్. రజ్వీ గుడ్లవల్లేరు గ్రామంలో సహకార భూమి తనఖా బ్యాంకు రజితోత్సవ సందర్భంలో వెల్లడించారు.

సభకు అధ్యక్షత వహించిన జిల్లాపరిషత్ చైర్మన్ శ్రీ పిన్నమనేని కోటేశ్వరరావు మాట్లాడుతూ యీ సహకార భూమి తనఖా బ్యాంకులు ఇచ్చే ఋణాలు, అప్పులు వలన రైతులు లక్షలాది ఎకరములను సాగులోకి తీసుకుని రాగలిగారని అన్నారు. బ్యాంకు అభివృద్ధికి శ్రీ అశ్వర్థనారాయణమూర్తి చౌదరి కృషిని ప్రశంసించారు.

శ్రీ రజ్వీ మాట్లాడుతూ యీ భూమి తనఖా బ్యాంకులు రైతులకు ఎక్కువ అప్పులు యిచ్చి, ఎక్కువ సౌకర్యాలు కల్పించుటకు ఆలోచిస్తున్నవని, యీ సంవత్సరం యీ గుడ్లవల్లేరు భూమితనఖా బ్యాంకు రైతులకు 100 లక్షల మేరకు అప్పులిచ్చి, తన వ్యాపారం పెంపొందించుకొనగలదని ఆశాభావం వ్యక్తపరిచారు. ప్రపంచ బ్యాంకు ఆంధ్రప్రదేశ్‌లోని సహకార భూమితనఖా బ్యాంకుల ద్వారా రైతులకు 1500 పెర్గూసన్, ఇంటర్‌నేషనల్ ట్రాక్టర్లు అప్పు పద్ధతిమీద సప్లయి చేయుటకు అంగీకరించినదని, ఈ ట్రాక్టర్లలో కొన్ని జూన్ లోపల వస్తాయని తెలియజేశారు. డిశంబరు 70 లోపల ట్రాక్టర్ల కోసరం దరఖాస్తులు పెట్టినవారికి సప్లయి చేయగలమని కూడా అన్నారు. ఇంతవరకు కేంద్ర భూమితనఖా బ్యాంకువారు ట్రాక్టరు కొనుగోలుకు రైతుకు 25 వేలు అప్పు ఇస్తోందనీ, దానిని ఇప్పుడు 40 వేలుకు పెంచామని, అలాగే బావులు త్రవ్వకానికి, పంపు సెట్లకు, పాటిమన్నుకు రైతుకు 15 వేల రూపాయల నుండి 25 వేల రూపాయలకు అప్పు పెంచామని వెల్లడించారు. మూడు వేల రూపాయల మించిన అప్పు దరఖాస్తులు మంజూరుకు కేంద్ర బ్యాంకుకు పంపవలసి ఉన్నదని, అలా కాక 10 వేల రూపాయలు వరకు అప్పులు మంజూరుకు ప్రాథమిక సహకార భూమి తనఖా బ్యాంకులకు అనుమతి ఇచ్చామని అన్నారు.

గత ముప్పది సంవత్సరాలుగా అధ్యక్షులుగా పనిచేసి పదవీవిరమణ చేసిన శ్రీ ఎ.

మిగతా 1వ కాలంలో,

ముఖ్యమంత్రికి తగువిధంగా వ్యవహరించే అధికారం

తెలంగాణా సమస్యపై కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం తీర్మానం: ఎన్నికల సర్దుబాట్లపై పి.సి.సి. అధ్యక్షునికి ముఖ్యమంత్రికి బాధ్యత

(ఆంధ్రపత్రిక ప్రతినిధి) హైదరాబాద్, జనవరి 4

గాంధీభవన్‌లో ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ పి. నరసారెడ్డి అధ్యక్షతను జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి తెలంగాణా సమస్య పరిష్కారానికి సుహృద్భావ వాతావరణం ఏర్పాటుకు చేస్తున్న కృషిని బలపరుస్తూ ఈ విషయంలో ముఖ్యమంత్రికి తగువిధంగా వ్యవహరించడానికి అధికారమిస్తూ తీర్మానించారు.

మధ్యంతర ఎన్నికల సందర్భంగా వామపక్షరాజకీయ పక్షాలతో ఒప్పందాలు చేసుకునేందుకు ముఖ్యమంత్రి శ్రీ కాసుబ్రహ్మానందరెడ్డికి, పి. సి. సి. అధ్యక్షులు శ్రీ నరసారెడ్డికి అధికారమిస్తూ మరో తీర్మానం చేశారు.

నాథ్‌పాయ్‌కి స్వస్థత

బొంబాయి, జనవరి 4: కార్వాడిలో పి. ఎస్. పి. జాతీయ మహాసభ సమయంలో అస్వస్థతకు గురి అయిన పి. ఎస్. పి. నాయకుడు శ్రీ నాథ్‌పాయ్ ఇప్పుడు బాగానే ఉన్నారని విశ్రాంతి తీసుకుంటున్నారని వైద్యులు చెప్పారు.

రాష్ట్ర స్వతంత్రపార్టీ నిధి సేకరణ

రు. 10 లక్షలు వసూలు చేయాలని కార్యకర్తలకు లచ్చన్న విజ్ఞప్తి

విజయవాడ, జనవరి 4: ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికలలో స్వతంత్రపార్టీ పోటీ చేసేందుకు కనీసం 10 లక్షల రూపాయలు ఎన్నికల నిధిని సేకరించవలసిందిగా ఆంధ్రప్రదేశ్ స్వతంత్రపార్టీ అధ్యక్షులు శ్రీ గౌతు లచ్చన్న యిక్కడ పార్టీ కార్యకర్తలను ఉద్బోధించారు.

రాష్ట్రంలో పార్టీని పటిష్టం చేయాలని పార్టీ అభ్యర్థులకు విజయం చేకూర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పార్టీ అభ్యర్థుల జాబితా జనవరి 10కి సిద్ధం కాగలదని, దాన్ని జనవరి 12, 13 తేదీలలో మద్రాసులో జరిగే కేంద్ర పార్లమెంటరీ బోర్డు సమావేశం ఇతర దక్షిణాది రాష్ట్రాల పార్టీ అభ్యర్థులతోపాటు పరిశీలించి జనవరి 14న కేంద్ర నాయకత్వం మద్రాసు నుండి అభ్యర్థుల పేర్లను ప్రకటించగలదని ఆశించారు.

ఈ సమావేశానికి శ్రీయుతులు సిమ్మా జగన్నాథం ఎం. ఎల్. ఏ., జి.బి. అప్పారావు ఎం. ఎల్. ఏ., హెచ్. ఆర్. శాయోజీరావు, ఎం.వెంకటస్వామినాయుడు, జె.చంద్రమౌళి ఎం. పి., కె. రోశయ్య ఎం. ఎల్. సి., కె. బుచ్చయ్య ఎం. ఎల్. ఏ., ఎస్.సి.హెచ్. నాగయ్య ఎం. ఎల్. ఏ., కొత్తూరు వెంకటేశ్వర్లు, చమవులేటి కోటేశ్వరరావు, వాగినేని వెంకయ్య, డి. కొండయ్యచౌదరి ఎం. ఎల్.సి., పి. రామచంద్రారెడ్డి ఎం. ఎల్. ఏ., డి. నరసింహం ఎం. ఎల్. ఏ., పి. రాజగోపాలనాయుడు ఎం. ఎల్. సి., పరకాల వెంకటేశ్వరరావు, వి. నరసింహారావు (రద్దయిన లోక్‌సభ సభ్యులు), ఎన్. వీరాచారి, సుంకర సత్యనారాయణ, మొదలైన ప్రముఖులు హాజరయినారు.

ఆంధ్రప్రదేశ్‌స్వతంత్రపార్టీ కార్యవర్గ సమావేశంనిన్నమధ్యాహ్నంఇక్కడపార్టీకార్యాలయంలో 4 గంటలకు సమావేశమైంది. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు శ్రీ గౌతు లచ్చన్న అధ్యక్షత వహించారు. ఢిల్లీ సంప్రదింపులలో నిమగ్నులైన శ్రీ ఆచార్యరంగా నిన్నటి సమావేశానికి హాజరుకాలేదు. నేటి ఉదయం ఢిల్లీనుండి ఆయన ఇక్కడకు వస్తున్నారు. నేడు జరిగే సమావేశంలో ఆయన పాల్గొంటారు. స్వతంత్రపార్టీకి ప్రస్తుతం మూడు స్థానాలు మాత్రమే ఉన్నాయి.

ఈ పర్యాయం 17 సీట్లకు పోటీ చేయడానికి ఇదివరలో నిర్ణయించుకున్నారు. ఆచార్య రంగా శ్రీకాకుళం స్థానానికి పోటీ చేస్తారని ఎక్కువగా చెప్పబడుతున్నది. కాని ఒంగోలు స్థానానికి పోటీ చేయవచ్చు అని కూడా వినిపిస్తూంది. శ్రీ శాయోజీరావు గుడివాడ స్థానానికని నమ్మకంగా తెలుస్తోంది. మాజీ లోక్ సభసభ్యులు శ్రీ ఎం. వెంకటస్వామినాయుడు బందరు స్థానానికి పోటీ చేస్తారు.

---

30 సంవత్సరముల ఆస్త్మా వ్యాధి

ఆరు మాసములలో పూర్తిగా బాగైనది

డాక్టర్ శ్రీ గంధే రఘురామగుప్త గారికి

మార్కాపురము, ఒంగోలు జిల్లా.

ఆర్యా, నమస్కారములు. నేను 30 సంవత్సరములుగా ఆస్త్మా వ్యాధిచే నరకయాతనలను అనుభవించుచుంటిని. ఆయాసము, పిల్లికూతలు, దగ్గు, అజీర్ణము, మలబద్ధకములతో ఊపిరి ఆడకుండెడిది. ఈ బాధ నాకు విరామము లేకుండా సంవత్సరం పొడుగునా ఉండేది. ఎంతో పైకము వెచ్చించి ఎన్ని మందులు సేవించినను కొన్ని గంటలు మాత్రమే బాధలు కొద్దిగా తగ్గేవి. మీరిచ్చిన మందు ఆరు మాసములు సేవించితిని. ఒక సంవత్సరమునుండి నాకు ఎలాంటి బాధలు లేవు. వ్యాధి పూర్తిగా నెమ్మదించినది మీ వైద్య ప్రతిభకు జోహారులు అర్పించుచున్నాను.

వెలివెన్ను, తణుకు తాలూకా, ప. గోదావరి జిల్లా, 27—3—1970

ఇట్లు, (సం.) కొ ఎవల్ల వెంకయ్య, ఉపాధ్యాయుడు.



కేవలం 5 పైసలతో మీ కుటుంబాన్ని పరిమితం చేసుకునే శక్తిని మీరు పొందవచ్చు!

నిరోధ్ వాడండి

కుటుంబ నియంత్రణకొసం. మేలిరకం రబ్బరు తొడుగు 15 పైసలకు 3

ప్రభుత్వ సబ్సిడీ ద్వారా తక్కువ ధర

కాన్పుకీ కాన్పుకీ మధ్య తగినంత ఎడం వుండేటట్టు చేసేందుకు

యిప్పుడు. బిడ్డలు యాదృచ్ఛికంగా కాక కోరుకున్నప్పుడు మాత్రమే పుట్టేటట్టు చేసుకోవచ్చు. మీరు కోరుకున్నప్పుడు మాత్రమే మీకు బిడ్డ పుట్టేటట్టు చేసుకునే శక్తిని మీకు నిరోధ్ యిస్తుంది.

మాతా శిశువుల ఆరోగ్యం కోసం

బిడ్డ సక్రమంగా పెరగాలంటే బిడ్డను మొదటి మూడు, నాలుగు సంవత్సరాల్లోనూ ప్రత్యేక జాగ్రత్తతో పెంచాలని డాక్టర్లు చెబుతున్నారు. అంతేకాక, శిశువు ప్రసవించిన తర్వాత తల్లి చక్కగా కోలుకుని తిరిగి ఆరోగ్యం పొందేందుకు కొంతకాలం పడుతుంది. నిరోధ్‌ను ఉపయోగించటం ద్వారా మీరు సులభంగా మీ తర్వాత బిడ్డ పుట్టటాన్ని వాయిదా వేసుకోవచ్చు.

నిరోధ్ (కండోమ్) అన్నది సంతాన నిరోధం కోసం పురుషులు ఉపయోగించేందుకు మేలు రకం రబ్బరుతో తయారు చేసిన ఒక సాధనం. ఈ రబ్బరు తొడుగును ఉపయోగించటం చాల సులభం. సురక్షితం కూడా. ఉపయోగించే వారి ఆరోగ్యానికి దానివల్ల ఏవిధంగానూ ప్రమాదం వుండదు. అందుచేతనే నిరోధ్‌ను ప్రపంచమంతటా ఉపయోగిస్తున్నారు. నిరోధ్ అన్ని చోట్లా లభిస్తుంది.

కిరాణాదుకాణాలు, షాపులు, పాంచులపాపులు, జనరల్ మర్చెంట్లు, కిళ్లీ కొట్లు మొదలైన చోట్లన్నింటిలోనూ నిరోధ్‌ను విక్రయిస్తారు.

davp 70/14

గంటల పంచాంగం

శ్రీ సాధారణనామ సం. పుష్య శుద్ధ నవమి

1971 సం. జనవరి 5 మంగళవారం. మంగళ నవమి: రా 8.03 అశ్విని రా. 3.23, వర్జ్యం: రా 11.30 మొదలు 1.03 వరకు.

1971 సం. జనవరి 6 బుధవారం బుధ దశమి: సా 6.53, భరణి: రా 3.57, వర్జ్యం: ప.12.48 మొదలు 2.22 వరకు.

ఆంధ్రపత్రిక

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబునకగు [illegible] రులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్ (మహాభారతము)

శ్రీసాధారణనామ సం. పుష్య శుద్ధ నవమి. మంగళవారం

ఎట్టకేలకు

లోక్‌సభ మధ్యంతర ఎన్నికలకు ఎన్నికల సర్దుబాట్ల విషయంలో జాతీయ ప్రజాస్వామ్య పక్షాల చర్చలు, మంతనాలు ఒక రూపానికి వచ్చి, మూడు పార్టీలు — కాంగ్రెసు, జనసంఘం, సంయుక్త సోషలిస్టు పార్టీ — కలిసి ఒక సంఘటనగా ఏర్పడ్డాయి. అందుకు సంబంధించిన ప్రకటన గూడా జరిగింది. అయితే స్వతంత్ర పార్టీ ప్రస్తుతం ఈ ఏర్పాటులో చేరలేదు. భారతీయ క్రాంతి దళ్ సంగతి ఇంకా తేలలేదు కాని ఈ రెండు పార్టీలు గూడా ఈ సంఘటనలో చేరగలవనే ఆశించ వలసి ఉంది.

అయితే ఇక్కడ స్వతంత్ర పార్టీకి, తక్కిన పార్టీలకు పెద్ద తేడా ఏమీ లేదు. ఇప్పుడీ సంఘటనకు ఒక కనీస కార్యక్రమం ఉండాలని స్వతంత్ర పార్టీ అధ్యక్షుడు శ్రీ మసానీ భావిస్తున్నట్లు తోస్తుంది. ఎన్నికలకు సంబంధించిన సర్దుబాట్ల అనంతరం ఆ కార్యక్రమాన్ని గురించిన మంతనాలు జరగవచ్చునని శ్రీ నిజలింగప్ప అంటున్నారు. ఇప్పుడు ఎన్నికల సర్దుబాట్లకు అంగీకరించి, సంఘటనగా ఏర్పడిన పార్టీలు గూడా ఈ ఆలోచనతో ఏకీభవిస్తున్నట్లే భావించవలసి ఉంది. కొన్ని రాజకీయ పక్షాలు కలసి, ఒకానొక లక్ష్యంతో కొన్ని ఏర్పాట్లు చేసుకోబోతున్నప్పుడు, ఇటువంటి చిక్కులు సహజంగా తల ఎత్తుతాయి అయినా కార్యసాధకులైనవారు ఒర్పుతో, పట్టుదలతో ఇటువంటి అన్ని విషయాలను సర్దుకుపోతూ, అసలు లక్ష్యాన్ని దృష్టినుంచి జారిపోనీయరు శ్రీ నిజలింగప్ప ఇటీవల ఇటువంటి పద్ధతినే ప్రవచిస్తున్నారు. అది కార్యకార పద్ధతి.

దేశం ఎదుర్కొంటున్న, ఎదుర్కొనబోతున్న సమస్యలు భయంకరమైనవిగా కనిపిస్తున్నాయి. ప్రజాస్వామ్య పద్ధతికీ, రాజ్యాంగ ధర్మ పద్ధతికీ ప్రమాదం వాటిల్లగల పరిస్థితి గోచరిస్తున్నది. ఈ పరిస్థితులలో చిల్లర విషయాలను గురించి పట్టుదలతో పనులు జరగవు అప్పుడు లక్ష్యశుద్ధి తప్పిపోతుంది. కనుక, భారతీయ క్రాంతిదళ్ వారు, స్వతంత్రపార్టీ వారు గూడా తమ తమ అభిప్రాయాలను చిక్క దిద్దుకొని, ఇప్పుడు ఏర్పడిన ఈ సంఘటను [illegible] కృషి చేయగలరనే ఆశించవలసి ఉంది.

ఇప్పుడు ఈ సంఘటన ఏర్పాటుతో కొన్ని కొన్ని రాజకీయ పక్షాలు కట్టుబడి కలవడం, చెప్పడం, ఆలోచించడం సహజం కలిగినట్లే చెప్పవచ్చు. ఇటువంటి సంఘటన ఏర్పడటమే కష్టమని, ఈ సంఘటనలో చేరడానికి వచ్చే పార్టీల మధ్య కలతలతో అసలు ఇది సాధ్యం కాకపోవచ్చునని గూడా కొందరు అనుకొంటూ వచ్చినట్లు తోస్తుంది. కాని ఇప్పుడు ఆ సంఘటన అంటూ ఒకటి ఏర్పడింది. యు. పి. లో, బీహారులో ఎస్. వి. డి. లు ఏర్పడిన తరువాత ఊహాగానాలు కొందరూ గూడా ప్రజాస్వామ్య పక్ష సంఘటనను గూర్చి [illegible]. అయితే జాతీయ స్థాయిలో అటువంటిది ఏర్పాటు కావడంలో కష్టాలు, చిక్కులు వంటివి తటస్థ పడినా, ఏ స్థితిలో ఎట్టిదైనా ఆ సంఘటన ఏదో ఒక రూపంలో ఏర్పడక తప్పని స్థితి ఆసన్నమై ఉండనే ఉంది. ఇప్పుడు సరిగ్గా అదే జరిగింది.

అయితే ఇట్లు పలకగానే వాడిగ కదిలినట్లు, ఈ ప్రజాస్వామ్య సంఘటన ఏర్పడగానే అన్ని పనులు అయినట్లు కాదు. ఇది పృథక్ స్థితిలో ఉన్న కొన్ని శక్తులు సన్నిహితం కావడం వంటిది. అప్పుడు వచ్చే కష్టాలు అప్పుడు వస్తాయి. అందువల్లనే ఇచ్చట సమన్వయ దృష్టి లక్ష్యశుద్ధి ప్రధానంగా అవసరం. అదీగాక ముందు ఎన్నికలకు సన్నిహితం కావడమే కష్టం గాని, ఆ తరువాత అన్నీ ఆ సంఘటితమైన స్థితికి అనుకూలంగా అన్వయం ధోరణిలో కొనసాగిపోతాయి. అందుకే ఇప్పుడు ఈ సంఘటన ఏర్పడటం అన్నది ప్రధానమైన విషయం.

—:o:—

తమిళనాడు ముస్లింలీగ్ ఎన్నికల సర్దుబాట్లు

మద్రాసు, జనవరి 4: రానున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఒకే లక్ష్యాలు కల పార్టీలతో సంప్రదింపులు జరిపి, ఎన్నికల సర్దుబాట్లు కుదుర్చుకొవడానికి ఏడుగురు సభ్యులతో పార్లమెంటరీ బోర్డును తమిళనాడు ముస్లింలీగ్ విన్న ఏర్పాటు చేసింది.

మధ్యంతర ఎన్నికలలో పార్టీ వ్యూహాన్ని గురించి చర్చించేందుకు ముస్లింలీగ్ విన్న ఇక్కడ సమావేశమయింది.

జిల్లా సంఘాలతో సంప్రదించి ఆయా నియోజక వర్గాలలో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను రూపొందించవలసిందిగా ఈ బోర్డును కోరడం జరిగింది. ఈ సమావేశానికి 100 మంది జిల్లా నాయకులు, ప్రత్యేక ఆహ్వానితులు హాజరైనారు.

ఈ సమావేశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయినట్లు తెలుస్తోంది. కొందరు సభ్యులు కొత్త కాంగ్రెస తో అవగాహన కుదుర్చుకోవాలని సూచించగా, మరికొందరు సంస్థా కాంగ్రెస్‌తో పొత్తును కోరారు.

—o:o—

కోయిలకుంట్ల తాలూకాలో కాల్పులవల్ల ఒకని మృతి

కర్నూలు, జనవరి 4: కోయిలకుంట్ల తాలూకా సంజామల్లలో పొలానికి కాపలా కాస్తుండగా గొండ్ల పెద్దపుల్లయ్య కొందరు కాల్పులు జరుపగా అతడు మరణించాడు. ఫర్మాణకు పంచాయితీ ఎన్నికలు కారణమని పేర్కొనబడుతున్నది. అదనపు పోలీసు సూపరింటెండెంట్ హుటాహుటిని అక్కడకు దర్యాప్తు కోసం వెళ్లారు. (స్వ. వి.)

—:o:—

భువనేశ్వర్ నుండి దవపల్లారాజా పోటీ

విశాఖపట్నం, జనవరి 4: భువనేశ్వర్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి దవపల్లా రాజా శ్రీ పి. సి. భంజదేవ్ ఉత్కళ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తారని ప్రకటిస్తున్నారు. (స్వ. వి.)

రాజకీయ వ్యాఖ్యానం:

లోక్‌సభ రద్దు. తర్వాత....

శ్రీ నిహాల్ సింగ్

మధ్యంతర ఎన్నికలు జరపాలన్న నిర్ణయం శ్రీమతి ఇందిరాగాంధిదే. ఇలాజరుగుతుందని అంతా అనుకుంటున్నదే. ఆమె కాశ్మీర్ వెళ్ళడానికి ముందు యీ నిర్ణయం చేసికొన్నారు. కాని దీనిని అతిరహస్యంగా ఉంచారు. ఆమె సహచరులు నలుగురికి, ప్రధాని సచివాలయంలోని కొద్ది మందికి తప్ప, కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం జరిగే నాటి వరకు ఎవరికీ యీ విషయం తెలియదు. ఈ విషయం శ్రీ జగ్‌జీవన్ రాం, శ్రీ చవాన్, శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ లకు ముందు తెలుసు, ఒకదశ తర్వాత గాని శ్రీ స్వరణ్‌సింగ్‌కు తెలియలేదు.

ఈ నిర్ణయం తీసుకున్న తర్వాత, దీనిని ఎంతో జాగ్రత్తగా, చాకచక్యంగా బహిరంగం చేశారు. కార్యవర్గం యీ ప్రతిపాదనను ఆమోదించడానికి ముందు కొంత కథ జరిగింది. 27వ తేదీ ఆదివారంనాడు పార్లమెంటరీబోర్డు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ రోజుసాయంకాలమే మంత్రివర్గ అత్యవసర సమావేశం కూడా జరిగింది. ఈ సమావేశంలో ఒక్క శ్రీ బి. ఆర్. భగత్ మాత్రం తొందరగా ఎన్నికలు జరుపరాదని వాదించారు. పార్లమెంటు రద్దు వార్తను ఆకాశవాణి రాత్రి 9 గంటల వార్తలలో ప్రసారం చేసింది, ఆ వెంటనే ప్రధానమంత్రి రేడియో ప్రసంగం చేశారు.

పార్లమెంటును రద్దు చేయడం వాంఛనీయమా, కాదా అనే విషయమై అనేక నెలలుగా వాదప్రతివాదనలు జరుగుతున్నప్పటికీ, పార్లమెంటు రద్దు జరిగిందన్న వార్త కొంత ఆశ్చర్యాన్ని కలుగ చేసింది. ఈ విధంగా శ్రీమతి గాంధి తొలి విజయాన్ని సాధించారు. పార్లమెంటును రద్దు చేయాలని రాష్ట్రపతికి సిఫార్సు చేసే అధికారం మైనారిటీ ప్రభుత్వానికి లేదన్న ప్రతిపక్ష నాయకుల వ్యూహం తప్పు. శ్రీమతి గాంధి ఒక నిర్ణయానికి వచ్చారని కార్యవర్గ సమావేశంవల్ల వారికి స్పష్టమై ఉండవలసింది. తమతప్పును చాలా మంది ప్రతిపక్ష నాయకులు గుర్తించి, వెంటనే ఎన్నికల పట్ల హర్షం వ్యక్తం చేశారు.

అయితే, శ్రీమతిగాంధి నిర్ణయంవల్ల ఆమె పార్టీలో కూడా దెబ్బతిన్న వారు లేకపోలేదు. తమను సంప్రదించలేదని శ్రీ బ్రహ్మానంద రెడ్డికి ఆగ్రహం వచ్చింది. రాష్ట్ర శాసన సభకు కూడా లోక్‌సభతో పాటు ఎన్నికలు జరపాలని ఆయన భావించారు. ఆయన మనస్సులో తెలంగాణా సమస్య కూడా నాటుకుని ఉంది. మధ్యంతర ఎన్నికలకు సంబంధించి శ్రీ చవాన్ ఉత్సాహంతో శ్రీ వి. పి. నాయక్ కూడా పాలుపంచుకోలేక పోయారు. ఆయన కూడా అసెంబ్లీ ఎన్నికలు జరగాలనే కోరారు. హిందీ రాష్ట్రాలలో కొత్తకాంగ్రెస్ పరిస్థితి దృష్ట్యా మార్చిలో ఎన్నికలను శ్రీ డి.పి.మిశ్రా వ్యతిరేకించారు. ఆయన 27వ తేదీనాటి పార్లమెంటరీబోర్డు సమావేశానికి కావాలని హాజరుకాలేదు.

శ్రీమతిగాంధి ప్రభుత్వం కొనసాగడానికి సహాయపడిన రెండు పార్టీలుకూడా ఆమె నిర్ణయాన్ని హర్షించలేదు. మధ్యంతర ఎన్నికలు జరుపరాదని ప్రధానమంత్రికి తామిదివరలో సలహా ఇచ్చినట్లు ఢిల్లీలో డి. ఎం. కె. ప్రతినిధులు వెల్లడించారు. ఈ పార్టీ ఇంకా తన భాషా విధానాన్ని రూపొందించుకోవలసివుంది. అంతేగాక తమిళనాడులో పెరుగుతున్న శ్రీ కామరాజు ప్రతిష్ఠను దెబ్బతీయడానికి మరి కొంత కృషి చేయవలసి ఉంది. మితవాద కమ్యూనిస్టు పార్టీకి ఆపార్టీలోనే అనేక సమస్యలు ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో తన పరిస్థితి పై నమ్మకం లేదు. అందుచేత శీఘ్ర ఎన్నికలు జరుగకపోవడమే ఆ పార్టీకి మంచిది.

లోక్‌సభలో తన పదవీ కాలాన్ని ఒక ఏడాది తగ్గించినందుకు శ్రీమతి గాంధి పార్టీ సభ్యులు చాలా మంది పార్టీ నాయకులపై కోపం తెచ్చుకున్నారు.

ఎన్నికలలో పాల్గొనడానికి తగిన ధనాన్ని, వాహనాలను సంపాదించడం వారికి ప్రధానమైన సమస్యగా ఉంది. ఎన్నికలు జరిగే వ్యవధి చాలా తక్కువగా ఉన్నందున, సామాన్య సభ్యులు చాలామంది ధనం కోసం కేంద్ర నాయకుల తలపై ఆధారపడక తప్పదు. ఎందుచేతనంటే తాము సొంతంగా వనరులను సమకూర్చుకొనడానికి తగిన వ్యవధి ఉండదు.

ప్రతి ఎన్నికను కూడా జూదం అని చెప్పవచ్చు. అయితే మధ్యంతరఎన్నికలు దాని అసాధారణ స్వభావాన్నిబట్టి— పెద్ద జూదం. కాంగ్రెస్ అభ్యర్థుల ఎన్నికకు ఐదేళ్లకొకసారి ఢిల్లీలో జరిగే దర్బార్లు ఇప్పుడు ఉండవు. కాంగ్రెస్ పార్టీ చీలికవల్ల అధికార కాంగ్రెస్‌లోని పార్లమెంటు సభ్యులకు తిరిగి అవకాశం ఇవ్వవలసి ఉంటుంది. కాని రద్దు అయిన లోక్‌సభలో అధికార కాంగ్రెస్‌బలాన్ని బట్టి చూస్తే శ్రీమతి గాంధి అభ్యర్థులుగా ఎన్నికలలో పోటీ చేసేవారిలో 60 శాతం మంది కొత్త వారు ఉంటారు.

మధ్యంతర ఎన్నికలలో ఏ సమస్యలపై పోటీ జరిగేది అందరికీ తెలుసు. గత ఏడాది పైగా ఉభయ పక్షాలవారు వాద ప్రతివాదనలు చేసికొంటున్న సమస్యలే అవి. సోషలిజం, అభ్యుదయం, వ్యక్తులపై శ్రీమతి గాంధి పోటీ చేస్తారు. సోషలిజం, అభ్యుదయం, ప్రజాస్వామ్యాలపై ప్రతిపక్ష కాంగ్రెస్ పోటీ చేస్తుంది. ఉభయ కాంగ్రెస్ పక్షాలు స్థానిక, ప్రాంతీయ స్థాయిలలో బేరాలు కుదుర్చుకోక తప్పదు.

అసలు సమస్యలకన్నా, ఆ సమస్యలపై నొక్కి చెప్పడమే ప్రధానం. శ్రీమతి గాంధి తన సోషలిజం, అతివాద దృక్పథాలతో మధ్యే వాదిగా తన పలుకుబడిని వ్యాప్తి చేసుకొన్నట్లు కనిపిస్తోంది. పత్రికా ప్రతినిధుల సమావేశం పేరుతో ఆమె చేసిన ప్రథమ ఎన్నికల ప్రసంగాన్ని పరిశీలిస్తే, తాము కమ్యూనిస్టులు కాదని, ప్రస్తుతం ఉన్న సామాజిక, ఆర్థిక అశాంతి కారణంగానే తమ అభ్యుదయ వాదాన్ని మధ్యేమార్గ విధానంగా రూపొందించామని ప్రజలకు నచ్చచెప్పాలని ప్రయత్నించినట్లు స్పష్టమవుతుంది.

ఉద్యోగరంగంలో ఆకస్మిక చర్యలు తీసికొనడాన్ని శ్రీమతి గాంధి పార్టీ త్యజించినట్లు తోస్తుంది. సత్వర ఫలితాలనిచ్చే ఏ పథకమైనా మహాసముద్రంలో నీటి బొట్టు మాత్రమే. వస్తువులను అధికంగా మార్కెట్‌లో ప్రవేశ పెట్టడం ద్వారా ధరలను అదుపులో పెట్టాలని శ్రీమతి గాంధి భావన. అందుచేత స్కూటర్ల ఉత్పత్తికి హెచ్చు లైసెన్సులు ఇవ్వాలని మంత్రివర్గ సమష్టియ సంఘం నిశ్చయించింది.

అధికార కాంగ్రెస్ చేసికొనే ఎన్నిక పొత్తు స్పష్టంగా తెలుస్తూనే ఉన్నాయి. పార్టీలోని విమర్శకులను ఊరడించడానికి మితవాద కమ్యూనిస్టు, పి. ఎస్. పి. లతో రాష్ట్ర స్థాయిలో యీ పార్టీ ఎన్నికల పొత్తులు చేసికొంటుంది. మితవాద కమ్యూనిస్టు పార్టీ నావు మాత్రంగా ఉన్న చోట గాని, యీ పార్టీ అంటే ఇష్టపడని రాష్ట్రాలలోగాని యీ పార్టీతో అధికార కాంగ్రెస్‌కు పొత్తు ఉండదు. అదే విధంగా మహారాష్ట్రలో పి. ఎస్. పి. తో సంబంధం పెట్టుకొనక పోవడంలో శ్రీ చవాన్‌కు స్వేచ్ఛ ఉంది. డి. ఎం. కె.వంటి ప్రాంతీయ పార్టీతో సర్దుబాట్లు వల్ల అసలు సమస్యలే ఉత్పన్నం కావు. అయితే అకాలీలు మాత్రం గట్టిగా వ్యవహరించవచ్చు.

ప్రతిపక్షాల కన్నా శ్రీమతి గాంధి పార్టీకి నిధులు చిక్కు సమస్య కాదు. నిధుల సేకరణపై తన ఆర్థిక మంత్రుల సలహా పొందేందుకు ఇటీవల ప్రధాని వారిని కలిసికొన్నారు. మొదట రు. 5 కోట్ల నిధి సేకరణను లక్ష్యంగా పెట్టుకున్నారు. శ్రీమతి గాంధికి తన కాంగ్రెస్‌కు కొత్త రూపం కల్పించడంలో ఆమె మైనారిటీ ప్రభుత్వ స్వభావం ఎంతో సహాయపడుతోంది. రాజ్యసభలో ప్రస్తుత పార్టీ పరిస్థితి దృష్ట్యా ఆ సభ సభ్యులను లోక్‌సభకు పోటీ చేయడానికి అనుమతించకపోవచ్చు. అధికార కాంగ్రెస్ రాజ్య సభలో తన బలాన్ని మరింత తగ్గించుకోవాలనిచూడదు.

సంస్థా కాంగ్రెస్‌కు కొన్ని సొంత సమస్యలు ఉన్నాయి. ఒక నియోజకవర్గం, ఒక అభ్యర్థి ప్రాతిపదికపై మిగతా రెండు —జనసంఘం, స్వతంత్ర— పార్టీలతో ఒప్పందం ఆధారపడి ఉంది.

ఉదాహరణకు గుజరాత్ సమస్య కావచ్చు. ఇక్కడ ఒక అంగీకారానికి రావడం కష్టం.

మధ్యంతర ఎన్నికల వైపు శ్రీమతి ఇందిరాగాంధి మొగ్గడానికి —కారణం ఈ పార్టీ ప్రస్తుత పరిస్థితి ఒక ఏడాది ముందుగానే అధ్వాన్నం కాగలదన్న భావనయేనని తోస్తుంది. ఎన్నికల ముందు ప్రతి అధికారపార్టీ మాదిరిగానే అధికార కాంగ్రెస్ కూడా ఎన్నికలలో తమకు పూర్తి మెజారిటీ లభించగలదని వాదిస్తున్నప్పటికీ, పార్టీలో యదార్థపరిస్థితిపై అంచనాలు వేశారు. శ్రీమతి గాంధికి ఎంత వచ్చినా 260 స్థానాలు మించి రావని అంచనా. ఈ 260 స్థానాలను గెలువవచ్చునని పార్టీలోని ప్రముఖులు కొందరు భావిస్తున్నారు. అయితే రద్దయిన లోక్‌సభలో ఉన్నన్ని స్థానాలు మాత్రం రావచ్చునని మిగతావారు భావిస్తున్నారు. ముస్లిం వోట్లలో 15 శాతం తమకు రాగలవని వీరు అంచనా వేస్తున్నారు. రద్దు అయిన లోక్‌సభలో అధికార కాంగ్రెస్‌కు 219 స్థానాలు ఉన్నాయి. ఈ పార్టీ వర్గాలలో సర్క్యులేట్ కాబడిన ఒక జాబితా ప్రకారం మధ్యంతర ఎన్నికలలో వివిధ రాష్ట్రాలలో ఈ పార్టీకి ఈ క్రింది విధంగా స్థానాలు రాగలవని పేర్కొన్నారు. ఆంధ్ర 25, అస్సాం 10, బీహార్ 26, గుజరాత్ 5, హర్యానా 7, కాశ్మీర్ 6, కేరళ 5, మధ్యప్రదేశ్ 12, తమిళనాడు 5, మహారాష్ట్ర 30 మైసూరు 8, నాగాలాండ్ 1, ఒరిస్సా 5, పంజాబ్ 5, రాజస్థాన్ 2, యు. పి. 43, పశ్చిమబెంగాల్ 6, ఢిల్లీ 2, హిమాచలప్రదేశ్ 4, మిగతా ప్రాంతాలు 6.

అధికార కాంగ్రెస్ అవధికార జాబితా ప్రకారం సంస్థా కాంగ్రెస్‌కు లోక్‌సభలో యీ క్రింది విధంగా 78 స్థానాలు రావచ్చునని పేర్కొన్నారు. ఆంధ్ర 4, బీహార్ 10, గుజరాత్ 16, మధ్యప్రదేశ్ 2, తమిళనాడు 10, మహారాష్ట్ర 4, మైసూరు 12, ఒరిస్సా 2, పంజాబ్ 1, రాజస్థాన్ 1, యు.పి. 15, మిగతా ప్రాంతాలు 2. ఈ అంచనాలు ప్రస్తుతానికి యదార్థంగానే కనిపిస్తున్నాయి. ఈ అంచనా తారుమారయితే తప్ప— ప్రస్తుత పరిస్థితిని బట్టి—శ్రీమతి గాంధి మిశ్రమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమో, ఎన్నికల తర్వాత ఉభయ కాంగ్రెస్ పార్టీల విలీనీకరణకు ప్రయత్నం చేయడమో జరగవలసివుంది.

అయితే ఉభయ కాంగ్రెస్ పార్టీలకు సమిష్టిగా సంబంధించే విషయం ఒకటిఉంది. హిందీయేతర రాష్ట్రాలలో యీ పార్టీల అభ్యర్థులు గెలవడం పై వాటి బలం ఆధారపడిఉంది. అంటే యీ పార్టీల అధికార బలం హిందీయేతర రాష్ట్రాల వైపు మొగ్గింది. కాంగ్రెస్ పార్టీకి, దేశానికి సంబంధించిన విషయాలలో యింతవరకు హిందీ భాషా రాష్ట్రాలకు గల పెత్తనం మధ్యంతర ఎన్నికలతో అంతం అవుతుందని చెప్పవచ్చు. అధికార కాంగ్రెస్‌లోని ఆశావాదులు సైతం యు. పి., బీహార్‌లు రెంటిలోను కలిపి ఉన్న 138 స్థానాలలోను తమకు సగం రావచ్చునని భావిస్తున్నారు. అయితే శ్రీమతి గాంధి తన పార్టీ బలాన్ని దక్షిణాది రాష్ట్రాలలోను, గుజరాత్ లోను మాత్రం పెంచుకోవచ్చు.

అలాంటి పరిస్థితి రావచ్చునని శ్రీమతి గాంధి భావించక పోలేదు. కాని మధ్యంతర ఎన్నికల తర్వాత హిందీ భాషేతర రాష్ట్రాల వారి పలుకుబడి హెచ్చు అయినా అది తమకు ప్రమాదకారి కాదనీ, తమ వారసుడు హిందీ ప్రాంతం నుంచి వచ్చేవాడయితే ఆయనకు ప్రమాదకారి కావచ్చుననీ శ్రీమతి గాంధి భావిస్తున్నట్లు కనిపిస్తుంది. శ్రీ కామరాజు సాధిస్తున్న ఫలితాలు, శ్రీ సంజీవరెడ్డి చేస్తున్న కృషి, మైసూరులో ఆశిస్తున్న విజయాలు దృష్ట్యా దక్షిణాది రాష్ట్రాలలో తమకు బలం చేకూర వచ్చునని సంస్థా కాంగ్రెస్ భావిస్తోంది.

సింహళంలోను, పాకిస్తాన్‌లోను ఇటీవల జరిగిన ఎన్నికలను బట్టి చూస్తే, తమ నాయకునికి మంచి మెజారిటీ రాగలదని భావించే ఆశావాదులు కొందరు శ్రీమతి గాంధి పార్టీలో ఉన్నారు. అయితే యీ రెండు ఉదాహరణలు భారతదేశ పరిస్థితులకు విరుద్ధమైనవే కాని అసాధారణ రాజకీయ వాతావరణంలో జరిగే అసాధారణ ఎన్నికలు రాజకీయవేత్తలు ఊహించే వాటికన్నా హెచ్చు ఆశ్చర్యాలను కలుగ జేయవచ్చు.

భారత్‌తో సమస్యల పరిష్కారానికి కృషి

పాక్ నాయకుడు ముజిబుర్‌రెహమాన్ హామీ

భారత్ సహా తన పొరుగు దేశాలతో పాకిస్తాన్ శాంతియుత సహజీవనం నెరపగలదని అవామీలీగ్ నాయకుడు షేక్ ముజిబుర్ రహమాన్ ప్రకటించారు.

ఢాకా, జనవరి 4: నిన్న ఇక్కడ జరిగిన పెద్ద బహిరంగసభలో శ్రీ రెహమాన్ ప్రసంగిస్తూ పై విధంగా చెప్పారు. ఈయన పాకిస్తాన్‌కు ప్రధాన మంత్రి కానున్నారు.

గత నెలలో పాకిస్తాన్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అవామీలీగ్‌కు అత్యధిక మెజారిటీ సీట్లు లభించాయి. శ్రీ రెహమాన్ తన ప్రసంగంలో ఇంకా యిలా పేర్కొన్నారు:

"మా పొరుగు దేశాలతో శాంతియుతంగా కలసి మెలసి జీవించదలచాము. సహజీవనం, ప్రపంచ శాంతి మా వాంఛ. కాశ్మీర్, ఫరాకా బ్యారేజి వంటి సమస్యలను మేము పరిష్కరించుకోగలము.

"పాకిస్తాన్‌లో భూమి శిస్తును పదేళ్లలో పూర్తిగా రద్దు చేయదలచాము.

మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎనిమిది ఎకరాల వరకు శిస్తు రద్దు చేస్తుంది.

ఈ బహిరంగ సభకు దాదాపు పది లక్షల మంది ప్రజలు హాజరైనారు.

"అవామీలీగ్‌ను గనుక అధికారంలోకి రానివ్వకపోతే అంతిమ త్యాగం చేయడానికి ప్రజలు సిద్ధం కావాలి.

సంపన్న దేశాలు తమ ఆయుధాల ఉత్పత్తికి చేస్తున్న ఖర్చులో పదో వంతు డబ్బు ప్రపంచంలోని పేదల తిండి గింజలకు సరిపోతుంది. అందుచేత పేద దేశాలకు సంపన్న దేశాలు సహాయం చేయాలి.

"పాకిస్తాన్‌లో బెంగాలీలే అధిక సంఖ్యాకులు కాబట్టి కొత్త రాజ్యాంగాన్ని అవామీలీగ్ ప్రకటించిన ఆరు అంశాల కార్యక్రమం ఆధారంగా రూపొందించడం జరుగుతుంది.

బెంగాలీలకు పూర్తి విజయం అంటూ పత్రికలు పెద్ద పెట్టున వినాదాలు చేశారు.

(రక్షణ, విదేశ వ్యవహారాలు మినహాయించి మిగతా అన్ని అధికారాలు తూర్పు పాకిస్తాన్ శాసన సభకు వుంటాయి.)

"పాకిస్తాన్‌లో మత నాయకుల కార్యకలాపాలు గర్హనీయమైనవి. ఇస్లామ్ మతాన్ని ఆయుధంగా వినియోగించి ప్రజల జీవితాలతో చెలగాటమాడేందుకు మేము అనుమతించం. దుర్వ్యవహార చర్యలను గ్రామీణ ప్రజలు ధైర్యంగా ప్రతిఘటించాలి. దోపిడీలవల్ల, లూటీలవల్ల, ఒకరిద్దరు అమాయకులను చంపినందువల్ల విప్లవం రాదు. (నక్సలైట్లను దృష్టిలో పెట్టుకుని రెహమాన్ పై విధంగా చెప్పారు.)

జాతీయకరణ విధానం

"బ్యాంకులను, భీమావ్యాపారాన్ని జనపనార పరిశ్రమను జాతీయం చేస్తాము. తూర్పు పాకిస్తాన్‌లో ఇటీవల తుఫాను సంభవించి పది లక్షల మంది మరణించారు. ఇతర దేశాల నుంచి ఎంత మేరకు విరాళాలు వచ్చినదీ ఫెడరల్ ప్రభుత్వం ప్రకటించాలి.

కేంద్ర ప్రభుత్వం రాజకీయ ఖైదీ లందరినీ విడుదల చేయాలి.

అవామీలీగ్ శాసన సభ్యులలో ఎవరైనా బెంగాలీల ప్రయోజనాలకు వెన్నుపోటు పొడిస్తే సజీవంగా సమాధి చేయబడతారని హెచ్చరిస్తున్నాను.

సైన్యంలోను, ఫెడరల్ ప్రభుత్వ సర్వీసులలోను, పారిశ్రామిక, వాణిజ్య శాఖలలోను బెంగాలీలకు సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలి.

తూర్పు పాకిస్తాన్‌లో 70 లక్షల మంది బెంగాలీ యువకులు నిరుద్యోగులుగా వున్నారు. ఆహార సమస్య తీవ్రంగా వున్నది. దీన్ని శాశ్వతంగా పరిష్కరించాలి.

—o:o—

తమిళనాడు కౌన్సిల్‌కు డి. ఎం. కె. అభ్యర్థి ఎన్నిక

మద్రాసు, జనవరి 4: తమిళనాడు శాసన మండలికి శాసన సభనుంచి డి. ఎం. కె. ప్రతినిధిగా శ్రీ ఇ. ఎం. హనీఫా నేడు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. స్వతంత్ర పార్టీ సభ్యుని మృతి వల్ల ఈ ఖాళీ ఏర్పడింది.

భారత్‌తో వాణిజ్యం:

నేపాల్ మొండి వైఖరి

ఒప్పందం కుదరకపోవడానికి సంఖ్యా కారణమని అభిజ్ఞవర్గాల వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 4: భారత్ నుంచి రాధికాపూర్ ద్వారా పాకిస్తాన్‌లోకి తమకు మార్గం ఇవ్వాలని నేపాల్ పట్టుపట్టినందువల్ల వాణిజ్యం దెబ్బతినకుండా తగు చర్యలు తీసుకొనగలనని భారత ప్రభుత్వం ఇచ్చిన హామీని నేపాల్ విశ్వసించనందువల్ల వాణిజ్యం, రవాణా విషయమై భారత్, నేపాల్‌ల మధ్య కొత్త ఒప్పందం కుదరలేదని తెలియ వచ్చింది.

భూమార్గం ద్వారా పాకిస్తాన్‌కు త్రోవ ఇవ్వాలని నేపాల్ పట్టుబట్టడంపై భారతీయ పరిశీలకులు ఆశ్చర్యం వ్యక్తపరిచారు.

1965 వరకు రాధికాపూర్ రైల్వేమార్గం భారత్, పాకిస్తాన్‌ల మధ్య వ్యాపారానికి వినియోగించబడింది. ఒక్కసారి మాత్రం నేపాల్ ఈ మార్గాన్ని ఉపయోగించుకున్నది.

ఈ మార్గంవల్ల నేపాల్ వాణిజ్యానికి ఎలాంటి ప్రయోజనంలేదు. అయినప్పటికీ ఈ మార్గం విషయంలో నేపాలీలు మొండి వైఖరి ప్రదర్శించడం సముచితంగా లేదని పరిశీలకులు భావిస్తున్నారు.

ఉమ్మడి మార్కెట్ అవసరం లేదని మొదట నేపాల్ చెప్పింది. కాని అదే సమయంలో భారత్‌కు తమ సరుకులు స్వేచ్ఛగా రవాణా కావాలని అది కోరుతున్నది.

1960లో కుదిరిన ఒప్పందం సమిష్టి విపణికి ప్రతిపదికగా ఉన్నది. మూడవదేశంతో వ్యాపారం నెరపేటప్పుడు ఉభయ దేశాలు క్రమ శిక్షణ పాటించడం ఈ ఒప్పందంలోని ప్రధానాంశం. భారత్, నేపాల్‌ల మధ్య రవాణా అయ్యే సరకులపై కస్టమ్స్ సుంకాలు వుండవు.

కాని ఒప్పందంపై సంతకం చేసినతర్వాత నేపాల్ ఈ క్రమ శిక్షణను పాటించకుండ బోనసు ఓచరు పథకాన్ని అమలు పరచింది.

భారత్ ముడి జనుము ఎగుమతిని నిషేధించగా, ఎగుమతి దారులకు ఉచితంగా విదేశీ మారక ద్రవ్యం లభించేటట్లు 30 నుంచి 50 శాతం వరకు ఎగుమతి బోనసును ఎర చూపింది.

నేపాల్ ప్రభుత్వం ఇంకా ముందుకు పోయి అభ్రకం, సబ్బు నూనెల ఎగుమతికి బోనసు వోచర్లను బాహాటంగా ప్రకటించింది.

బోనసు వోచర్ల పథకం ఫలితంగా భారత్ నుంచి జనపనార, అభ్రకం, సబ్బు నూనెలు, తదితర వస్తువులు దొంగరవాణా కావడం అధికమైంది.

భారత్ దొంగ రవాణాదారులకు విదేశీ మారక ద్రవ్యం 60 శాతం వరకు లభిస్తున్నందున నేపాల్ నుంచి కెమేరాలు, వాచీలు, ఇతర విలాస వస్తువులు దొంగతనంగా రవాణా అవడం ప్రారంభమైంది.

భారత్, నేపాల్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్యం మరింత దెబ్బతిన్నది. అందుచేత భారతప్రభుత్వం ఈ అక్రమ రవాణా పద్ధతులను అరికట్టాలని నిశ్చయించింది.

భారత ప్రభుత్వం, నేపాల్‌కు ఈ విషయమై విజ్ఞప్తి చేయగా నేపాల్ ప్రభుత్వం అపార్థంతో ప్రచారం చేయడం దురదృష్టకరమని అభిజ్ఞవర్గాలవారు అన్నారు.

భారత్, నేపాల్‌ల మధ్య సంబంధాలు పటిష్టం కావడానికి వాణిజ్య, రవాణా ఒప్పందాన్ని కుదుర్చుకొనేందుకు నేపాల్ శాయశక్తులా కృషి చేసిందని, కాని తన వాణిజ్యాన్ని విస్తరింప జేసుకునేందుకు రవాణా సదుపాయాలు ఇతోధికం చేసుకొనడానికి కృషి చేస్తున్నదని కాని నేపాల్‌కు అవసరమైన సదుపాయాలు లభించకుండా భారత్ అవరోధాలు కలిగిస్తున్నదని నేపాల్ పత్రికలు ఇటీవల ప్రచారం ప్రారంభించాయి.

కాని వాస్తవం ఇదికాదు. 1960 ఒప్పందం కుదిరిన తర్వాత ఇతర దేశాలతో నేపాల్ ఒప్పందం పూర్వంకంటే 20 రెట్లు అధికమైంది. దీన్నిబట్టే నేపాల్‌కు భారత్ చేసిన సహాయం రుజువవుతున్నది.

కొత్త ఒప్పందంలో మరిన్ని హెచ్చు అవకాశాలు ఇవ్వడానికి భారత్ ఈసారి ముందుకు వచ్చింది. కలకత్తా, హాల్దియా రేవులకు రోడ్డు మార్గాలను ఇవ్వగలనని కూడా తెలిపింది. కలకత్తా రేవులో గిడ్డంగి సౌకర్యాలు కూడా పెంచగలనని చెప్పింది. అయినప్పటికీ నేపాల్ తన ప్రతిపాదనలపై మొండి వైఖరి చూపడం అనుచితమని రాజకీయ పరిశీలకులు పేర్కొన్నారు.

అధిక సంఖ్యలో లైసెన్సులు

ప్రభుత్వ చర్య: ఎస్. ఎన్. మిశ్రా విమర్శ

న్యూఢిల్లీ, జనవరి 4: లోక్‌సభ రద్దు అయిన తరువాత కేంద్రప్రభుత్వం అధిక సంఖ్యలో లైసెన్సులను మంజూరు చేసినట్లు రాజ్యసభ ప్రతిపక్షనాయకుడు శ్రీ ఎస్. ఎన్. మిశ్రా (సంస్థా కాం) నేడు ఆరోపించారు.

మూడు మితవాద పక్షాల ఎస్. ఎస్. పి. నాయకుల సమావేశం అనంతరం ఆయన విలేఖరులతో ప్రసంగిస్తూ యీ లైసెన్సులలో అధికభాగం పారిశ్రామిక సంస్థలకు యిచ్చినట్లు తెలిపారు. వీటికి పెట్టుబడి 700 కోట్లనుండి 800 కోట్ల రూపాయల వరకు ఉండగలదని కూడా శ్రీ మిశ్రా పేర్కొన్నారు.

ప్రధాని నాయకత్వంలోగల పార్టీ ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయటాన్ని నిరోధించే మార్గాలను కూడా యీ సమావేశం చర్చించిందని ఆయన తెలిపారు.

ఏయే పారిశ్రామిక సంస్థలకు లైసెన్సులు యిచ్చారో చెప్పగలరా అని అడుగగా తమ వద్ద జాబితా లేదని అయినా ఆ పేర్లను పత్రికా విలేఖరులకు తెలుపజాలమని శ్రీ మిశ్రా సమాధానం చెప్పారు. అయితే పార్లమెంటు, ప్రభుత్వం నిర్ణయించిన విధానాలకు వ్యతిరేకంగా లైసెన్సులు యివ్వడివ మాట స్పష్టమేనని ఆయన అన్నారు.

సంస్థాకాంగ్రెసు, స్వతంత్ర, జనసంఘం, ఎస్. ఎస్. పి. నాయకులు రేపు రాష్ట్రపతి శ్రీ గిరిని కలుసుకుని ప్రభుత్వం అనుసరించే అవాంఛనీయ పద్ధతులను అరికట్టటానికి చర్యలు తీసుకోవలసిందిగా కోరగలమని శ్రీ మిశ్రా తెలిపారు.

—:o:—

క్రీడారంగం:

దులీప్ ట్రోఫీ క్రికెట్ ఫైనల్స్‌కు దక్షిణమండలం చేరిక

బొంబాయి, జనవరి 4: ఇక్కడ పశ్చిమ మండలం, దక్షిణమండలం మధ్య జరుగుతున్న దులీప్‌ట్రోఫీ సెమీఫైనల్స్ క్రికెట్ పోటీలో నేడు చివరిరోజున లంచ్ విరామ సమయానికి 25 నిమిషాలకు ముందు పశ్చిమమండలం జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 186 పరుగులకు ఆలౌట్ అయింది. మొదటి ఇన్నింగ్స్‌లో 371 పరుగులు చేసిన దక్షిణ మండలంజట్టు పశ్చిమ మండలంపై మొదటి ఇన్నింగ్స్‌లో 185 పరుగులు ఆధిక్యత సంపాదించింది. దక్షిణ మండలం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించి లంచ్ వేళకు ఒక వికెట్‌కూడా నష్టపోకుండా 15 పరుగులు చేసింది.

స్కోరు దక్షిణమండలం మొదటి ఇన్నింగ్స్ 371, పశ్చిమ మండలం మొదటి ఇన్నింగ్స్ 186, అబిద్ అలీ 65పరుగులకు 5వికెట్లు, గోవిందరాజ 58 పరుగులకు 2 వికెట్లు, జైసింహ ఒక్క పరుగు ఇవ్వకుండా 2 వికెట్లు సాధించారు.

మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత సంపాదించిన దక్షిణమండలం ఫైనల్స్‌కు చేరుకున్నట్లే. ఫైనల్స్ పోటీ దక్షిణ మండలం, తూర్పు మండలం మధ్య జరుగుతుంది.

తూర్పు మండలం ఫైనల్స్‌కు చేరిక

కలకత్తా, జనవరి 4: తూర్పు మండలం జట్టు విన్న ఉత్తర మండలంపై పోటీలో తన మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత ద్వారా మొదటి సారిగా దులీప్‌ట్రోఫీ ఫైనల్స్‌కు చేరుకున్నది.

స్కోరు: తూర్పు మండలం 313, 2 వికెట్లకు 119 పరుగులు. డి.కె.ఆర్. దల్జీత్ సింగ్ 79, ఉత్తర మండలం: 257, 2కి 121 పరుగులు. అనుప్‌సింగ్ 53, బిషన్ సింగ్ బేడీ 58.

టెన్నిస్ పోటీలో గౌరవ మిశ్రా గెలుపు

త్రివేండ్రం, జనవరి 4: ఇక్కడ జరుగుతున్న అఖిల భారత హార్డ్‌కోర్టు టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలలో బెంగాల్‌కు చెందిన గౌరవమిశ్రా నేటి ఉదయం మద్రాసుకు చెందిన అమృతరాజును 2—6, 6—3, 7—5, 10—12, 6—4 స్కోరుతో ఓడించి పురుషుల సింగిల్స్ టైటిల్ గెలుపొందారు. పెద్ద పోటీలలో గెలుపొందడం గౌరవమిశ్రాకు ఇదే మొదటిసారి.

—o:o—

శ్రీకాకుళంలో కొత్త కాంగ్రెసుకు మద్దతు

విశాఖపట్నం, జనవరి 4: శ్రీకాకుళం జిల్లా సంస్థాకాంగ్రెసు సంయుక్త కార్యదర్శి శ్రీ సిగిరెడ్డి అప్పారావు నూరు మంది సంస్థా కాంగ్రెసు సభ్యులతో శ్రీకాకుళం జిల్లా కొత్త కాంగ్రెసులో చేరారని శ్రీ ఇప్పిలి జోగారావు తెలియజేస్తున్నారు. శ్రీకాకుళం లోక్‌సభ నియోజకవర్గానికి శ్రీ బొడ్డేపల్లి రాజగోపాలరావు అభ్యర్థిత్వానికి శ్రీ అప్పారావు మద్దతు యివ్వగలరని తెలుస్తున్నది. (స్వ. వి.)

దినఫలం

మౌలిక వ్యవహారాలు: జనవరి 5 మంగళవారం— రాత్రి గం 8.3 వరకు తిథి మంచిది కాదు. తరువాత మంచిది. నక్షత్రం మంచిది. 6 బుధవారం— తిథి మంచిది. నక్షత్రం మంచిదికాదు.

ప్రయాణాలు: జనవరి 5 మంగళవారం రాత్రి గం 8.3 వరకు తిథి మంచిదికాదు. తరువాత మంచిది. నక్షత్రం మంచిది. (అమృత యోగం మంచిది.) 6 బుధవారం తిథి మంచిది. నక్షత్రం మంచిదికాదు. (కాల యోగం మంచిదికాదు.)

(వర్జ్యమును, దుర్ముహూర్తమును గమనించాలెను.)

జన్మదినఫలం: జనవరి 5— ఈ సంవత్సరం వృత్తి వ్యాపారాల్లో శ్రమ మీద స్వల్పాభివృద్ధిని సాధించగలరు. కొన్ని వ్యవహారాల్లో అవసరమైన వ్యయం చేయవలసి వస్తుంది. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది కాని మార్పుల నిమిత్తం ప్రయత్నం చేయడానికి యిది సమయం కాదు. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. తీర్థయాత్రలు చేస్తారు. విద్యార్థులు శ్రమ మీద కృతార్థులు కాగలరు.

5-1-71 మంగళవారం

శ సం. 189 పుష్య మాసం. 15

మేషం

ఇదివరకు మీ కార్యక్రమాల్లో యేర్పడిన అవరోధాలు తొలగిపోతాయి. ఉద్యోగంలో గౌరవ ప్రాబల్యాలుబాగుంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. అశ్వినీనక్షత్ర జాతకులు మాత్రం జాగ్రత్తగా వ్యవహరించడం అవసరం.

వృషభం

అన్ని వ్యవహారాల్లోను ఆకస్మికంగా చిక్కులు యేర్పడతాయి. అధిక వ్యయం జరుగుతుంది. పుణ్యకార్యాలు చేస్తారు. వ్యతిరేకమైన వార్తలను వింటారు. రోహిణీనక్షత్ర జాతకులు మిగిలినవారికంటే జాగ్రత్తగా వ్యవహరించడం చాలా అవసరం.

మిథునం

వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసములో కూడిన వ్యవహారాలు లాభించగలవు. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. ఆర్ద్రానక్షత్ర జాతకులు మాత్రం జాగ్రత్తగా వ్యవహరించడం అవసరం.

కర్కాటకం

అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ఆశ్లేషానక్షత్ర జాతకులు మిగిలిన వారికంటే బాగా ఉంటుంది.

సింహం

ఈ దినం మీ కార్యక్రమాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందగలదు. నూతన విషయాలను తెల్సుకొంటారు. ఆరోగ్యం బాగుంటుంది. మఖానక్షత్ర జాతకులకు మాత్రం బాగా ఉండదు.

కన్య

కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ఆందోళనకు గురి కాగలరు. హస్తానక్షత్ర జాతకులు మిగిలిన వారికంటే జాగ్రత్తగా వ్యవహరించడం చాలా అవసరం.

తుల

భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగుంటాయి. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. కుటుంబ వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. విశాఖానక్షత్ర జాతకులకు మిగిలిన వారికంటే బాగుంటుంది.

వృశ్చికం

ఏ వ్యవహారంలోను యితరుల మీద ఆధారపడడం తగదు. వృత్తిలో శ్రమ మీద అనుకూలత లభిస్తుంది. అవసరమైన సందేశాలు కలుగుతాయి. అనూరాధానక్షత్ర జాతకులు జాగ్రత్తగా వ్యవహరించడం అవసరం.

ధనుస్సు

వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. అలంకార వస్తువులు కొంటారు. మూలానక్షత్ర జాతకులకు మాత్రం బాగుండదు.

మకరం

ఇతరుల నిమిత్తం చేసే ప్రయత్నాలు సులువుగా నెరవేరుతాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొహమాటాలు తగవు. ప్రయాణాలు వాయిదా పడతాయి. శ్రవణానక్షత్ర జాతకులు జాగ్రత్తగా వ్యవహరించడం చాలా అవసరం.

కుంభం

వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగా ఉంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. సంతోషకరమైన వార్తలను వింటారు. ఆరోగ్యం బాగా ఉంటుంది. పూర్వాభాద్రానక్షత్ర జాతకులకు మిగిలిన వారికంటే బాగా ఉంటుంది.

మీనం

అన్ని వ్యవహారాల్లోను మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. నూతన విషయాలనుతెల్సుకొంటారు. రేవతీనక్షత్ర జాతకులకు మిగిలిన వారికంటే బాగా ఉంటుంది.

— మహేష్

కాశ్మీర్‌లో వేర్పాటు శక్తుల విద్రోహ చర్యలు

బాగా పెచ్చరిల్లినట్లు వెల్లడి: వివిధ పార్టీల నాయకుల ఆందోళన

శ్రీనగర్, జనవరి 4: కాశ్మీర్ లోయ లోని కొన్ని ప్రాంతాలలో గత కొద్ది వారాలుగా వేర్పాటు కార్యకలాపాలు, జాతీయ వ్యతిరేక ప్రచారం బాగా పెచ్చరిల్లినవని ఢిల్లీకి చేరుతున్న వార్తలు తెలుపుతున్నవి.

లోక్ సభకు మధ్యంతర ఎన్నికలు జరపాలని కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకటించబడినప్పటి నుంచి ఈ కార్య కలాపాలు మరింతగా పెచ్చరిల్లినవి.

కాశ్మీర్ లోయ ప్రాంతాలలో పర్యటించి తిరిగి వచ్చిన పెక్కుమంది రాజకీయ నాయకులు, పార్లమెంటు సభ్యులు అక్కడి పరిస్థితి పట్ల ఆందోళన ప్రకటించారు. కాశ్మీర్‌లో విద్రోహ కార్యకలాపాలు కేంద్రం తీవ్రంగా పరిగణించాలని జాతీయ వ్యతిరేక శక్తులపై వెంటనే గట్టి చర్యలు తీసుకొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

కాశ్మీర్‌లో ఉన్న వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కలదని, జాతీయ వ్యతిరేక శక్తులపై ఈ చట్టాన్ని అనుసరించి వెంటనే చర్యలు గైకొనాలని నాయకులు సూచించారు.

కాశ్మీర్ లోయలోని వేర్పాటు వాద శక్తులతో సంబంధాలు పెంచుకొనడానికి పాకిస్తాన్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నదని విద్రోహ చర్యలు జరుపడానికి పాకిస్తాన్ డబ్బు సంచులు అధికారికంగా పంపుతున్నట్లు సమాచారం చేరింది.

కాల్పుల విరమణ రేఖ వెంబడి గెరిల్లా పోరాటం ప్రారంభించడానికి పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో సన్నాహాలు జరుగుతున్నవని కూడా తెలియ వచ్చింది. పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం శ్రద్ధగా పరిశీలిస్తున్నది.

—:o:—

మంత్రి శ్రీ రామచంద్రరావు కళ్యాణి

హైదరాబాద్, జనవరి 4: రాష్ట్ర మార్కెటింగ్ వ్యవహారాల శాఖామంత్రి శ్రీ రామచంద్రరావు కళ్యాణి జనవరి ఆరవ తేదీన నందిగామ వెళతారు. ఆ తర్వాత ఆయన విజయవాడ చేరుకుని జనవరి 7వ తేదీన భీమవరం, అమలాపురంలను, జనవరి 8వ తేదీన అంబాజీపేట, తాటిపాక మార్కెట్ యార్డ్‌లను, 9వ తేదీన గుడివాడను, 10వ తేదీన బందరును సందర్శిస్తారు. జనవరి 10వ తేదీ రాత్రికి ఇక్కడకు తిరిగివస్తారు.

విజయవాడలో ఎన్నికల వాతావరణం

వివిధ పార్టీల సన్నాహాలు

విజయవాడ, జనవరి 3: లోక్‌సభకు జరిగే మధ్యంతర ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల నిర్ణయానికి వివిధ రాజకీయ పార్టీల కార్యవర్గాలు యిక్కడ రెండు రోజుల సమావేశాలు ప్రారంభించటంతో పట్టణంలో ఎన్నికల వాతావరణం ప్రారంభమయింది.

విజయవాడ నియోజకవర్గానికి యీ పర్యాయం పోటీ వుంటుందా? అన్న ప్రశ్న ప్రతినోట వినబడుతోంది. డా. కె. ఎల్. రావు అధికార కాంగ్రెసు అభ్యర్థిగా పోటీచేయటం ఖాయం అని అందరు అనుకుంటున్నదే. అయితే ఆయనకు ఎవరైనా పోటీచేస్తారా అన్నదే ప్రశ్న.

మితవాద కమ్యూనిస్టు పార్టీ పోటీ చేయటానికి నిశ్చయించుకుందికాని ఎన్నికల సర్దుబాట్లకు అవకాశం కల్పిస్తూ తీర్మానించటంతో ఆ పార్టీ పోటీ చేయదేమో అని ప్రజలు భావిస్తున్నారు.

స్వతంత్రపార్టీ మాత్రం పోటీ పెట్టరు అని ఖాయంగా తెలుస్తోంది. జనసంఘం కృష్ణా జిల్లాలో ఒక్క స్థానానికైనా పోటీ చేయాలని నిశ్చయించుకున్నట్లు తెలుస్తోంది కాని ఆ స్థానం ఏది అనేది యింకా నిశ్చయం కాలేదు.

సంస్థాకాంగ్రెసు పోటీచేస్తుందో లేదో యింకా తెలియటం లేదు. మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ రెండు రోజుల సమావేశం యీ రోజు యిక్కడ పార్టీ కార్యాలయంలో ప్రారంభమయింది. శ్రీయుతులు మోటూరి హనుమంతరావు, వండూరి ప్రసాదరావు, గుంటూరు బాపనయ్య, ఉద్దండరాజు రామం మొదలైన పార్టీ ప్రముఖులు హాజరైనారు.

—o—

యాత్రికాభివృద్ధి సంఘ సమావేశం

హైదరాబాద్, జనవరి 4: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యాత్రికాభివృద్ధి సంఘం సమావేశం 16వ తేదీన సాయంత్రం మూడు గంటలకు ఇక్కడ జూబ్లీహాలులో జరుగుతుంది.

గుంటూరు జిల్లా బలహీన వర్గాలు

ఈనెలలో సదస్సు ఏర్పాటు

గుంటూరు, జనవరి 4: గుంటూరు జిల్లా బలహీన వర్గాల ప్రత్యేక సదస్సు ఆహ్వాన సంఘ సమావేశం ఇటీవల జిల్లా బలహీన వర్గాల సదస్సు కార్యాలయంలో జరిగింది. డా. పి. ప్రభుదాస్ అధ్యక్షత వహించారు. జిల్లా బలహీన వర్గాల నాయకులు శ్రీ కె. మల్లయ్యలింగం, శాసన మండలి సభ్యుడు శ్రీ వడ్డే నాగేశ్వరరావు, శ్రీ ఎస్. శివాజీ, శ్రీ మాదాసు నాగయ్య, శ్రీ జువ్వి వెంకు రంగారావు, శ్రీ కె. స్వ. నరసింహారావు, శ్రీ ఆడిపా చినవెంకటస్వామి, శ్రీ జొన్నలగడ్డ జోషి ప్రభృతులు హాజరయ్యారు.

రాష్ట్రంలో ప్రస్తుతం బలహీన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులను కూలంకషంగా చర్చించారు. బలహీన వర్గాల విద్యావంతులలో నానాటికీ తీవ్రతర మవుతున్న నిరుద్యోగ సమస్యను వెంటనే పరిష్కరించవలసిన అవశ్యకతను గూర్చి పలువురు ప్రముఖులు ఉపన్యసించారు.

రాష్ట్రంలో అధిక సంఖ్యాకులుగా గల బలహీన వర్గాల ప్రజల దైనందిన జీవన పరిస్థితులను మెరుగు పర్చేందుకు తీసుకోవలసిన చర్యలను గూర్చి విస్తృతంగా చర్చించేందుకు జనవరిలో జిల్లా సదస్సును జరుపుటకు ఏకగ్రీవంగా నిర్ణయించబడినది.

స్వాగతసన్నాహాలు జరుపుటకు పర్య శ్రీ వడ్డే నాగేశ్వరరావు మాతలపాటి జోసెఫ్ (జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు), శ్రీ షేక్ ఆదాం సాహెబ్, డా. పి. ప్రభుదాసు తదితరులతో వివిధ సంఘాలు ఏర్పాటు చేశారు. శ్రీ చిన్నం సుబ్బారావు అభివందనములు తెలిపారు.

—o:o—

తిరుపతిలో కల్యాణి రిజర్వాయర్ పథకం

దేవస్థానంవారిచే రు. 37 లక్షల ఋణం

తిరుపతి, జనవరి 4: తిరుపతి దేవస్థానం ట్రస్టీ బోర్డు ఇక్కడ సమావేశమై తిరుపతి పురపాలకసంఘానికి 37 లక్షల రూపాయలు అడ్వాన్సు ఋణంగా ఇవ్వాలని నిర్ణయించింది.

తిరుమలకు, విశ్వవిద్యాలయానికి మంచి నీరు సరఫరా చేసే కల్యాణి రిజర్వాయర్ పథకం అమలుకు తన వంతు భాగంగా దేవస్థానం ట్రస్ట్ బోర్డు పై మొత్తాన్ని ఇస్తున్నది.

ఈ పథకానికి మొత్తం మూడు కోట్ల రూపాయలు ఖర్చవుతుంది.

ఇతర జీర్ణ దేవాలయాల ఉద్ధరణ పథకాలకు ఏటా నాలుగున్నర లక్షల రూపాయలు మంజూరు చేయాలని కూడా నిర్ణయించారు. ఈ సమావేశానికి ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ శ్రీ రంగరాజు అధ్యక్షత వహించారు.(స్వ.వి.)

—o:o—

మంత్రి రామచంద్రరావు కళ్యాణి

హైదరాబాద్, జనవరి 4: మార్కెటింగ్ శాఖ మంత్రి శ్రీ రామచంద్రరావుకళ్యాణి జనవరి 11న కరీంనగర్ వెళుతున్నారు. అక్కడనుండి సిరిపూర్—కాగజనగర్ వెడతారు. 13వ తేదీన రాజధానికి తిరిగి వస్తారు.

కంచికచర్ల ప్రాంతంలో అనావృష్టి: సహాయ కార్యక్రమాలకై విజ్ఞప్తి

కంచికచర్ల, జనవరి 4: కృష్ణాజిల్లా కంచికచర్ల పంచాయతీ సమితి సర్వసభ్య సమావేశం శ్రీ చింతావెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది.

సమితి ప్రాంతంలో అనావృష్టివల్ల ఏర్పడ్డ అత్యవసర పరిస్థితిని వివరిస్తూ ఇప్పటివరకు సేకరించిన వివరాల ప్రకారం ఈ సంవత్సరం కోతల కాలంలో ఎడతెరిపిలేకుండా వర్షాలు పడుటవల్ల 24880 ఎకరాలలో వేసిన పత్తి పైనరువల్ల ఎకరాకు 150 రూపాయల వంతున మొత్తం 37 లక్షల 32 వేల రూపాయలు. 3420 ఎకరాలలో వేసిన వేరుశనగవల్ల 3 లక్షల 24 వేల రూపాయల నష్టం జరిగిందన్నారు. జొన్న ఈ సంవత్సరం 20296 ఎకరాలలో మాత్రం వేయుటం వల్ల, ఎకరాకు 200 రూపాయల వంతున 40 లక్షల 59 వేల రూపాయల నష్టం. 17000ఎకరాలవిస్తీర్ణంలోవేయవలసినపొగాకు 14201 ఎకరాలలో వేయుటవల్ల, ఎకరాకు 700 రూపాయల వంతున మొత్తం 99 లక్షల 41 వేల రూపాయలు, మిర్చి3722 ఎకరాలలో వేయుటవల్ల ఎకరాకు 600 రూపాయల వంతున 22 లక్షల 33 వేల రూపాయలు, 1598 ఎకరాలలో వేసినమెట్ట వరికి ఎకరాకు 300 రూపాయల వంతున 4 లక్షల 79 వేల రూపాయలు నష్టం జరిగిందని సమితి అధ్యక్షులు వివరించారు. మొత్తం మెట్ట పైరులవల్ల సమితిప్రాంతంలోని రైతులకు 2 కోట్ల, 7 లక్షల 84 వేల రూపాయలు నష్టం జరిగిందన్నారు.

మరులపాడు సర్పంచ్ శ్రీ వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ గతమూడు సంవత్సరాలుగా వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేక ఈ ప్రాంతపు ముఖ్య వాణిజ్య పంటయైన పొగాకు సరిగా పండక రైతులు చాలా నష్ట పోయారన్నారు.

సమితిలోని పంచాయితీ సర్పంచ్‌లు ఆయా పంచాయితీలలో సహాయ కార్యక్రమాలకు ప్రభుత్వమును కోరుతూ చేసిన తీర్మానములను ప్రజల మహాజర్లను సమితి అధ్యక్షులు అందజేశారు.

ప్రతి సంవత్సరం అనా వృష్టికి గురిఅగుచున్న యీ ప్రాంతమును శాశ్వతముగా రక్షించుటకు సహాయ కార్యక్రమము క్రింద నాగార్జునసాగర్ కాల్వల త్రవ్వకమును కట్టలేరు, మునేరుల తూర్పు భాగములకు పొడిగించి పనులులేని వ్యవసాయ కూలీలకు పనులను కల్పించ వలసిందిగాను, ప్రభుత్వము సొసైటీలు బ్యాంకులు రైతులకిచ్చిన అప్పుల వసూళ్లను వాయిదా వేయవలసిందిగాను ఖరువు పనులను వెంటనే ప్రారంభించవలసినదిగాను, మెట్ట శిస్తును యీ సంవత్సరం మాఫీ చేయవలసిందిగాను గ్రామీణ విద్యుత్ సరఫరా పథకమును ప్రారంభించవలసిందిగాను కోరారు.

70—71 సంవత్సరమునకు మాత్రు అప్పులను మంజూరు చేయవలసిందిగాను పశువులకు మేతను ఉచితముగా అందజేయవలసిందిగాను ప్రభుత్వమును కోరుతూ తీర్మానించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ, ముఖ్యమంత్రి రెవిన్యూ, నీటిపారుదలశాఖల మంత్రులకు అనావృష్టిప్రాంతముగా ప్రకటించి సహాయ కార్యక్రమములను వెంటనే ప్రారంభించవలసిందిగా కోరుటకు ప్రతినిధి వర్గమును పంపుటకు తీర్మానించారు.

—o:—

వాడ రేవు వద్ద బెస్తరేవు స్థాపన

ప్రగడ కోటయ్య విజ్ఞప్తి

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, జనవరి 4: వాడరేవు వద్ద బెస్తరేవు ఏర్పాటు చేయాలని వాడరేవు సమీపానగల బెస్తవాడలలోని వారు వేటలు లాభసాటిగా విక్రయించుకోగలిగేందుకు వేటల పల్లిపాలెం, వచ్చవుగాలి, విజయలక్ష్మీపురం మీదుగా వాడరేవుకు, పందిళ్ళపల్లినుంచిమోదుపల్లికి రోడ్లు నిర్మించాలని, శాసన సభ్యుడు శ్రీ ప్రగడకోటయ్య రాష్ట్ర ప్రభుత్వ అహార వ్యవసాయశాఖ కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు.

చేపలు పట్టుకోవడానికి సముద్రంలోకి చాలా దూరం వెళ్ళి సూర్యాస్తమయంలోగా తిరిగి రాకపోయినవారు సురక్షితంగా తమనివాసాలకు చేరుకొనడానికిగాను తమిళనాడు, కేరళ రాష్ట్రాలలోవలే చీరాల ఫిర్కాలో మార్గదర్శక డిపోలు ఏర్పాటు చేయాలని కూడా ఆయన కోరారు.

ఈ రెండు విషయాలపై స్పష్టమైన హామీలు యివ్వబడినప్పటికీ యింతవరకు చర్యలుగైకొనబడలేదని ఆయన తెలిపారు.

—o:—

కాపుసారా అమ్మకం నేరానికి కారాగార శిక్ష

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

బందరు, జనవరి 3: కాపుసారా వర్తకం చేస్తున్నందుకు ఇద్దరికి చెరి ఒక రెండేండ్ల కారాగార శిక్ష విధిస్తూ, జుడిషియల్ మేజిస్ట్రేటు శ్రీ సి. శ్రీనివాసన్ తీర్పు చెప్పారు. పై ముద్దాయిలకు చెరి ఒక రు. 50లు జరిమానా కూడా విధించారు.

ఇక్కడి స్టేటు ఎక్సైజు సూపరింటెండెంటు అసిస్టెంటు సూపరింటెండెంటు ఆధ్వర్యం క్రింద పెట్టీ ఆఫీసరు శ్రీ ఎస్. సుదర్శనరావు వారి సిబ్బందితో దాడిచేసి బందరు తాలూకాలో ఇప్పటికి 200 కేసులు పట్టుకున్నారు. కాపుసారా చేరవేస్తున్న 3 పడవలు, 2 సైకిళ్ళు కూడా వీరు పట్టి వేశారు. వీరు పట్టుకున్న వాటిలో 1655 లీటర్ల కాపుసారా, 42500 లీటర్ల కాపుసారాకు ఉపయోగించే ఊటవున్నది. దీని విలువ సుమారు లక్ష రూపాయలు కిమ్మతు చేస్తుందని తెలుస్తున్నది.

దిండి ప్రాజెక్టు క్రింద నీరు విడుదల

నల్గొండజిల్లా నీటిపారుదల బోర్డు నిర్ణయాలు

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, జనవరి 4: నల్గొండ జిల్లా నీటిపారుదల బోర్డు గతవారం యిక్కడ జిల్లా కలెక్టర్ శ్రీ కె. వేంకయ్య అధ్యక్షతను సమావేశమై, దిండి ప్రాజెక్టు క్రింద వెయ్యి ఎకరాలకు, పెరిగిండిలో మొత్తం ఆయుకట్టులో రెండవ పంటకు నీరు విడుదల చేయాలని నిర్ణయించింది.

మూసి, భీమన్‌పల్లి, పెండ్లిపాకల ప్రాజెక్టుల క్రింద రెండవ పంటకు నీరు వదలరాదనికూడా సమావేశం నిర్ణయించింది. నీటి కొరత కారణంగా ఈ నిర్ణయం జరిగింది.

భీమన్‌పల్లి పెండ్లిపాకల ప్రాజెక్టుల క్రింద లోకలైజేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయుడానికి రెవిన్యూబోర్డు ప్రత్యేక సిబ్బందిని మంజూరు చేయాలని సమావేశం కోరింది.

అసిఫ్‌నాయక్ ప్రాజెక్టు క్రింద వివిధ తటాకాలకు నీటిసరఫరా క్రమబద్ధం చేయడానికి ముసాయిదా పథకాన్ని పి. డబ్ల్యు. డి. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాఖలు చేశారు.

—o:o—

పోలీసులకు మంచి పేరు

మంత్రి వెంగళరావు సందేశం

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాదు, జనవరి 4:—పోలీసులు తాము తెచ్చుకున్న మంచిపేరును కాపాడుకొనాలని కోరడమే, నూతన ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా తాము పోలీసులకు ఇస్తున్న సందేశమని, రాష్ట్ర ఆంతరంగిక వ్యవహారాల మంత్రి శ్రీ జలగం వెంగళరావు మొన్నపత్రికా విలేఖరులతో మాట్లాడుతూ చెప్పారు.

పోలీసులకు యిళ్లకోసం ప్రభుత్వం ఏటా 30 లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నదని, ఆయన అన్నారు. అందులో 20 లక్షల రూపాయలు రాజధానిలోను, విజయవాడలో 5 లక్షల రూపాయలు, విశాఖపట్నం, కర్నూలు పట్టణాల్లో రెండున్నర లక్షల రూపాయలు చొప్పున ఖర్చు పెడుతున్నామని ఆయన తెలిపారు.

ప్రస్తుతం విజయనగరంలో ఉన్న శ్రీకాకుళం జిల్లా పోలీసు కేంద్రాన్ని శ్రీకాకుళం పట్టణానికి మార్చి, అక్కడ పోలీసులకు వసతి సౌకర్యాన్ని కల్పించడానికి ప్రభుత్వం అదనంగా 25 లక్షల రూపాయలు మంజూరు చేసిందని, ఆయన వెల్లడించారు.

చినబండలో హరిజన గిరిజన కాలనీ

శ్రీ కాకాని వెంకటరత్నంచే శంకుస్థాపన

తిరువూరు, జనవరి 4: తిరువూరు తాలూకా విస్సన్నపేట సమితిలోని చినబండ గ్రామంలో ఇటీవల ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ పశుసంవర్ధక శాఖామాత్యులు గౌ॥ శ్రీ కాకాని వెంకటరత్నం హరిజనగిరిజనకాలనీకి శంకుస్థాపన చేశారు.

ఈ కాలనీలో 16 మంది హరిజనులు, 10 మంది గిరిజను (ఎరుకల వర్గీయులు)లకు ప్రత్యేకంగా ప్రభుత్వమువారిచే కాలనీ నిర్మాణపు ఏర్పాట్లు చేయబడెను. ఆ సందర్భంలో జరిగిన సభకు విస్సన్నపేట సమితి అధ్యక్షులు శ్రీ గద్దం సత్యనారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీ కాకానివెంకటరత్నం ప్రసంగిస్తూ గాంధీజీ ఆశయాల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వములు హరిజనులు, గిరిజనులకు ఆశ్రయం ఏర్పరచుటకు గృహ నిర్మాణ పథకములు చేపట్టినవని, ఈ పథకములు అమలు జరుపబడినచోట్ల, విద్యుత్ సౌకర్యము, పాడిపరిశ్రమ, కోళ్ళపరిశ్రమ తదితర కుటీర పరిశ్రమలు కూడా ఏర్పరచు అభిప్రాయము గలదని ప్రభుత్వము చేస్తున్న సౌకర్యములనుపొంది దేశంలో దారిద్ర్యనిర్మూలనకు స్వయం కృషికి పేదలు పూనుకోవలసిందని సలహా యిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమువారు, వెనుకబడిన తరగతులవారికి ఉద్యోగవసతి, రిజర్వేషను యితర సౌకర్యములు కలుగ జేయుటకు చేస్తున్న కృషిని వివరించారు. యిటీవల కుమ్మరి, రజక, వడ్డెర, వెనుకబడిన వారికి వృత్తిపన్ను రద్దు పరచిన విషయం ప్రస్తావించి ప్రభుత్వ కృషిని గమనించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

తిరువూరు భూమి తనఖాబ్యాంకు అధ్యక్షులు శ్రీ పేటబావయ్య, హరిజన సేవా సంఘం కార్యదర్శి శ్రీమురుకుంట్ల వెంకటప్పయ్య ప్రసంగించారు. కంకిపాడు శాసన సభ్యులు సభను ప్రారంభించారు. తిరువూరు శాసన సభ్యులు శ్రీ కోటరామయ్య పాల్గొన్నారు. తొలుత కాలనీ తరుపున గ్రామ ప్రజల తరఫున శ్రీ మాచర్ల గోపాలం స్వాగత పత్రం సమర్పించారు.

—o:—

కొత్తపేట తాలూకా భూమి తనఖా బ్యాంకు

అంబాజీపేట, జనవరి 4: కొత్తపేట తాలూకాలో భూమి తనఖా బ్యాంకుకు జరిగిన పాలకవర్గ ఎన్నికలలో కొత్త కాంగ్రెసుకు చెందిన వారే ఎక్కువ విజయాన్ని సాధించినట్లు తెలుస్తున్నది. కోఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్ శ్రీ పి. వెంకట్రావు ఎన్నికలు నిర్వహించారు.

అధ్యక్షులు శ్రీ నంబూరి రామరాజు, ఉపాధ్యక్షులు శ్రీటటవర్తి సత్యసూర్యనారాయణమూర్తి, కోశాధికారి శ్రీ ముత్యాల వెంకట్రావు, డైరెక్టర్లు, సర్వశ్రీ చింతలరామారావు, దొరదుబారి వీరభద్రరావు, వక్కలంక భీమశంకరం, గారపాటి అబ్బులుచౌదరి, పేరిచెర్ల సుబ్బరాజు, క్షత్రిధనువురెడ్డి.

పాక్ కొత్త రాజ్యాంగానికి అడ్డువస్తే రక్తపాతం

షేక్ ముజిబుర్ రెహమాన్ హెచ్చరిక

ఢాకా, జనవరి 4: కొత్త రాజ్యాంగాన్ని రూపొందించటంలో ఎవరైనా జోక్యం చేసుకుంటే రక్తపాతం జరుగ గలదని అవామీలీగ్ నాయకుడు షేక్ ముజిబుర్ రెహమాన్ హెచ్చరించారు.

పాకిస్తాన్‌లో గత నెలలో జరిగిన ఎన్నికలలో అవామీ లీగ్ అత్యధిక స్థానాలు గెలుచుకున్నది.

తూర్పు పాకిస్తాన్‌లో తమ పార్టీ అమలు జరుప దలచిన కార్యక్రమం ప్రాతిపదికపై కొత్త రాజ్యాంగం రూపొందించ బడుతుందని, ఎవరూ ఓడ్ని అడ్డలేరని శ్రీ రెహమాన్ నిన్న ఇక్కడ జరిగిన పెద్ద బహిరంగసభలో మాట్లాడుతూ చెప్పారు.

తూర్పు పాకిస్తాన్‌కు స్వయం నిర్ణయాధికారం వుండాలన్న విధానానికి తమ పార్టీ కట్టుబడి వుండగలదని, కొత్త రాజ్యాంగాన్ని అందరూ ఆమోదించి తీరాలని, జోక్యం చేసుకునే హక్కు ఎవరికీ లేదని, ఎవరైనా జోక్యం చేసుకొనడానికి ప్రయత్నిస్తే, ఎవరూ ఆదుపు చేయజాలని విధంగా రక్తపాతం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

కొత్త రాజ్యాంగం తయారు చెయడానికి పాక్ అధ్యక్షుడు యాహ్యాఖాన్ 120 రోజుల గడువు ఇచ్చారు.

తూర్పు, పశ్చిమ పాకిస్తాన్‌ల మధ్య గల సంబంధాలను బలహీనపరచే రాజ్యాంగం తయారు చేయబడితే దాన్ని తాను త్రోసిపుచ్చగలనని యాహ్యాఖాన్ ఇదివరకే ఒక ప్రకటనలో హెచ్చరించారు.

తమ పార్టీ మెజారిటీ స్థానంలో వున్నందున తాము ఎవరి సహకారాన్నీ కోరబోమని, పశ్చిమ పాకిస్తాన్ ప్రతినిధుల సహకారాన్ని కోరుతున్నామని, అయినా తమ సిద్ధాంతం విషయంలో మాత్రం రాజీకి వచ్చే సమస్య లేదని ఆయన స్పష్టం చేశారు.

—o:—

మంత్రి శ్రీ విజయ భాస్కర రెడ్డి

హైదరాబాద్, జనవరి 4: ఆర్థికమంత్రి శ్రీ కె. విజయభాస్కరరెడ్డి అయిదవ తేదీన కర్నూలుకు బయలుదేరి వెడతారు. మరు రోజు లొడ్డిపల్లిలో పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రారంభోత్సవం చేస్తారు. నారనూరులో ఎల్. ఎఫ్. చికిత్సా కేంద్రానికి శంకుస్థాపన చేస్తారు.

గుంటూరులో ఆంధ్ర శిల్ప కళాపరిషత్ వార్షికోత్సవం

గుంటూరు, జనవరి 3:—ఆంధ్ర శిల్ప కళాపరిషత్ తెనాలివారి 24వ వార్షికోత్సవం, తృతీయ శిల్పకళా ప్రదర్శనం ఈ నెల 10వ తేదీన గుంటూరు హిందూ కళాశాల భవనంలో జరుగుతాయి. గుంటూరు జిల్లాకలెక్టరు శ్రీ ఎం. వెంకటరత్నం ప్రారంభోత్సవం గావిస్తారు. శ్రీ పులివర్తి శరభాచార్యులు అధ్యక్షత వహిస్తారు. నాటి సాయంత్రం నాలుగు గంటలకు శ్రీ నంబూరి సూర్యప్రకాశరావు అధ్యక్షతన వార్షిక సభ జరుగుతుంది.

శిల్పకళా ప్రదర్శనలో శిలా, దారు, లోహ, కాంశ్య, రజిత, సువర్ణమయములయిన శిల్పములు ప్రదర్శిస్తారు. ప్రదర్శింపబడువస్తువులకు అర్హతలనుబట్టి బహుమతులుఇస్తారు.

—o:o—

ఖమ్మం జిల్లా సహకార కేంద్రబ్యాంకు డైరెక్టర్లు

ఖమ్మం, జనవరి 4: ఖమ్మంజిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు డైరెక్టర్ల పదవులకు యిటీవల ఎన్నికలు జరిగాయి. ఈ దిగువవారు డైరెక్టర్లుగా ఎన్నికైనారు. శ్రీయుతులు ఎస్. ఉపేంద్రయ్య, డి. సుబ్బారావు, సి.హెచ్. కాశయ్య, కె. అనంతరెడ్డి, డి. ధర్మయ్య, యు. గోపయ్య డి. వెంకయ్య, పి. రామచంద్రయ్య, ఎ. పింగయ్య, జి. వెంకటేశ్వరరావు, బి. వెంకటేశ్వరరెడ్డి, డి. బుచ్చిరామరెడ్డి, రావులపాటి సత్యనారాయణరావు, పి. సత్యనారాయణరావు, పొట్ల వెంకటయ్యలు డైరెక్టర్లుగా ఎన్నికయినారు.

శ్రీ కె. అనంతరెడ్డి అధ్యక్షులుగాను, శ్రీ పొట్ల వెంకయ్య ఉపాధ్యక్షులుగాను ఏకగ్రీవంగా ఎన్నికయినారు.

ఇండియన్ నేవీ ఎగ్జామినేషన్ జూలై 1971

భారత నౌకా దళములో స్పెషల్ ఎంట్రీకేడెట్ల సెలక్షన్ నిమిత్తము 8 జూలై 1971 నుండి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్‌చే అలహాబాద్, భోపాల్, బొంబాయి, కలకత్తా, ఢిల్లీ, మద్రాసు, పాటియాలా, షిల్లాంగ్, త్రివేండ్రంలలో ఒక పరీక్ష నిర్వహించబడును.

అర్హత:—ఈ పరీక్షకు హాజరగుటకు అవివాహితులైన పురుష అభ్యర్థులే దరఖాస్తు చేయవలెను.

వయో పరిమితి:—అభ్యర్థులు 2 జనవరి 1952కు ముందుగాను 1 జనవరి 1955కు తర్వాతను జన్మించి యుండరాదు. ఈ వయోపరిమితులు ఎట్టి పరిస్థితులలో సడలించబడవు.

కనీస విద్యార్హతలు:—ఇంటర్మీడియెట్ లేక సమాన అర్హత (ఇంటర్మీడియెట్ లేక సమాన పరీక్షకు హాజరైన లేక హాజరు కానున్న అభ్యర్థులు తాత్కాలికముగా అంగీకరించబడుదురు

ఎన్నిక:—వ్రాత పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థి ఇంటర్వ్యూ నిమిత్తము సర్వీసెస్ సెలక్షన్‌బోర్డు ఎదుట హాజరుకావలెను.

దరఖాస్తు ఫారములు మరియు పూర్తి వివరములను మనిఆర్డరు ద్వారా 1రూపాయి పంపిగాని లేదా కమీషన్ కార్యాలయపు కౌంటర్‌లో రొఖముగా చెల్లించి సెక్రటరి, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్, ధోల్‌పూర్‌హౌస్, న్యూఢిల్లీ వారి నుండి పొందవచ్చును. అభ్యర్థులు మనిఆర్డరు కూపనుమీద ఇండియన్ నేవీ ఎగ్జామినేషన్—జూలై 1971 అని వ్రాయవలెను. మరియు తమపేరు, పూర్తిపోస్టల్ అడ్రసు వ్రాయవలెను. పోస్టల్‌ఆర్డర్లు, చెక్కులు, కరెన్సినోట్లు అంగీకరించబడవు. దరఖాస్తుఫారము, పూర్తి వివరములను రేవులలోని నౌకాదళాధికారులనుండి కూడ ఉచితముగా పొందవచ్చును.

గడువుతేది:—యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్‌కు పూర్తిచేసిన దరఖాస్తులు 15 ఫిబ్రవరి 1971లోగా అందవలెను. (విదేశములలోను, అండమాన్, నికోబార్, లక్కదీవులు, మినికాయ్, అమిన్ దీవులలో నివసించు అభ్యర్థుల దరఖాస్తులు చేయుటకు ఆఖరుతేది 1 మార్చి 1971

davy 70/543

1971 జనవరి నెలలో వేలం కార్యక్రమము

ఈ క్రింది స్టోర్సు బహిరంగ వేలములో విక్రయించబడును.

1. తేదీ, సమయము : 5—1—71 ఉదయం 10—30 గంటలు.
   వేలము స్థలము : పి. డబ్ల్యు. డి. స్టోర్సు, పాండిచేరి.
   స్టోర్సు : మిసలేనియస్ స్టోర్సు, ఐరన్ రివెట్స్, బోల్ట్సు, నట్సు, ఎం. ఎస్. ప్లేట్, స్క్రూలు, ట్యూబులు, టూల్సు అండ్ పార్ట్సు వగైరా—146. ఐటములు.
2. తేదీ, సమయము : 6—1—71 ఉదయం 10—30 గంటలు.
   వేలము స్థలము : టెలిఫోన్ ఎక్స్చేంజి, తిరువారూర్.
   స్టోర్సు : ఎలెక్ట్రికల్ గూడ్సు—స్పేర్ పార్ట్సు వగైరా — 21 ఐటములు.
3. తేదీ, సమయము : 7—1—71 ఉదయం 10—30 గంటలు.
   వేలము స్థలము : సబ్‌డివిజనల్ ఆఫీసర్ వారి కార్యాలయము, టెలిఫోన్సు, మధురై.
   స్టోర్సు : విల్లిస్ మోడల్1960-4వీల్డ్ డ్రైవ్ సిజె3బి1నెంబరు.
4. తేదీ, సమయము : 8—1—71 ఉదయం 10—30 గంటలు
   వేలము స్థలము : సౌండ్ ఇన్‌వెస్టిగేషన్ సెల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జి (అటామిక్ మినరల్సు డివిజన్) టి. సి. 13/159, కుటుంబియారోడ్, జగతీ, తిరువేండ్రం.
   స్టోర్సు : ఎం. వై. టి. 7589 (జీపు) 1 నెంబరు.
5. తేదీ, సమయము : 22—1—71 ఉదయం 10 గంటలు.
   వేలము స్థలము : సెంట్రల్ వెహికల్ డిపో, అవడి.
   స్టోర్సు : కారు 4 & Str 4×2 సెలూన్ డాడ్జి కింగ్స్,.... —10 నెంబర్లు
   లారీ 3 టన్ 4×2 బెడ్ పోర్డు, టి. ఎం. టి. 4×4 స్టూడిబేకర్ మేకే ట్రక్, పోర్డు, ఏక్ కంప్రెషర్ 6×4 పోర్డు, ఆర్మరీ డబ్ల్యు / షాప్ చెవర్లెట్, పోర్డు, జర్మటి ఆస్టిన్, లేలాండ్, రీ ట్రైవర్ — 81 నెంబర్లు
   ట్రైలర్ 2 టన్ 4 వీల్డ్ — 37 నెంబర్లు
   ట్రాక్టర్లు 6×4Hy అర్టి ఆల్బియన్ — 2 నెంబర్లు
   మొత్తం: 130 నెంబర్లు
6. తేదీ, సమయము : 23—1—71 ఉదయం 10 గంటలు.
   వేలము స్థలము : సెంట్రల్ వెహికల్ డిపో, అవడి.
   స్టోర్సు : ఎం. టి. స్పేర్స్.

ఆయిల్ సీల్ పవర్ టేకఆఫ్...	922	నెంబర్లు
బ్రిడ్జి కనెక్టింగ్ రాడ్...	2219	నెంబర్లు
లైనర్ మైన్ బ్రిడ్జి...	12439	నెంబర్లు
పిస్టన్ రింగ్ ఆసెంబ్లి...	1168	నెంబర్లు
ఆక్సిల్ ఆసెంబ్లిరియర్ కంప్లీట్		
పిన్ బ్రేక్స్ (డమ్మీ హోండిక్స్...	31	నెంబర్లు
రింగ్ సెట్ పిస్టన్...	3300	నెంబర్లు
లైనర్...	14869	నెంబర్లు
కనెక్టింగ్ రాడ్ ఆసెంబ్లి...	27000	నెంబర్లు
పిస్టన్ రింగ్ ఆసెంబ్లి...	4359	నెంబర్లు
బ్రిడ్జి కనెక్టింగ్ రాడ్...	7285	జతలు
బ్రిడ్జి యూనిట్ కనెక్టింగ్ రాడ్...	25955	నెంబర్లు
లైనింగ్ సెట్ రియర్ బ్రేక్స్...	7112	నెంబర్లు
పిస్టన్ అండ్ రింగ్...	6820	నెంబర్లు

7. తేదీ, సమయము : 27—1—71 ఉదయం 10—30 గంటలు.
   వేలము స్థలము : కలెక్టరేట్ ఆఫ్ సెంట్రల్ ఎక్సైజు, 21 నుంగంబాకం హైరోడ్, మద్రాసు—34.
   స్టోర్సు : పోర్డువాన్ ఎం డై బి 7753 —1 నెం.
8. తేదీ, సమయము : 27—1—71 మధ్యాహ్నం 12 గంటలు.
   వేలము స్థలము : టెలిఫోన్ ఎక్స్చేంజి,3మున్రోగేట్‌రోడ్,మద్రాసు—18.
   స్టోర్సు : డాడ్జి లారీ ఎం ఎస్ డై 0067 —1 నెంబరు
9. తేదీ, సమయము : పై కార్యక్రమము ముగిసిన తర్వాత.
   వేలము స్థలము : కర్షిన్ టెలిఫోన్ ఎక్సేంజి బిల్డింగ్, మద్రాసు—10.
   స్టోర్సు : పియట్ పిక్అప్‌వాన్ (ఎం. ఎస్. డై 8876)—1నెం.
10. తేదీ, సమయము : 28—1—71 ఉదయం 10—30 గంటలు.
    వేలము స్థలము : కలెక్టరేట్ ఆఫ్ కస్టమ్స్, కస్టమ్స్ హౌస్, మద్రాసు.
    స్టోర్సు : స్వాధీన పర్చుకున్న వాణిజ్య వస్తువులు 21 నెంబర్లు
11. తేదీ, సమయము : 28—1—71 మధ్యాహ్నం 1 గంట.
    వేలము స్థలము : సెంట్రల్ టెలిగ్రాఫ్ ఆఫీస్, మద్రాసు.
    స్టోర్సు : ఎక్సైర్‌మోడల్ విడబ్ల్యు 1161, 1/2 టన్ సింగిల్ కెపాసిటీ ఎయిర్ కండిషనర్ యూనిటు — 4నెంబర్లు.

పై తెలిపిన వేలమునకు సంబంధించి కేటలాగులు, అమ్మకపు షరతులు క్ర. నెం. 1 నుండి 4 మరియు 6 నుండి 11ఐటములకు అక్షన్లర్సు మెస్సర్స్ చంద్రమాణి అండ్ కంపెనీ 117 అర్మేనియన్ వీధి, మద్రాసు—1 వారినుండి, ఐదవ ఐటమునకు మెస్సర్స్ సుబ్రహ్మణియన్ అండ్ కంపెనీ, 5 తంబుచెట్టివీధి, మద్రాసు—1 వారినుండియు పొందవచ్చును.

స్టోర్సును ఆయాస్థలములలో స్టాక్ హోల్డింగ్ ఆఫీసర్ల పూర్వానుమతితో వేలమునకు 2 రోజులు ముందుగా తనిఖీ చేసుకొనవచ్చును.

డైరెక్టరేట్ ఆఫ్ సప్లయిస్ & డిస్పోజల్స్
శాస్త్రి భవన్, 35 హాడ్డోస్‌రోడ్
మద్రాసు—6

davp 70/588

తమిళనాడు లాటరీ బహుమతులు
రు. 65,00,000
తమిళనాడు 10 టిక్కెట్లు గల ఒక సెట్టు [10 సిరీస్] రు. 21-25.
తమిళనాడు సిండికేట్ 500 టిక్కెట్లు - 100 మంది మెంబర్లు - మెంబర్‌షిప్ ఒకటికి ఫీజు రు. 11-25 [పోస్టేజీతోసహా]. అన్ని రాష్ట్రముల టిక్కెట్లు సెట్ [25 టిక్కెట్లు] రు. 26/— పోస్టేజీ ఉచితం. ఎం.ఒ./పి.ఒ./డి.డి. పంపండి:
Phone: 81260
N. SUGALCHAND JAIN & CO.,
(Chief Distributors of all State Lottery Tickets)
320, Triplicane High Road, Madras-5.

పన్ను ఎగవేత నేరమని జ్ఞాపకం ఉంచుకోండి

దీని పరిణామాలు ఏమిటో తెలుసా మీకు...? ?

జాగ్రత్త వహించండి! అసత్య వివరాలతో పన్ను దరఖాస్తులను దాఖలు చేయటమనేది, ఆదాయపు పన్ను, సంపద పన్ను మరియు బహుమతి పన్ను చట్టాలక్రింద తీవ్రమైన నేరం. మీరు పన్ను దరఖాస్తులలో దాచిపెట్టిన మొత్తము కన్నా ఎక్కువే మీకు నష్టము అవ్వవచ్చు.

ఆదాయపు పన్ను చట్టం క్రింద, కనీస జరిమానా మీరు దరఖాస్తులో మరుగు పరచిన సొమ్ము మొత్తానికి సమానంగా ఉంటుంది. గరిష్ఠ జరిమానా దానికి రెండింతలు ఉంటుంది. ఇంతేకాక 6 నెలలు మొదలుకొని 2 సంవత్సరాల వరకు కఠిన జైలు శిక్ష విధింప బడవచ్చును.

సంపద పన్ను ఎగవేసేవారు, సంపదపన్ను చట్టం క్రింద, తీవ్ర దండనార్హులు. మరుగు పరచిన ఆస్తికి సమానమైన మొత్తంగాని లేదా ఆస్తి విలువను ఎంత తగ్గించి చూపించారో దానికి సమాన మొత్తం, లేదా పెంచి చూపించిన విలువ ఎక్కువ చూపించారో దానికి సమానమొత్తం, కనీస జరిమానాగా విధింప బడుతుంది. అయితే దీనికి రెట్టింపు కూడ జరిమానా విధింపవచ్చును. ఇంతేకాక 6 నెలలు మొదలుకొని రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధింపబడవచ్చును.

బహుమతి గురించి అసత్య వివరాలివ్వటం కూడ నేరమే. అలా అసత్య సమాచారం మూలంగా ఎంత పన్ను తగ్గబడుతుందో. అందులో 20 శాతము మొదలుకొని 1½ రెట్లవరకు జరిమానా విధింపబడుతుంది. ఇంతేకాక ఒక ఏడాది వరకూ సామాన్య జైలు శిక్ష లేదా రూ. 1,000 జరిమానా లేదా రెండూకూడా విధింపబడవచ్చును.

మీరు దాఖలు చేసిన దరఖాస్తులో

అసత్య సమాచారముంటే, వెంటనే సరియైన సమాచారము పంపండి. దానివల్ల దుష్పరిణామాలు ఉండవు.

కేంద్ర ప్రత్యక్ష పన్నుల సంస్థ
(రాజస్వము మరియు భీమా విభాగము)
ఆర్థిక మంత్రాలయము, భారత ప్రభుత్వము

davp 70/530

తమిళనాడులో వివిధ రాజకీయ పక్షాల ఎన్నికల సంచలనం

మద్రాసు, జనవరి 4: లోక్‌సభకు జరగబోవు మధ్యంతర ఎన్నికలు, రాష్ట్ర శాసన సభకు కూడా ఎన్నికలు జరిగే అవకాశాల దృష్ట్యా తమిళనాడు లోని మూడు పెద్దపార్టీలైన డి. ఎం. కె., సంస్థా కాంగ్రెస్, కొత్త కాంగ్రెస్ శిబిరాలలో నిన్న తీవ్ర సంచలనం కానవచ్చింది. ఆయా పార్టీలు తమ సమావేశాలలో తమ పార్టీల బలాబలాలను సమీక్షించి, ఎన్నికలతో తమ ఉద్దేశాలను గురించి చర్చించారు.

డి.ఎం.కె. జనరల్ కవున్సిల్ నిన్న సమావేశమై రాష్ట్ర శాసనసభ రద్దు సమస్యను గురించి చర్చించి, దీనిపై తుది నిర్ణయం తీసుకునే అధికారం పార్టీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులకు ఇస్తూ తీర్మానం ఆమోదించింది. అయితే శాసన సభను రద్దు చేయాలన్న ఏకాభిప్రాయం ఈ సమావేశంలో వ్యక్తమయినట్లు తెలుస్తున్నది.

ఇది ఇలా వుండగా సంస్థా కాంగ్రెస్, కొత్త కాంగ్రెస్ కార్యవర్గాలు తమ సమావేశాలలో లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలపై తమ దృష్టిని కేంద్రీకరించి, తమ విజయావకాశాలను గురించి మదింపు చేసుకున్నవి.

మొత్తం 39 స్థానాలలోను 25 స్థానాలలో తాము గెలుపొందవచ్చునని కొత్త కాంగ్రెస్ ఆశించగా, సంస్థా కాంగ్రెస్ అలాంటి అంచనాలు ఏమీ వేయలేదు. కాని జనవరి 17 నాటికి తమ అభ్యర్థుల జాబితాను ఖరారు చేయాలని నిశ్చయించింది.

ఇతర ప్రజాస్వామ్య పక్షాల కోసం కొన్ని స్థానాలు వదులుకోవడానికి మనం సిద్ధపడాలని సంస్థా కాంగ్రెస్ నాయకుడు శ్రీ కామరాజ జిల్లా నాయకులకు చెప్పినట్లు తెలుస్తున్నది.

రాష్ట్ర కొత్త కాంగ్రెస్‌అధ్యక్షుడు శ్రీ ఆర్. వి. స్వామినాధన్ నిన్నటి కార్యవర్గ సమావేశానంతరం పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ, ఏ నియోజక వర్గాలలో పోటీచేయాలన్న విషయమై తామింకా తుది నిర్ణయం తీసుకోలేదన్నారు.

పార్టీ అభ్యర్థులను నిర్ణయించేందుకు శ్రీయుతులు స్వామినాధన్, సి. సుబ్రహ్మణ్యం, ఎం. భక్తవత్సలంతో ఒక పార్లమెంటరీబోర్డును కార్యవర్గం ఏర్పాటు చేసింది. ఈ బోర్డు అవసరమైతే మరి ఇద్దరు సభ్యులను కోఆప్ట్ చేసుకుంటుంది.

ఇది ఇలా వుండగా నిన్న రాత్రి జనసంఘ అధ్యక్షుడు శ్రీ ఎస్. పి. వాసుదేవన్ స్వతంత్ర పార్టీ నాయకులతో సమావేశం జరిపిన అనంతరం ఒక ప్రకటన చేస్తూ, తమ పార్టీలమధ్య ఇచ్చిపుచ్చుకునే ధోరణి వుండాలన్న విషయం అంగీకరించబడిందని చెప్పారు.

రాష్ట్ర ఎస్. ఎస్. పి. సంయుక్త కార్యదర్శి శ్రీ వి. పి. కుమార్‌వేలు ఒక ప్రకటన చేస్తూ తమ పార్టీ రాష్ట్రంలో 11 స్థానాలకు పోటీ చేయగలదన్నారు.

తమిళనాడులో డి. ఎం. కె. ప్రభుత్వాన్ని, కేంద్రంలో ఇందిరా గాంధి ప్రభుత్వాన్ని విడగొట్టడానికి సంస్థా కాంగ్రెస్‌కు తాము పూర్తి మద్దతు ఇవ్వగలమని రాష్ట్ర ఎస్. ఎస్. పి. అధ్యక్షుడు శ్రీ పి. ఎస్. చిన్నదొరై ప్రకటించారు.

బీహార్ అసెంబ్లీ రద్దు కాదు

ముఖ్యమంత్రి స్పష్టీకరణ

పాట్నా, జనవరి 4: బీహార్ శాసన సభను రద్దు చేసి, మధ్యంతర ఎన్నికలు జరిపే అవకాశం లేదని ముఖ్యమంత్రి శ్రీ కర్పూరీ టాకూర్ నిన్న స్పష్టంగా ప్రకటించారు.

శాసనసభను రద్దు చేయాలని మేము కోరడం లేదు. అందుకు ఎన్నడూ సిఫార్సు చేయబోము. మాకు మెజారిటీ వుంది. మాది సుస్థిర ప్రభుత్వం అని శ్రీ టాకూర్ ఇక్కడ పత్రికా విలేఖరుల గోష్టిలో చెప్పారు.

లోక్‌సభకు అనంతపురం జిల్లానుండి కొత్త కాంగ్రెస్ అభ్యర్థులు

జిల్లానాయకులకు ముఖ్యమంత్రి పిలుపు

[స్వకీయ విలేఖరి.]

అనంతపురం, జనవరి 3: అనంతపురం జిల్లా, కొత్త కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ పి. వి. చౌదరిని, జిల్లా పరిషత్ అధ్యక్షుడు శ్రీ వై. సి. తిమ్మారెడ్డిని తక్షణం హైదరాబాద్‌కు రావలసిందిగా కోరుతూ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి మొన్న టెలిగ్రామ్ పంపారు.

అనంతపురం జిల్లానుండి లోక్‌సభకు అభ్యర్థులను నిర్ణయించే విషయంలో వీరితో ముఖ్యమంత్రి చర్చిస్తారని తెలుస్తున్నది.

శ్రీ చౌదరి, శ్రీ తిమ్మారెడ్డి మొన్న రాత్రే హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

అనంతపురం పురపాలక సంఘ సమావేశంనుండి సభ్యుని నిష్క్రమణ

అనంతపురం, జనవరి 3 : మొన్న జరిగిన అనంతపురం పురపాలక సంఘం ప్రత్యేక సమావేశం నుండి సభ్యుడు శ్రీ ఎస్. రామారావు నిష్క్రమించారు.

ప్రత్యేక సమావేశాన్ని వాయిదా వేయవలసిందిగా అధ్యక్షులు శ్రీ డి. జ్వాలనయ్యను సభ్యుడు కోరారు. అందుకు శ్రీ జ్వాలనయ్య నిరాకరించగా, శ్రీ రామారావు నిరసనగా సమావేశం జరిగే హాలు నుండి నిష్క్రమించారు.

ఆ తరువాత జరిగిన సాధారణ సమావేశానికి శ్రీ ఎస్. రామారావు హాజరయ్యారు.. స్వ. వి..

కొంతకాలంపాటు కేంద్రంలో పార్లమెంటరీయేతర ప్రభుత్వం

బి.కె.డి. నాయకుడు చరణ్ సింగ్ సూచన

రోహటక్, జనవరి 4: నిర్ణీత కాలంపాటు ప్రజలచే ప్రత్యేకంగా ఎన్నుకొనబడిన వ్యక్తి ఆధిపత్యం క్రింద కేంద్ర ప్రభుత్వం, పార్లమెంటరీ పద్ధతితో సంబంధం లేనిది ఏర్పాటు కావాలని భారతీయ క్రాంతిదళ్ అధ్యక్షుడు శ్రీ చరణ్‌సింగ్ నిన్న సూచించారు.

అలాంటి ప్రభుత్వాధిపతిని తొలగించే అధికారం కాని, అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం కాని వుండరాదని శ్రీ చరణ్‌సింగ్ హర్యానా రాష్ట్ర బి.కె.డి. ఆధ్వర్యాన ఏర్పాటైన బహిరంగ సభలో మాట్లాడుతూ పేర్కొన్నారు.

మధ్యంతర ఎన్నికలకు చరణ్‌సింగ్ హర్షం తెలుపుతూ మైనారిటీ పక్షం నాయకురాలైన శ్రీమతి గాంధికి సమగ్రమైన మంత్రివర్గంతో కొనసాగే హక్కు లేదని అన్నారు.

ఆ మంత్రివర్గం రాజీనామా చేయాలని లేదా ఆపద్ధర్మ ప్రభుత్వం స్థాయికి దానిని తగ్గించాలని ఆయన సూచించారు.

పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ ప్రకాశ్‌వీర్ శాస్త్రి మాట్లాడుతూ, దేశంలో క్షీణిస్తున్న ఆర్థిక పరిస్థితి మధ్యంతర ఎన్నికలకు ప్రధాన కారణమన్నారు. 700 నుంచి 800 కోట్ల రూపాయల లోటుతో బడ్జెట్ సమర్పించటానికి కేంద్ర ఆర్థిక మంత్రి ఇష్టపడడం లేదన్నారు.

బి. కె. డి. ఏడు రాష్ట్రాలలో 150 నుంచి 175 సీట్ల వరకు పోటీ చేయగలదని, మంత్రివర్గం భవిష్యత్తును నిర్ణయించగలిగినన్ని స్థానాలు గెలుచుకొనగలదన్న విశ్వాసంతో వున్నదని శ్రీ శాస్త్రి అన్నారు.

అంతకు ముందు శ్రీ చరణ్‌సింగ్ ఢిల్లీ నుంచి రోహటక్‌వరకు 55 కిలో మీటర్ల దూరం 100 కార్లతో ఊరేగించారు.

హర్యానాలో మద్యనిషేధం రద్దు చేయాలని, ఫజిల్కా, పరిసర ప్రాంతాలను వెంటనే హర్యానాలో విలీనం చేయాలని కోరుతూ సభలో రెండు తీర్మానాలు చేశారు.

ఇతర పార్టీలతో పొత్తు : కేరళ ఎస్.ఎస్.పి. ప్రయత్నం

కోజికోడ్, జనవరి 4 : లోక్‌సభకు జరిగే మధ్యంతర ఎన్నికలలో పోటీ చేయడానికి తమ పార్టీ కొత్త కాంగ్రెసు, మిని ఫ్రంట్ పార్టీలతో మినహా అన్ని పార్టీలతో పొత్తును సమకూర్చుకోడానికి ప్రయత్నించగలదని కేరళ ఎస్. ఎస్. పి. అధ్యక్షుడు శ్రీ కె.కె. అబూ, కేరళ శాసనసభలోని ఎస్. ఎస్. పి. నాయకుడు శ్రీ కె. శివరామ భారతి నిన్న పి.టి.ఐ. విలేఖరికి తెలియజేశారు.

మార్క్సిస్టుల నాయకత్వాన గల ఐక్య సంఘటనలో భాగస్వామి పక్షంగా తమ పార్టీ కొనసాగుతుందని, ఇదే సమయంలో విస్తృతమైన పొత్తు కోసం ఇతర పార్టీలతో సంప్రతింపులు జరుపుతుందని, సీట్ల సర్దుబాటు విషయమై మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీతో ఒకటి రెండులలో ప్రారంభించగలదని వారు తెలిపారు.

జనసంఘం వ్యూహం

కోజికోడ్, జనవరి 4: లోక్‌సభకు జరిగే మధ్యంతర ఎన్నికలలో పార్టీ అనుసరించదగు వ్యూహంగురించి రాష్ట్ర జనసంఘం కార్యవర్గం నిన్న రెండు రోజుల సమావేశాన్ని యిచ్చట ప్రారంభించింది.

వీలైనన్ని ఎక్కువ స్థానాలలో కొత్త కాంగ్రెసును దానితో పొత్తుపెట్టుకున్న పార్టీలను ఓడించటానికే జనసంఘ్ కృషి చేయాలని నేడు సమావేశంలో పాల్గొన్న పలువురు సభ్యులు అభిప్రాయపడ్డారు.

బెంగాల్ అసెంబ్లీకి ఎన్నికల నిర్వహణ: ఫార్వర్డ్‌బ్లాక్ ఇచ్ఛ

కలకత్తా, జనవరి 4: పశ్చిమబెంగాల్ రాష్ట్రశాసనసభకు ఎన్నికలు జరుగగలవని నిర్ణయాన్ని వెంటనే ప్రకటించి, లోక్‌సభకు, శాసన సభకు ఒకే రోజున ఎన్నికలు జరిపించాలని పశ్చిమబెంగాల్ ఫార్వర్డ్‌బ్లాక్ నిన్న కోరింది.

పశ్చిమబెంగాల్‌లో కొత్తకాంగ్రెసు గెలిచే అవకాశాలు లేనందున కేంద్రంలో అధికారంలోగల కొత్తకాంగ్రెసు ప్రభుత్వం రాష్ట్రప్రజలకు అన్యాయం చేస్తున్నదని ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర సంఘం ఒక తీర్మానంలో విమర్శించింది.

రాష్ట్రంలో శాంతి భద్రతస్థితి సరిగా లేనందున ఎన్నికలు జరుపటానికి వీలులేదని ప్రభుత్వం చెబుతున్నదని, అటువంటప్పుడు లోక్‌సభకు ఎన్నికలు ఎలాజరుపుతారు అని రాష్ట్ర సంఘం ప్రశ్నించింది.

స్వతంత్రపార్టీ అభ్యర్థుల ఎన్నిక తమిళనాడులో పార్టీ కార్యదర్శికి అధికారం

మద్రాసు, జనవరి 4: లోక్‌సభకు జరిగే మధ్యంతర ఎన్నికలకు శాసన సభకు ఎన్నికలు జరిగితే వీటికికూడా స్వతంత్రపార్టీ అభ్యర్థులను ఎన్నిక చేసే అధికారం తమిళనాడు స్వతంత్రపార్టీ పార్లమెంటరీ బోర్డు నిన్న రాష్ట్రపార్టీ కార్యదర్శి శ్రీ మరియస్వామికి యిచ్చింది.

సంస్థాకాంగ్రెసు నాయకుడు శ్రీ కామరాజుతో ఎప్పటికప్పుడు సంప్రతింపులు జరుపుతుండాలనీ, సంస్థాకాంగ్రెస్‌తో సహకరించి యీ విషయంలో పనిచేయాలనీ శ్రీ మరియస్వామిని పార్లమెంటరీ బోర్డు ఆదేశించింది.

సమావేశంలో పార్టీ వ్యవస్థాపకుడు రాజాజీ కూడా పాల్గొన్నారు.



అభిమానులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలతో !
శ్రీ పద్మాలయ సాహిత్య పదావళి నెం. 1 (రిజిష్టర్డు)
కీ సొ ల్యూ ష న్
(1) ఆరాధకులు, (2) వినాశానికి, (3) మితం,
(4) భార్య, (5) ధర్మము, (6) శిల్పకళానైపుణ్యము.
రాష్ట్రమంతటా మా పదావళికి ఏజంట్లు కావలెను. నెం. 2 ఎంట్రీ ఫారములకు, వివరములకు వ్రాయండి. నెం. 2 పదావళి ముగింపు తేదీ 19—1—71
శ్రీ పద్మాలయ సాహిత్య పదావళి (రిజిష్టర్డు)
సాతులూరు (పోస్టు) గుంటూరు (జిల్లా)

సంక్రాంతి బహుమతి అమ్మకము
తేదీ 12-1-1971 వరకు
సంక్రాంతికి మా బంగారు నగలను కొనండి
రూ. 250/- అంతకు మించిన విలువగల నగలను కొని, మేము బహుమతిగా యిచ్చు సొగసైన వెండి వస్తువును పొందండి.
నాదెళ్ల సంపత్తు శెట్టి & సన్
బంగారు, సీమకటములముల వ్యాపారులు,
177, N.S.C. బోస్ రోడ్, మద్రాసు-1.
Swastik

ఎన్నికలలో కొత్త కాంగ్రెసు కూటమిని ఓడించాలి

సంస్థా కాంగ్రెసు నాయకుడు మొరార్జీ విజ్ఞప్తి

అహమ్మదాబాద్, జనవరి 4: కమ్యూనిస్టు నియంతృత్వం ప్రమాదంనుండి దేశాన్ని రక్షించడానికి, దేశ సమైక్యతకు గల బెడదను నివారించడానికి అధికార కాంగ్రెసు, ముస్లిం లీగ్, కమ్యూనిస్టుల కూటమిని ఓడించవలసిందిగా సంస్థా కాంగ్రెసు నాయకుడు శ్రీ మొరార్జీదేశాయ్ నిన్న విజ్ఞప్తి చేశారు.

లోక్‌సభకు జరుగనున్న మధ్యంతర ఎన్నికల సందర్భంగా పార్టీ ప్రచారానికి నిన్న ఆయన ప్రారంభం చేశారు. నగర వ్యవస్థా కాంగ్రెసు కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. దేశం కమ్యూనిస్టువంధలో ముందుకు సాగాలా, లేక ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలా, లేక ముస్లిం లీగును ప్రోత్సహించడం ద్వారా మరొక దేశ విభజన జరగాలా అన్న విషయం ప్రజలు తీవ్రంగా యోచించాలన్నారు.

సమావేశంలో గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ హితేంద్రదేశాయ్, వ్యవస్థా కాంగ్రెసు ప్రదేశ్ సంఘం అధ్యక్షుడు శ్రీ జభాయ్ షా ప్రసంగించారు. రానున్న ఎన్నికలలో ఏ ఒక్క స్థానం కూడా ఇండికేటు వారికి దక్కనీయరాదన్నారు.

తమ ప్రగతిశీలక విధానాల అమలుకు ప్రజలనుండి తాజాగా ఆమోదముద్ర పొందడానికి లోక్‌సభ రద్దు చేశామని ప్రధాని చెపుతూ, ప్రజలను ప్రధాని పెడదారిన పట్టిస్తున్నదని శ్రీ దేశాయ్ చెప్పారు.

లోక్‌సభ ఎన్నడూ ఆమెకు అడ్డు రాలేదన్నారు. బ్యాంకుల జాతీయం బిల్లును చిన్న మెజారిటీతో ఆమోదించడం జరిగిందని, భరణాల రద్దు బిల్లును ఆమోదించిందని అన్నారు. ప్రధాని అంత బాహాటంగా చెప్పలేకపోయినా ఆమె రాజ్యాంగాన్ని మార్చ చూస్తున్నారన్నారు. ఎన్నికలలో ఆమె విజయం పొందితే తమ పార్టీకంటే యితరమైన పార్టీ ప్రభుత్వం సాగడాన్ని ఆమె అనుమతిస్తారా అన్నది సంశయాత్మకమైనవిషయమన్నారు.

కేరళలో అధికారంలోకిరావడానికి కమ్యూనిస్టులకు ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి తోడ్పడిందని శ్రీ మొరార్జీదేశాయ్ అన్నారు.

ప్రధాని విధానాలు ప్రజాస్వామ్యాన్ని భగ్నం చేస్తున్నాయని ముఖ్యమంత్రి శ్రీ హితేంద్రదేశాయ్ చెప్పారు. గుజరాత్‌లో సమైక్యంగా వ్యవహరించడంవల్ల సంస్థా కాంగ్రెసు ప్రభుత్వాన్ని గద్దె దించడానికి చేసిన ప్రయత్నాలన్ని విఫలమైనాయన్నారు. కొంతమంది పాత కాంగ్రెసు కార్యకర్తలు పార్టీని విడనాడి ఉండవచ్చునని, అయితే పార్టీలోని యువకులు నాయకత్వం బాధ్యత స్వీకరించడానికి ఉత్సాహంతో ముందుకు వచ్చారన్నారు.

ఎన్నికల సర్దుబాట్లు

అధికార కాంగ్రెసు, ముస్లిం లీగు, అకాలీదల్, డి. ఎం. కె. వగైరాల కలయికను మధ్యంతర ఎన్నికలలో వ్యవస్థా కాంగ్రెసు ఒంటరిగా పోరాడడంలో విజయం సాధించలేదని గుర్తించాలని గుజరాత్‌లో పార్టీ కార్యకర్తలకు శ్రీ మొరార్జీ విజ్ఞప్తి చేశారు.

దేశం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నదని గుర్తిస్తే సమైక్యత ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజాస్వామిక శక్తుల సమైక్య కృషి అవసరమని అన్నారు. ఇతర పార్టీలతో ఎన్నికల సర్దుబాటుకు వ్యవస్థా కాంగ్రెస్ నాయకత్వం తీసుకున్న నిర్ణయం సముచితమైనదని హర్షించగలరన్నారు.

దేశ ప్రయోజనం దృష్ట్యా ఎన్నికల సర్దుబాటు కావాలనే యితర రాష్ట్రాల పంథాను అనుసరించాలా లేదా అన్నది. రాష్ట్ర కాంగ్రెసు నాయకులు నిర్ణయించవలసి వుందన్నారు.

ఒంటరిగా పోరి గుజరాత్‌లో వ్యవస్థా కాంగ్రెసు విజయం పొందినా ఇందిరా గాంధి అధికారంలోకి తిరిగి వస్తే తలఒగ్గవలసి వస్తుందన్నారు. ఆ ప్రధాన విధానాల నుండి వ్యవస్థా కాంగ్రెసు వైదొలగదన్నారు. ఉమ్మడి కార్యక్రమం పై ఎన్నికల సర్దుబాట్లు ఉంటాయన్నారు. వ్యవస్థా కాంగ్రెసును వదలివెళ్లిన వారెవ్వరు సిద్ధాంతాలకోసం అధికార కాంగ్రెసులో చేరలేదన్నారు.

ఫిలిం పంపిణీ ఆఫీసు వేళలలో మార్పు

విజయవాడ, జనవరి 4 : స్థానికంగా ఉండే ఫిలిం పంపిణీ కార్యాలయములు ఇక నుండి శని వారములలో ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నము 2 గంటల వరకు మాత్రమే పని చేయ గలవని తెలియ పర్చారు.



ఏజెంట్లు:—అమర్ టెక్స్‌టైల్స్, వస్త్రలత ఎదుట విజయవాడ—1, * సూర్యకాంత్ రతిలాల్ అండ్ కో, 40, రామగోపాల్ పేట, సికింద్రాబాదు.
స్టాకిస్టులు :—విజయవాడ : కీర్తి క్లాత్ కార్పొరేషన్, 68 వస్త్రలత, ఇందిరా టెక్స్‌టైల్స్, వస్త్రలత,
హైదరాబాద్ : ఎస్. వినోద్‌కుమార్, పటేల్ మార్కెట్, సులేఖా సిల్క్ హౌస్, పత్తర్‌గట్టి.

Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, Gandhinagar Vijayawada-3
Editor: S. Sambhu Prasad. Phone: Vijayawada 5667 & 5226